
దళిత గోవిందం



దళిత గోవిందం

తెలియదగ్గ దళితుల కథలు

కళాగౌతమి

డా॥ బులుసు వేంకట సత్యనారాయణమూర్తి

"పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహకారంతో ముద్రితం"

కళాగౌతమి

6-13-15, టి.నగర్, రాజమండ్రి

సెల్ : 9866290025

దళిత గోవిందం

రచయిత	-	డా॥ బులుసు వి.ఎస్.మూర్తి
మొదటి ముద్రణ	-	**2014**
సర్వహక్కులు రచయితవి		
ప్రతులు	-	**1000**
వెల	-	రూ. **50/-**
డి.టి.పి.	-	సిహెచ్. శ్రీనివాస్ ఎస్.ఎస్. డిజైన్స్, రాజమండ్రి సెల్ - **7893911173**
ముద్రణ	-	సుధా ఆఫ్‌సెట్ రంగ్రీజుపేట, రాజమండ్రి సెల్ - **9440372046**
ప్రతులకు	-	కళాగౌతమి **6-13-15**, టి. నగర్, రాజమండ్రి - **533 101** ఫోన్ - **2441829**, సెల్ - **98662 90025**

కళాప్రపూర్ణ డా॥ వావిలాల గోపాలకృష్ణయ్య

ఆమోదము

శ్రీ బి.వి.యస్.మూర్తి రచించిన **'దళిత గోవిందం'** వివరంగ చూచాను. కొందరు మహానుభావుల చరిత్రలు, వారి మహిమలు చదువగలిగాను. భాష స్పష్టంగ , సరళంగ దానికదే చదివించగల శక్తితో నడిచింది. మహిమాన్వితులు, కుల,మత ప్రమేయం లేని తేజస్వంతులు స్వీయప్రతిభతో, అమలిన భక్తితో తమ విశ్వాసం ఏ విధంగా ఉన్నదో, దానినే చివరివరకు సాగించటం, సాధించటం జరిగింది. ఆధునిక యుగంలో హేతువాదంతో చర్చించి నమ్మలేక పోతున్నామని చెప్పినా, జరిగిన కథలు, జీవితాలు, వారి మహత్తులు ఎవరు కాదన్నా అవి అందరినీ ఆకట్టకోవడం జరిగింది. మూఢవిశ్వాసంగ పరిగణించవలసిన అవసరం లేకుండ ప్రజానీకానికి, నమ్మిన భక్తులకు కొంగు బంగారంగ ఉంటున్నాయి. శైవ, వైష్ణవ, శాక్తేయ, బౌద్ధ, జైన సిద్ధాంతాలు నమ్మిన మనీషులు సిద్ధాంతపరంగ మనకు విభిన్నత కనిపించినా వారందరి ఏకాగ్రత, పరమ విశ్వాసం వారికి విముక్తికి, ముక్తికి ఆధారమయ్యింది. రచనా శైలిలోను, పదనిర్మాణంలోను, రచన సాఫీగా సాగించిన మూర్తిగారికి అభినందనలు. చదువరులు ఈ కథలను చదివి స్ఫూర్తి పొందగలరని విశ్వసిస్తున్నాను.

మహాకవి, కళాప్రపూర్ణ, పద్మశ్రీ డా॥ బోయి భీమన్న

"ఆశీస్సూత్రం"

"మనందరం ఒక్కటే. సర్వమానవ సౌభ్రాత్రమే భారత ధర్మం. విశ్వమానవ శ్రేయస్సే మన భారత లక్ష్యం. సకలలోక కల్యాణమే మన భారతీయ ఆదర్శం." అంటూ తనకి ఒక లక్ష్యాన్ని ప్రతిపాదించుకొని, దాని కనుగుణంగా భారత సమాజాన్ని కులభేద రహితంగా తీర్చి దిద్దే పరమోద్దేశంతో కలం చేతబట్టిన మంచి రచయిత డా॥ బి.వి.యస్.మూర్తిగారు. ఆయన లేఖినీ లత పుష్పించిన ఉత్తమ రచన ఈ "దళిత గోవిందం".

డా॥ మూర్తిగారి పూర్తి పేరు బులుసు వేంకటసత్య నారాయణమూర్తి. తెలుగు, కన్నడ భారతముల తులనాత్మక పరిశోధనా వ్యాసం వ్రాసి బెంగళూరు విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటు పట్టా సంపాదించుకున్న మహా మనీషి, వ్యుత్పన్నుడూ మూర్తిగారు. తన ప్రతిభనూ, పాండిత్యాన్నీ ప్రజాభ్యున్నతికోసం వెచ్చించ దలచి రచనా వ్యాసంగానికి పూనుకొన్న ఉత్తమ పురుషు డీయన. ఇప్పటికే ఎన్నో రచనలు చేశారు. ప్రస్తుత రచన ఈ "దళిత గోవిందం".

ఈ "దళిత గోవిందం"లో 12 కథలు ఉన్నాయి. సాధారణంగా ఇవన్నీ అందరకూ తెలిసినవే అయినా, వీటిని మూర్తిగారు తీర్చిదిద్దిన తీరు పరమ రమణీయంగా ఉంది. భారతీయ ఆత్మను ప్రస్ఫుటం చేస్తూ, జాతిని ఏకజాతిగా సంఘటితం చేస్తూ ఆయన ఈ రచనను వెలువరించడంలో అఖిల భారత శ్రేయస్సే కాక, విశ్వ మానవ కల్యాణం కూడా నిక్షిప్తమై ఉన్నదనవచ్చు.

ఈ గ్రంథంలోని ప్రతి కథను ప్రత్యక్షర పరిశీలనతో క్షుణ్ణంగా చదివాను. ప్రతి కథ గురించి ఎంతగానో వ్రాయాలను కున్నాను. అయినా, మౌలిక కథలే మీ ముందున్నాయి కదా! చదవండి! భారతీయత గురించిన యదార్థం తెలుసుకోండి! ఇకనైనా అస్పృశ్యతను నిర్మూలించి కులభేదాలను రూపుమాపి ఏకభారత జాతిని నిర్మించడానికి పూనుకోండి. ఇదే హిందూ సమాజానికి, యువజనానికి ఈ గ్రంథ పీఠిక ద్వారా నేనిస్తున్న సలహా.

జాతీయ సమైక్యత కోసమూ, కులభేదాల నిర్మూలన కోసమూ ఎక్కువగా మారవలసింది దళితులు కాదు, దళితేతరులు. దళితేతరులంటే సవర్ణ హిందువులలోని అగ్రకులాలవారు. కాగా, అగ్రకులాల అగ్రరచయితల నుంచే ఈ తరహా రచనలు వెలువడ వలసి ఉంది. "మాలపల్లి" రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణగారు, "నిరుద్ధ భారతం" రచయిత మంగిపూడి వెంకటశర్మగారు అటువంటివారు. ఆ పంక్తిలోకి ఇప్పుడు డా॥ మూర్తిగారు చేరడం ఆనందదాయకం.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు

శ్రీ కొలకలూరి ఇనాక్ "శుభాకాంక్ష"

డా॥ బి.వి.యస్. మూర్తిగారు వ్రాసిన "దళిత గోవిందం" చదివాను. ఇందులో దళితుల కథలు ఉన్నాయి. ఆ దళితులు స్త్రీలు, పురుషులు ఉన్నారు. పురాణ కాలంనుంచి నేటిదాకా ఏదో రంగంలో ప్రసిద్ధిపొందిన దళితుల గాథలు ఇందులో పొందుపరుపబడి ఉన్నాయి. పురాణ పురుషులు, చారిత్రక వ్యక్తులు, భారతదేశ స్వాతంత్ర్యానంతర సాంఘిక జీవులు ఇందులో కనబడతారు. చాలమంది మత నేపథ్యంనుంచి గోచరమవుతారు. వీళ్ళు భక్తులుగా, తాపసులుగా, వేదాంతులుగా దర్శనమిస్తారు. వీళ్ళంతా అంటరాని కులాలవాళ్లు కావడమే ఈ గ్రంథ ప్రాధాన్యం. వీళ్ళు సాధారణంగా నాటి సుస్థిర వ్యవస్థను – నాడు సుస్థిరంగా వేళ్ళూని నిలబడ్డ వర్ణవ్యవస్థను ప్రశ్నించిన వాళ్ళుగా కనబడతారు. లేదంటే మీరెక్కువా కాదు, మేము తక్కువా కాదు అనయినా అన్నవాళ్ళుగా మిగులుతారు.

ఈ దళితులు జీవితాలలోని దళితత్వం ప్రధాన కారణమై వాళ్ళ పోరాటం ఉంది. పోరాటం భగవదర్పితంగా సాగినా సాంఘిక నేపథ్యం నుంచి అది పోరాటమే. వాళ్ళు విప్లవ వీరులే. వాళ్ళ జీవితం లోకానికి అందివ్వటం రచయిత అభీష్టం. అదీ ఈ సంవత్సరమే కావటం అదృష్టం. డా॥ మూర్తి ఒక సత్కార్యం సత్వరంగా నిర్వహించటం అభినందనార్హం.

డా॥ బి.వి.యస్. మూర్తికి ఈ దళితుల మీద ప్రేమ ఉండటం ఆనందించే విషయమే. ఈ దళితుల జీవితం చక్కగా రూపు దిద్దుకుంది. భాష బాగుంది. రచనా విధానం బాగుంది. పలుకున్న మనిషి పలుకుబడికి ప్రాణం పోయటం పరిశీలనార్హం. డా॥ మూర్తికి సంస్కృత పదజాలం బాగా ఇష్టం. సంస్కృత సమాస సంసృష్టిలో సంతుష్టి పొందే ఇష్టారాజ్యం రచయిత సొంతం.

డా॥ మూర్తి సాహితీ సంపన్నుడయిన నిత్య సత్య వ్రతుడు. కాకపోతే నన్ను శుభాకాంక్ష కోరి ఉండడు. అందుకే అతను అభిమానవంతుడు. సామాన్యుల సృష్టి అయితే ఇంతగా పట్టించుకునే పని ఉండదు. ఇది విశిష్ట సృష్టి. విశిష్ట ప్రయోజన దృష్టి జన్య సృష్టి.

ఒక సత్కార్యం చేయాలన్న సంకల్పంతో ఉద్యమించిన మూర్తి ప్రయత్నం గొప్పది. రచన గొప్పది. దృష్టి గొప్పది. ఇది సంఘం ముందడుగు. మరో అడుగు ముందుకు వేయడానికి సహాయపడే సాహిత్య కృషి. ఈ "దళిత గోవిందం" సాహితీ లోకం, విమర్శక ప్రపంచం, దళిత సామ్రాజ్యం ఆదరిస్తుందని ఆశిస్తూ ఈ "శుభాకాంక్ష" అందిస్తున్నాను.

డా॥ అంబేద్కరు పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, అధ్యక్షులు

మాజీ పార్లమెంట్ సభ్యులు, ఐ.ఎ.యస్

శ్రీ కె.యస్.ఆర్. మూర్తి 'అభినందన'

'కులానికి తక్కువైనా గుణానికి తక్కువ లేదని సందర్భాన్నిబట్టి అంటాము. ఈ గ్రంథంలోని ప్రముఖ వ్యక్తులందరూ దళితజాతులకు చెందినవారు. అయినా వారు ఆయా రంగాలలో పురాణ ప్రసిద్ధులు. దళితజాతిలో పుట్టినా ఏ రంగంలోనూ దళితులు అగ్రవర్ణాల వారికి తీసిపోరు అని ఋజువు చేయటానికి ఈ పుస్తకంలోని వ్యక్తులే మనకి మంచి ఉదాహరణ.

ఈ సంవత్సరం (1991-92) బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ శతజయంతి ఉత్సవాలు అటు ప్రభుత్వం వారు, ఇటు ప్రజలు ఉత్సాహంతో గొప్పగా చేస్తున్నారు. డా॥ అంబేద్కర్ దళితుడిగ పుట్టాడు. దళితజాతుల ఉద్ధరణకు జీవితాంతం ఒంటరిగా పోరాడాడు. అటువంటి డా॥ అంబేద్కర్ గురించి కూడా ఇందులో వచ్చి ఉంటే బాగుండేది. అలాగే బాబూ జగజ్జీవనరామ్, దామోదరం సంజీవయ్య గారలు దేశనాయకులు. దేశానికి, దళితజాతుల శ్రేయస్సుకు వారు ఎంతో సేవ చేశారు. అలాగే దళిత జాతుల్లో పుట్టిన తెలుగు బిడ్డలు, గొప్ప కవులు జాషువ, బోయి భీమన్నలు. దళితుల్ని చైతన్యవంతుల్ని చేయడానికి వీరు ఎన్నో రచనలు చేశారు. వీరిని గురించి కూడా పుస్తకాలు రావాలి. గ్రంథకర్త వీరందరి గురించి త్వరలో వేరొక గ్రంథం వ్రాస్తారని ఆశిస్తాను.

ఈ గ్రంథం ఈ తరం యువతీ, యువకులకు ముఖ్యంగా బాలబాలికలకు ఎంతో ఉపయోగపడుతుందని నా నమ్మకం. పురాణాలలో, చరిత్రలో కనిపించే ప్రముఖ దళితుల గురించి ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు. భాష సరళంగానే ఉంది. ఇంకా సరళంగా, ఇంకా తేలికగా ఉండాలంటాను నేను. కేవలం కొద్దిగా చదువుకున్న జనసామాన్యానికి బాగా అర్థమయ్యే విధంగా చాలా సింపుల్‌గా, సరళంగా ఉండాలంటాను.

మొత్తంమీద మూర్తిగారి కృషి ప్రశంసనీయమైనది. ఆయన్ని అభినందిస్తున్నాను.

విప్లవజ్యోతి

భారతరత్న - డా॥ అంబేద్కరు

1991 - 92 భారతరత్న డా॥ అంబేద్కరు శతజయంతి సంవత్సరంగ మనం జరుపుకున్నాం. ఆ శతజయంతి సంవత్సరంలో వెలువడింది విప్లవజ్యోతికి నీరాజనంగ ఈ "దళిత గోవిందం". ఎంత కాలం గడిచినా డా॥ అంబేద్కరు ఆశయాలను స్మరించుకోవడం మన కనీస కర్తవ్యం.

హైందవ సమాజం కులభేదాలను సృష్టించుకొని, పరస్పరం ద్వేషించుకుంటూ అంతఃకలహాలతో, అనైక్యతతో నిర్వీర్యమై పోయిన దురదృష్ట కాలమది. మన సొంత మనుషులనే మనం హీనంగా చూస్తూ అవమానించి, హింసించి దూరంగా గెంటివేస్తూ, మరో ప్రక్క పరాయి గడ్డనుంచి వచ్చిన దోపిడీ దొరలకు పాదసేవలు చేయడానికి వెనుకాడని దౌర్భాగ్య కాలమది. సర్వమానవ సమానత్వం, ధర్మ సంస్థాపనం ప్రబోధించడానికి, కులమత ద్వేషాలనే విష వృక్షాలను పెకలించి ఐకమత్యం పెంపొందించడానికి సమర్థుడైన విప్లవ ప్రవక్తకోసం దేశం ఎదురు చూస్తున్న నిస్సహాయ కాలమది. అటువంటి విపత్కర సమయంలో జన్మించిన లోకోత్తర విప్లవ జ్యోతి డా॥ అంబేద్కరు.

డా॥ భీమరావు రామ్‌జీ అంబేద్కరు 14-4-1891లో ఇండోర్ సంస్థానంలోని 'మాహూ' అనే గ్రామంలో జన్మించాడు. చక్కని విద్యావంతుల కుటుంబంలో జన్మించి, ధన ధాన్యాలతో తులతూగుతూ పాశ్చాత్య విద్యాలయాలలో అభ్యసించి ఔన్నత్యాన్ని, యశస్సుని పొందడం పెద్ద విశేషంగ చెప్పుకోవల్సిందేమీ కాదు. అలాంటి వాళ్ళెందరో, అలా కాకుండా సంఘంచేత వెలివేయబడ్డ ఓ కులంలో జన్మించి, ఏవిధమైన ప్రోత్సాహము, ప్రోద్బలము లేకుండా ఉన్నత విద్యావంతుడై "తన మేధాశక్తి, తనవారలైన దళితుల ఉద్ధరణ కోసమే" అని అహర్నిశలు పోరాడడం దొడ్డ విశేషం. అదే అంబేద్కరు ఘనత. మానవ సమాజానికే ఆదర్శప్రాయం.

మహాత్ముల జీవిత చరిత్ర పుటల్లో వారు పగలు, రాత్రి జీవితాంతం పరిస్థితులను ఎదుర్కోవడమే మనం చూస్తూ ఉంటాం. తమ చుట్టూ ఉన్న పరిస్థితులతో సర్వకాల సర్వావస్థలలోను పోరాడడం వల్లనే వారు దేశనేతలుగ కీర్తింప బడ్డారు. అటువంటి దేశనేతలు ఎందరో సాంఘిక అసమానతలు తొలగించడానికి, నిమ్నకులాలకు అభ్యుదయ మార్గాలు అందించడానికి కృషి చేశారు. అయితే సాంఘిక న్యాయాన్ని కోరడం నిమ్నుల జన్మ హక్కనీ, దానిని ఆమోదించి అమలు జరపడం సవర్ణుల బాధ్యత అనీ ఉద్ఘాటించినవాడు ఒక్క అంబేద్కరే. అందుకే ఆయన పుట్టుక నిమ్న కులాలకు, అగ్ర వర్ణాలకు కూడా రక్షక తారా మహోదయమైంది. "పోరాడండి - ఇంకా పోరాడండి, త్యాగాలు చెయ్యండి - ఇంకా

త్యాగాలు చెయ్యండి. త్యాగాలు చేస్తూ కష్టాల నెదుర్కొంటూ పోరాట మార్గంలో ముందుకు సాగిపోతేనే మీకు ముక్తి లభిస్తుంది." అనేదే డా॥ అంబేద్కరు జీవన ప్రబోధం.

జాతిచేత బ్రాహ్మణుడే అయినా ఈ కులాలు మానవ కల్పితాలు అని భీమరావును చేరదీసి తన శిష్యునిద్వారా చిరంజీవియైన అంబేద్కరు గురువులు ధన్యజీవులు. గురువు నామమే తన నామముగా అంబేద్కరూ చరితార్థుడు. ఆనాటి శిష్యులకి వారి గురువులపై అలాంటి భక్తి ఉండేది. భక్తుల యోగక్షేమాలు భగవంతుడు వహిస్తాడు. అలాగే తన శిష్యుడైన భీమరావును తీర్చదిద్ది దేశసేవకు అంకిత మిచ్చిన పుణ్యాత్ములైన ఆ బ్రాహ్మణ అంబేద్కరు గురువులు ప్రాతఃస్మరణీయులు. తమకు మేలు చేసిన వారిని మరిచిపోక పోవడం మానవత్వం. వారివల్లే పైకి వచ్చి మళ్ళీ వారినే దూషించడం దానవత్వం. ఇది అంబేద్కరు అనుసరించి, జాతికి అందించిన సందేశం.

అంబేద్కరు నడిపిన తొలి ఉద్యమం 1927 చౌదర్ చెఱువు నీటి ఉద్యమం. ఆ ఉద్యమంలో లభించిన విజయంతో దళితులలో ఆత్మ విశ్వాసం పెరిగింది. ఇంగ్లాండులో రౌండు టేబుల్ సమావేశంలో అంబేద్కరు చేసిన వాదన దళితుల సమస్యను ప్రపంచ దృష్టిని ఆకర్షింప చేసింది. దళితులకి రక్షణలు లేకపోతే స్వాతంత్ర్యం లభించినా మళ్ళీ అంతఃకలహాలతో, కుల యుద్ధాలతో, విదేశీ జోక్యాలతో దేశం అల్లకల్లోలము అయిపోతుందని డా॥ అంబేద్కరు భయపడ్డాడు. సాంఘిక, రాజకీయ రంగాలలో తలయెత్తిన మహా కల్లోలంలో స్థితప్రజ్ఞుడై, విజయుడై, ధర్మవీరుడై గెలిచి నిలిచినవాడు డా॥ అంబేద్కరు.

డా॥ అంబేద్కరు స్వతంత్ర భారత రాజ్యాంగాన్ని రూపొందించిన ప్రతిభాశాలి. కోట్లాది ప్రజల జీవన విధానాన్ని తీర్చదిద్దవలసిన రాజ్యాంగాన్ని నిర్మించడమంటే, అది సామాన్యమైన విషయం కాదు. డా॥ అంబేద్కరుకుగల ధర్మశాస్త్ర పరిజ్ఞానం, నిరుపమాన బుద్ధికుశలత పరిశీలించిన తరువాతే ఆయనకు ఈ పని అప్పగించడం జరిగింది. అలాగే "హిందూకోడ్" బిల్లును లోక్‌సభకు సమర్పించిన భాగ్యశాలి డా॥ అంబేద్కరు.

డా॥ అంబేద్కరు నిర్భయంగ తన మనసులోని మాటను చెప్పగలిగేవాడు. రాజ్యాంగాన్ని అమలుపరచడం గురించి "దేవతలకోసం మనం నిర్మించుకున్న అద్భుత దేవాలయం రాజ్యాంగం. కాని అందులో దేవుళ్ళను ప్రతిష్ఠించక ముందే దెయ్యాలు వచ్చి తిష్ఠ వేశాయి" అని ఆవేదన చెందేడు ఆయన. స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరభావం ఆదర్శంగ తీసికొని నవ సమాజ నిర్మాణం జరగాలని డా॥ అంబేద్కరు కోరిక. ధర్మం అసమానత్వాన్ని బలపరిస్తే అది ధర్మమే అనిపించుకోదు. సమాజమంటే మనుషులందరి కలయికే. హిందూ ధర్మ శాస్త్రాలు దీనులు దళితుల హితాన్ని కోరే విధంగ, శ్రేయస్సును కూర్చే విధంగ మార్పు చెందాలని ఆయన వాంఛ.

అస్పృశ్యుల దీనస్థితికి చలించి గాంధీ తాత్త్విక ధోరణిలో వారికి పెట్టిన పేరు "హరిజనులు". హైందవ సంఘంలో అస్పృశ్యులుగ తమను దూరం చేసి, తమకు తగిన స్థానం, గుర్తింపు లేదనే లక్ష్యంతో పోరాటమార్గాన్ని దృష్టిలో పెట్టుకుని అంబేద్కరు "దళితులు" అని వారికి పేరు పెట్టాడు. "మానవ సమాజములోని నైతిక విలువలు వర్థిల్లాలంటే అందుకు మతమే గట్టి పునాది" అన్నాడు డా॥ అంబేద్కరు.

అంటరాని వాడుగ తాను పొందిన అమానుష అవమానాలు ఇకపై తన జాతివారికి

ఉండరాదని అంబేద్కరు తలచేడు. అస్పృశ్యతను తొలగించి హిందూ మతాన్ని సంస్కరించడానికి అంబేద్కరు ఇరవై ఏళ్ళు కృషీ, తపస్సు చేశాడు. చివరకు తాను సాధించ దలచుకున్న ఫలితాలకోసం బౌద్ధమతంలో ప్రవేశించాడు. అంబేద్కరును అన్య మతాల వాళ్ళు ఆహ్వానించేరు. ప్రలోభ పెట్టారు. దేశభక్తుడైన, విజ్ఞానవంతుడైన అంబేద్కరు వారి ప్రలోభాలకు లొంగలేదు. బౌద్ధమతం ఈ దేశంలో పుట్టింది. హిందూ మతాన్ని చిలికి తీసిన వెన్న లాంటిది బౌద్ధమతం. భారతీయ మైనది. కనుకనే అంబేద్కరు దానిని అనుసరించాడు. పరాయి పాలనను, పరాయి మతాన్ని ఈ విధంగా తిరస్కరించి తన జాతికి చక్కని ఆదర్శ మార్గాన్ని అందించాడు డా॥ అంబేద్కరు.

సాధారణంగా మత ప్రవక్తలు అందరూ ఆధ్యాత్మిక జీవితానికే ప్రాధాన్యతను ఇచ్చారు. అలాకాక, ప్రవక్తలలో కారల్‌మార్క్సు రాజకీయ రంగానికి ప్రాధాన్యత నిచ్చాడు. అది సరికాదని తలంచి డా॥ అంబేద్కరు సాంఘిక జీవనానికి ప్రాముఖ్యతను ఇచ్చాడు. అందుకే భారతరత్న డా॥ అంబేద్కరు ప్రతిపాదించిన నవయాన బౌద్ధాన్ని "అంబేద్కరిజం" అని చెప్పుకుంటున్నాం. మార్క్సిజం ఒక వర్గాన్ని బలపరుస్తూ, మరొక వర్గాన్ని వ్యతిరేకిస్తూంది. అంబేద్కరిజం సర్వవర్గ శ్రేయోదాయిని. బహుజన హితదాయిని, వర్గ రహితమైన, వ్యక్తి నిష్ఠమైన మానవతా ప్రధానమైన విధి విధానమది. విశ్వ మానవసమాజ నిర్మాణానికి, వసుధైక కుటుంబం ఆవిష్కారానికి అంబేద్కరిజం మూలాధారము అవుతుంది.

కర్మ సిద్ధాంతముపై నడుస్తున్న ఈ భారత భూమిలో దళితుడు ఎంతగా పతనమయ్యాడో, అంతగా ఉన్నతుడు కావడానికి ముందుకు రావాలి. "వేద వేదాంగ వైభవాలపై నాకుగల వారసత్వపు హక్కులు దొంగిలించబడి ఇక్కడే పాతిపెట్టబడినాయి" అంటాడు కళాప్రపూర్ణ, పద్మశ్రీ బోయి భీమన్న. ఆచారమనే పాశాలతో బంధింపబడి ఉంది ఈ హిందూ సంఘం. జడప్రాయమయిన దురారాధ్యమయిన ఈ హిందూ సంఘానికి ధర్మోద్ధరణావశ్యకత ఎంతయినా ఉంది. అలాంటి స్థితికి దర్పన రూపమే నా యీ "దళిత గోవిందం".

ఈ దళితుల పవిత్ర చరిత్రలు అంత్య కులాలవారికి ఆత్మ విశ్వాసాన్ని, అగ్ర కులాలవారికి అభిమాన నిర్మూలనాన్ని కలిగించడానికి సాధనభూతం కావాలి. అగ్ర వర్ణాలవారు పశ్చాత్తాపం పొంది హరిజనోద్ధరణాన్ని తమ స్వధర్మ నిర్వహణంగా నిర్వర్తించ గలగడమే ఈ గ్రంథ రచనలోని పరమార్థం. హరిజన సోదరులు తమ యదార్థ స్థానాన్ని గుర్తించి సంఘాన్ని బలహీనపరిచే చర్యలకు పాలుపడక, తామూ హిందువులమేనని తమ స్థానంకోసం, తమదైన హక్కుకోసం పోరాడాలనేదే దీని అంతరార్థం.

21వ శతాబ్దంలోకి శరవేగంతో అడుగిడుతున్న మన సమాజానికి సమ సమానత్వాన్ని బోధించే ఈ రచనద్వారా నా వంతు కర్తవ్యాన్ని నేను అందిస్తున్నాను. ఆచరణలో అందుకోవలసిన బాధ్యత మరి సమాజానిదే. ఫలితాన్ని నిర్ణయించేది మనం కాదు, ఆ పని కాలానిది.

సమ భావం – సమ ధర్మం
సహ జీవనం – అనివార్యం

ఇదీ వరస

అరుంధతి

బ్రహ్మదేవుని మనః సంకల్ప మాత్రంచేతనే ఏ పరమ తపస్వి ప్రాదుర్భవించాడో? ఏ శమాధికుడైన మహానుభావుణ్ణి కౌశికుడు సత్యవాక్య పరిపాలకుణ్ణి గావించాడో? ఆదిశేషునిచేత అవధరింపబడుతూన్న ఈ భూభారాన్నంతను ఏ బ్రహ్మమౌని బ్రహ్మదండం భరించిందో? కలశజుడు గౌరవభావంతో ధరిచడంచేత ఏ మహాత్ముని కమండలం తులకించిందో? మహనీయమైన మార్తాండ మండల కాంతులను ఏ మహనీయుని కావిపంచె వహించిందో? అలాంటి వశిష్ఠ మహర్షి బాల్యంనుంచీ తపోదీక్ష వహించి చిరకాలం తపస్సు చేశాడు. అతని కఠోర తపస్సుకు బ్రహ్మదేవుడు సంతోషించి, వచ్చి అతని ముందు నిలిచాడు.

బ్రహ్మ : కుమారా! నీ కఠోర తపోదీక్షకు మెచ్చుకున్నాను. నీ తపః సామర్థ్యంతో మా మనస్సును గెలిచావు. ఇక్ష్వాకునరపాలుడు నిండుమనంబుతో నిన్ను తమకు పురోహితుణ్ణి గావించు కోవాలనుకుంటున్నాడు. ఇక నీ తపోదీక్షను, బ్రహ్మచర్యవ్రతాన్ని విరమించు. గృహస్థ ధర్మాన్ని స్వీకరించు. నీవంటి మునిశ్రేష్ఠుడు భార్య లేకుండా ఉండడం ధర్మం కాదు సుమా! అందుచేత తగిన కన్యను వివాహం చేసుకో. నీకు శుభం కలుగుతుంది.

వశిష్ఠుడు : తండ్రీ! నీ ఆజ్ఞ నాకు శిరోధార్యము. నా ప్రార్థనను తెలుపడానికి అంగీకరించండి. నేను నా మనస్సుకు అంగీకారయోగ్యమైన కాంతను, ఆమె ఏ జాతికి చెందినదైనా సరే, చేపట్టి నా అర్థాంగిగా చేసుకొంటాను. మీరు 'తథాస్తు' అని అంటే నేనిక సత్వరమే కన్యాన్వేషణకై బయలు దేరతాను.

బ్రహ్మ : తథాస్తు. నీ అభీష్టము ప్రకారమే జరుగుతుంది నాయనా!

వశిష్ఠుడు తనకు భార్య కాదగిన కన్యను వెదక్కుంటూ బయలుదేరాడు. తన అంగవస్త్రం కొంగున కొంచెము శుభ్రమైన ఇసుకను మూట కట్టుకున్నాడు. గరుడ, గంధర్వ, యక్ష, వసు, రుద్రాది లోకాలన్నీ తిరిగాడు. అచ్చటి కన్యకామణులను చేరి 'నాదగ్గర ఇసుక ఉంది. ఈనాటి భోజనాన్ని నాకు మీరు వండి పెట్టగలరా?' అని అడిగేవాడు. వాళ్ళు నవ్వుతూ హేళనగా 'ఇదేమి చిత్రం? మీరు తపోనిధులు, కాబట్టి ఇసుక వంటకం చేయిస్తారేమో! మా వల్లకాదు. ఇలాంటి వింత వంటకం గురించి ముల్లోకాల్లోను ఎక్కడా మేము కనలేదు, వినలేదు.' అని పలికేరు.

వశిష్ఠుడు తన వివాహానికి తగిన కన్యకోసం వెదుకుతూ ఊర్ధ్వలోకాలన్నీ తిరుగాడాడు. ప్రయోజనం లేకపోవడంతో దిగివచ్చి అధోలోకాలన్నీ వెదికాడు. అక్కడ కూడా తన పరీక్షకు నిలచి,

తనకి తగిన కన్యకామణి లభించలేదు. అయినా విసుగు చెందక వశిష్ఠుడు భూమండలంలోనైనా దొరుకుతుందేమో చూడాలనుకున్నాడు. పట్టువదలక భూమండలంలోని ద్వీపాలన్నీ తిరుగుతూ చివరకు 'అల్లోనేరేడు' ద్వీపానికి చేరుకున్నాడు. అలుపెరుగక దారిలో కనబడుతున్న కాంతల నందరను తనకు ఇసుక భోజనంగ వండి పెట్టమని అడుగుతూనే ఉన్నాడు. వారేమో 'ఓ స్వామీ! మీకిదేం చాదస్తం.' అని ఎగతాళి చేశారే కాని పనిమాత్రం జరిగింది కాదు. భూలోకంలో కూడా సమస్త జాతి సుదతులను ఇదే విధంగ అడుగుతూ ఎంతకూ ఫలితం కనబడక పోవడంతో పట్టుదల మరింత పెరిగి తండ్రి బ్రహ్మదేవుని ఆజ్ఞను మనసులో తలచుకొని వశిష్ఠుడు ఊరి వెలివాడలలో కూడా వెదకడం ప్రారంభించాడు. అంత్యజుల కన్యలను చేరి ఇసుక వంట చేసి పెట్టమని అడిగాడు. వాళ్ళూ అంతే, అమాయకంగ నవ్వుతూ పక్కకు తొలగిపోయారు.

ఇంతలో వశిష్ఠుని కోరిక నెరవేరబోతోందా అన్నట్టుగ ఒక అగ్రహారం దగ్గర నిర్మలమైన సరోవరం కనబడింది. అందులోని తామరలు సుగంధాలతో వశిష్ఠునికి స్వాగతం పలుకుతున్నాయి. కలకలారావాలతో కలహంసలు స్వాగత గీతికలు పాడుతున్నాయి. ఆ చెఱువుగట్టు ప్రక్కనగల తాటితోపుల మధ్య ఒక చండాలవాటిక వశిష్ఠునికి కన్నులపండువుగా కనిపించింది. ఆ చెఱువులో కొందరు కన్యకామణులు స్నానంకోసం వచ్చి పరస్పరం పరిహాస వచనాలతో సయ్యాట లాడుకుంటున్నారు. వశిష్ఠుడు నెమ్మదిగా వారిని సమీపించి 'ఓ బాలికలారా! నేనొక కార్యార్థినై లోకాలన్నీ తిరుగుతున్నాను. ఈ భూమండలమంతా సంచరిస్తున్నాను. ఇదుగో ఇప్పుడు మీ దగ్గరకు వచ్చాను. మీరైనా నా కార్యం నెరవేర్చగలరేమో చూడండి.' అని అనగానే, ఆ కన్యకలు వినయంగా 'స్వామీ! మావల్ల అయ్యే ఏపనినైనా మేము మీకోసం చేస్తాం' అన్నారు. అపుడు వశిష్ఠుడు 'ఏమీలేదు, నా దగ్గర ఇసుక ఉంది. మీలో ఎవ్వరైనా దీనితో నాకు ఈనాటి భోజనం వండిపెట్టగలరా?' అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు కన్యకలందరు నివ్వెరపోయి ఒకరి ముఖాలొకరు చూసుకొంటూ మౌనంగా ఉండిపోయారు.

ఇంతలో వారిలో ఒకతెగా ఉన్న 'అరుంధతి' అని పిలువబడే అమ్మాయి 'నేను వండిపెడతాను' అని ముందుకు వచ్చింది. ఆమె పరువప్రాయం, చూడగానే చూపరులను ఆకట్టుకుంటోంది. ఆ ముఖం నిండుచంద్రునితో పోటీ పడుతోంది. ఆమె పలుకులకు అక్కడి చిలుకలు సిగ్గుపడి మెల్లగా జారుకుంటున్నాయి. ఆ చిన్నారి చేతులు జోడించి అంజలి ఘటిస్తూ భక్తితో వినయంగా వశిష్ఠుని చెంతకు చేరి 'ఓ మహాతపస్వీ! నీ అనుగ్రహముంటే నేను ఈ పనిని సాధించగలను. ఇసుక అన్నం వండిపెట్టడం పెద్ద ఘనకార్యంగా నేను భావించను. ఇసుకను ఇలా ఇవ్వండి. ఇప్పటికే ఆలస్యమయింది. మీ అనుష్ఠానం పూర్తిచేసుకుని దయచేయండి. ఇంతలో నేను వండి తమకు తమ భోజనం సిద్ధం చేస్తాను.' అని పరుగున పోయి ఒక చేటను తెచ్చి నిస్సంకోచంగ వశిష్ఠుని ముందు పెట్టి నిలబడింది. వశిష్ఠుడు కూడా ఆమె నిర్మల, నిశ్చయ వాక్కులకు

సంతోషించి తన చంకలోని మూటను విప్పి అందులోని ఇసుకను చేటలో పోశాడు. అరుంధతి భక్తితో ఆ ఇసుకను తీసుకొని 'ఓ మహానుభావా! మీరు కొంచెం సేపు ఈ చెట్టునీడను విశ్రాంతి తీసుకోండి. ఇంతలో నేను ఈ చెఱువుతో మూడేమూడు మునకలు వేసి మీకు వంట చేసిపెడతాను. ఇదుగో, ఇప్పుడే ఏమాత్రం ఆలస్యం చెయ్యను" అంటూ చెఱువువైపు పరుగుతీసింది. స్నానంచేసి పరిశుద్ధ మనస్కురాలై వచ్చి వశిష్ఠుడు ఇచ్చిన ఇసుకను తీసుకొనిపోయి రోటిలోపోసి రోకలి తీసుకొని దంచుతూ –

'సువ్వి జగద్రక్ష ! సువ్వి పద్మాక్ష !
సువ్వి రమాధీశ ! సూర్య ప్రకాశ !
సువ్వి భక్త విధేయ ! సుగుణ ధౌరేయ !
సువ్వి మేఘ శ్యామ ! సుర సార్వభౌమ !

మునీశ్వరుని ఆకలి తీర్చడంకోసం నేను ఈ ఇసుకను బియ్యంగా భావించి వంట చేయడానికి సిద్ధపడ్డాను. నా పూనిక సరైనదైదే ఈ ఇసుక తండులాలై నాకు వంటకు పనికొస్తాయి. మునిశ్రేష్ఠుడు యదార్థంగ ఈ కోరిక కలవాడే అయితే ఆ కోరిక తప్పక నెరవేరుతుంది.' అని తలపోస్తూ ఇసుకను దంచి తవుడు చెరిగి పాత్రలో పోసుకుంది. చెఱువుగట్టుకు వచ్చి ఆ పాత్రలోని ఇసుకను కడుగు పోయేటట్టు చక్కగా కడిగింది. కావలసిన నీళ్ళను పోసి పాత్రను దాలిపై పెట్టి జగదీశ్వరుడైన పరాత్పరుణ్ణి సంకీర్తన చేస్తూ దర్వితో కలియబెడుతూ "నేను నిజమైన భక్తికలదాన్నైతే, ఈ స్వామి నా స్వామియై, నా పూజ లందుకొనేవాడైతే, ఈ పాత్రలో నేను పోసిన ఇసుక బియ్యంగామారి స్వామికి భోజనంగా తయారుకావాలి' అని అగ్నిదేవుణ్ణి మనసారా ప్రార్థించుకుంది. సకల దేవతలను వేడుకుంది. అంతే! ఆశ్చర్యకరంగా పాత్రలోని ఇసుక తుకతుక ఉడకడం మొదలుపెట్టింది. ఇంకేముంది, అంతలోనే చక్కని నీవారబియ్యపు అన్నంపాత్రలో సిద్ధమైంది. క్రమంగా గంజి అంతా ఇగిరి తెల్లని మల్లెపువ్వులా ప్రసాదం పాత్ర నిండింది. అది చూచిన అరుంధతి ఆనందానికి అవధులు లేకపోయాయి. మనస్సు ఉద్రేకంతో ఉప్పొంగి పోయింది.

వశిష్ఠుడు తన అనుష్ఠానం పూర్తిచేసుకుని వచ్చి తన భోజనం సిద్ధంగా ఉండడం చూసి తనకు తగిన అర్ధాంగి లభించిందని సంతోషించాడు. కనుల ఆనందబాష్పాలు రాలగ మైమరచిపోయాడు. అరుంధతి మెల్లగ వశిష్ఠుణ్ణి చేరి 'స్వామీ! మీకు భోజనం సిద్ధంగా ఉంది. దయచేయండి. ఇప్పటికే ప్రొద్దు పోయింది. శీఘ్రంగా ఆరగించండి' అంది వినయంగా. అపుడు వశిష్ఠుడు 'ఓ పద్మాక్షీ! భార్యచేతిది తప్ప పరులచేతి భోజనం నేను భుజించను. నీ తల్లిదండ్రుల అంగీకారం లేనిదే నీ పాణిగ్రహణం నేను చేయలేను. కాబట్టి నిన్ను నా భార్యను చేయడానికి వారి అంగీకారం కోసం నీ తల్లిదండ్రులను పిలుచుకుని రా! వారి అనుమతితోనే నిన్ను నేను నాదానినిగా స్వీకరిస్తాను. ఆ తరువాతనే నా భోజనం' అన్నాడు.

తన మనసులోని మాటను స్వామి నోటినుండి వెలువడుతూండగానే అరుంధతి పరుగున వెళ్ళి తన తల్లిదండ్రులను వెంటపెట్టుకుని పరుగు పరుగున వచ్చింది. వాళ్ళు దూరంనుంచే మునికి నమస్కరిస్తూ వచ్చి 'తపోధనా! మా చిన్నారిపై మీకింత అనుగ్రహం కలగడానికి ఆమె చేసిన పెద్ద పనేముంది కనుక. చండాలవాటికలో మీకు ఉండడానికి తగిన సౌకర్యముంటుందా? మేమా కులహీనులము. మీరా బ్రహ్మకులజులు. మీకు మాకు బంధుత్వము సాధ్యమయ్యేదేనా? నక్కకు నాకలోకమునకు సరితూగుతుందా? స్వామీ! అంతవరకెందుకు, అసలు మీతో మాటటాడ్డానికైనా మాకు అర్హాత ఉందా? లోకానికి వ్యతిరేకమైన ఇటువంటి పనికి తామెందుకు సిద్ధపడుతున్నారో మాకు తెలియడం లేదు. మన్నించండి' అని పలికారు. ఆ మాటలను విన్న వశిష్ఠుడు 'మీ మాటలు నేను అర్థం చేసుకోగలను. మీరు చెప్పినదంతా లోకంలో జరుగుతున్నదే. ఇక నా మాటను మీరు వినండి. ఈ లోకంలో జాతి ఒక్కటే ప్రధానం కానేకాదు. గుణమే అన్నిటికంటే ప్రధానమని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. దోషకరమైన పనికి మేము అసలు పూనుకొంటామా? అటువంటప్పుడు మీకీ అనవసర సందేహ మెందుకు? మీ కుమార్తెను చేపట్టటం ద్వారా నేను పునీతుణ్ణి అవుతాను. మీరు అంగీకరిస్తే అది నాకు పరమ సంతోషకరం అవుతుంది. లేకపోతే నేను ఇన్నాళ్ళగా తిరిగిన శ్రమ వ్యర్థమై పోతుంది. ఇంక ఎక్కువగా ఆలోచించక మీ అనుమతి తెలియచేయండి' అని ముని పలుకగానే 'ఇంత మంచి భర్త మా చిన్నారికి దొరుకుతూంటే కాదనడం మూర్ఖత్వం అవుతుంది. అందుకని ఈ ముని కోర్కె తీర్చడమే ఉత్తమం. ఇదే అమ్మాయి కోరికగానూ కనబడుతోంది' అని అనుకుని బంధువులతోకూడ చర్చించి అరుంధతి మనసు తెలుసుకుని అంత్యజయైన, అతిపవిత్రురాలైన ఆమెను బ్రహ్మశ్రేష్ఠుడైన వశిష్ఠునికి ఇచ్చికన్యాదానం చేశారు. దేవతలు పుష్పవర్షం కురిపించారు. సాధు వాదాలతో దిక్కులు ప్రతిధ్వనించాయి.

అపుడు వశిష్ఠుడు కామధేనువును తలచి రప్పించి అరుంధతి వండిన అన్నాన్ని ఆమె క్షీరధారలతో కలిపి అగ్నికి ఆహుతులు చేసేడు. మిగిలినది తామిరువురు భుజించారు. వెంటనే అరుంధతి తనను అనుసరించి రాగా అక్కడినుండి బయలుదేరి చాలదూరం ప్రయాణం చేసేరు. ఒక చక్కని వనాన్ని ప్రవేశించి నిర్జనమైన ఆ ప్రదేశంలో వశిష్ఠుడు తన కమండలాన్ని ఒక ఉన్నతమైన ప్రదేశంలో ఉంచి అద్భుతమైన స్థైర్యం, చక్కని ధైర్యం, సమర్థమైన శీలం కలిగిన అరుంధతిని చూచి 'కోమలీ! నేను అతి శీఘ్రంగా చేయవలసిన కార్యాన్ని చక్కబెట్టుకుని రావలసి ఉంది. నేను వచ్చేవరకు నీవు నీ దృష్టిని మరల్చకుండా ఈ కమండలంపైనే ఉంచు. ఏమాత్రం దృష్టి మరల్చక ఏకాగ్రతవు కావాలి సుమా!' అని నియోగించి తాను హిమాలయాలలోని మానససరోవరానికి తపమాచరించుకోడానికి తరలిపోయాడు.

అంతా నిర్మానుష్యం. తనవారు కానీ, పెరవారు కానీ లేని ప్రదేశం. అరుంధతి ఇంచుకంతైనా బెదరలేదు. ఎక్కడిపని? ఎందుకులే? అనుకోలేదు. ఒంటరిగ ఇక్కడ ఎలా ఉంటాను?

మాట్లాడుకోడానికైనా తోడులేదు అని విసుక్కోలేదు. ఆకలి దప్పులు లేవు. అలుపు సొలుపులు లేవు. ఇక్కడ నన్నుంచి ఎప్పుడు వస్తాడో అని లేదు. ఏనుగులు, సింహాలు, పెద్దపులులు, పక్షులు, పాములు బాధిస్తాయేమో అని లేదు. ఎండనక, చలనక, గాడ్పనక, వాననక, తల్లిదండ్రులనైనా తలచక స్థిరమైన బుద్ధితో ఏకాగ్రదృష్టితో అనేక కాలాలు ఆ మునీశ్వరుని కమండలాన్నే చూస్తూ ఉండిపోయింది అరుంధతి.

అలా ఆ కమండలాన్ని స్థిర దృష్టితో చూస్తున్న అరుంధతి దీక్షకు వాయువులు చెదరక నిలిచిపోయాయి. వాయువులాగే ఆమె మనస్సు కూడా చలించక ఏకాగ్రమైపోయింది. మనసు నిలిచిపోగానే తమకు తాముగా ఇంద్రియాలూ నిలిచిపోయాయి. తలపు మాత్రంతో ఇంద్రియాలు నిగ్రహింపబడటంతో కమండలం లక్ష్యంగ చూస్తున్న అరుంధతికి అది కఠోర తపమే అయ్యింది. మౌనంగా నిద్రాహారాలులేక నిశ్చలంగ మహాయోగనిష్ఠతో వెలుగొందుతున్న ఆ అరుంధతి చూపులనుంచి మొదట దట్టమైన పొగలు వ్యాపించాయి. పొగలు చెలరేగగానే సెగలు ఉద్భవించాయి. సెగలు భుగభుగమనగానే జ్వాలలు లేచాయి. ఆకాశమంతా ఈ అగ్ని జ్వాలలతో ధగధగ లాడింది. కారణంలేని పొగలు, మంటలు దశ దిశలా వ్యాపించడంతోలోకాలన్నీ తల్లడిల్లి పోయాయి. తాపసులు తత్తరపాటు చెందారు. అమరులు బెదిరిపోయారు. అసురులు చెదరిపోయారు. పక్షులు, పన్నగులు అదిరిపోయాయి. సప్తసముద్రాలు సలసల కాగిపోయాయి. సూర్యునితేజ ముడిగింది ఆ కాంతిముందు. నక్షత్రాలు జలజల రాలిపోయాయి. పంచభూతాలు సోలిపోయాయి. గౌరీదేవి తపస్సును తలపిస్తున్నదై చంచల రహితమైన, పంచమ కులాంగనయైన అరుంధతి దృష్టి యోగ మహత్వంచేత లోకాల నాక్రమించిన వైశ్వానర జ్వాలలు సకల దేవతలను సంకట స్థితిలో పడవేశాయి.

వారు పరుగు పరుగున బ్రహ్మదేవుణ్ణి చేరుకున్నారు. 'ఓ భారతీనేతా! ఓ దయాసింధూ! ఓ భక్త మందారా! ఒక్కుమ్మడిగా మంటలు లేచి సమస్త లోకాలను క్రమ్ముకొని పొగలతో నింపుతున్నాయి. ఈ మంటలు ఎక్కడివి? ఏ కారణంచేత పదునాలుగు లోకాలు ఈ విధంగ పీడింపబడుతున్నాయి? ఈ మహోపద్రవంనుండి రక్షించక శుభాకారా! ఉపేక్షించడం న్యాయమా! ఇంకా తామసిస్తే లోకాలన్నీ ఒక్కసారిగ ఆపదల పాలవుతాయి. నీ సృష్టి నిలిచిపోతుంది. కరుణించు. ఈ మంటలార్పి లోకాలను రక్షించు.' అని దీనంగా ప్రార్థించారు. బ్రహ్మదేవుడు కొంతసేపు మౌనముద్ర వహించి అమరులతో "దేవతలారా! మహా తపోనిష్ఠాగరిష్ఠుడైన వశిష్ఠుని ఆజ్ఞచే ఒక్క అంత్యజుని పుత్రి సాటిలేని భక్తి, నిష్ఠ కలిగినదై ఆ మునీశ్వరుని కమండలాన్ని ధ్యానిస్తోంది. ఆమె దృఢ సంకల్పంతో కూడిన దృష్టి యోగంవలన జ్వాలకీలలు పుట్టి జగాల్ని ఆవరించుకున్నాయి. వీనిని నివారించడం మనవల్ల అయ్యేపని కాదు. శ్రీమహావిష్ణువుని, పరమేశ్వరుణ్ణి ప్రార్థించండి.' అని వారితో కలిసి బ్రహ్మదేవుడు పరమశివుని నివాసమైన కైలాసగిరికి బయలుదేరాడు. దేవతలతోకూడి పరమశివునికి ప్రణతు లర్పించేడు. 'లోకాలను పీడిస్తున్న అగ్నిజ్వాలల బాధ తీర్పవే' అని ప్రార్థించాడు. అంతట

ఆ హరుడు 'లక్ష్మీనాధుని తోడులేక ఆ ఆపద నివారించడం మనవల్ల అయ్యేపని కాదు' అని నందీశ్వరుణ్ణి అధిష్ఠించి బ్రహ్మాది దేవతలు తోడురాగా విష్ణులోకం చేరి శ్రీమహావిష్ణువుకి వచ్చిన ఆపద వృత్తాంతం అంతా వివరించేడు. వెంటనే వైకుంఠవాసుడు వారందరితో కలిసి ఆ క్షణంలోనే గరుడారూఢుడై సృష్టికి నష్టి చేస్తున్న, అదరక బెదరక యతి నియమానుసారం కదలని స్తంభంలా నిలుచున్న, మౌనం, శమం, నియమం, దమం వహించి వేలాది వత్సరాలు తపమాచరించిన మునీశ్వరులనే తన ఏకాగ్రతపోదీక్షచే అబ్బురపరుస్తున్న ఆ కడజాతి వనిత అరుంధతి ఉన్న వనానికి చేరుకున్నాడు.

త్రిమూర్తులు అరుంధతికి తమను తాము ఎరిగించుకొని 'బాలా! నీ ఉగ్రతపస్సు, నీ నిశ్చల దృష్టి, నీ ధైర్యము, నీ నిర్మలత మాకు ఎంతో ఆనందాన్ని కలిగించాయి. మేము నిన్ను ఎంతగానో మెచ్చుకుంటున్నాము. అందుకనే నిఖిల దేవతలతో కూడి నీకు వరాలియ్యడానికి వచ్చేము. నీ దృష్టి మరల్చి నీకు ఏ వరాలు కావాలో కోరుకో. కమండలం గురించి ఏ మాత్రం నువ్వు చింతించనక్కర లేదు. అదీగాక నీ వయసుకి ఇంత నియమ, నిష్ఠలు తగినవి కావుసుమా!' అని పలుకుతున్నా అరుంధతి వారి మాటలు వినని దానిలాగే, కనీసం వారివైపు దృష్టి మరల్చకుండానే, అడిగిన వరాల నన్నిటినీ ఇస్తారన్న ఆశకైనా లోనుగాక, వచ్చినవారు త్రిమూర్తులనైనా తలంచక స్థిరబుద్ధితో, ఏకాగ్రతతో కమండలాన్నే చూస్తూ ఉండిపోయిందే కాని తన దృష్టిని మాత్రం మరల్చలేదు. నిర్మల, నిశ్చల బుద్ధితో తమవైపైనా చూడక ఏకాగ్రదీక్షతో వశిష్ఠుని ఆదేశానుసారం కమండలాన్నే చూస్తూ ఉండిపోయిన అరుంధతి పతిభక్తికి దేవతలు ఆశ్చర్యపోయారు. వివిధ వాయిద్యాలు మ్రోగించి, పలువిధాల భయపరచి ఆమె దీక్షను భగ్నం చేయడానికి సకల ప్రయత్నాలు చేశారు. ఏ విధంగానూ వారి ప్రయత్నం ఫలించకపోవడంతో దేవతలు నిరాశతో నిస్పృహ చెందక తప్పలేదు.

అపుడు శ్రీమహావిష్ణువు 'బ్రహ్మదేవా! ఈమె ఏ విధంగానూ మనను లక్ష్యంచేయక ఆమె వశిష్ఠుని ఆదేశాన్నే పాటిస్తోంది. అందువలన ఆ వశిష్ఠుడే వచ్చి ఆమె ముందు నిలబడిన కాని ఆమె దృష్టి మరల్చదు. ఇది నిశ్చయము. అందుకని వెంటనే ఆ మునిశ్రేష్ఠుడు ఇక్కడకు వచ్చే ఏర్పాటు చూడండి' అని చెప్పాడు. అంతట బ్రహ్మదేవుడు దేవతలను పిలచి 'హేమాద్రికి ఉత్తరంగ మానస సరోవర తీరంలో తపో నిమగ్నుడై ఉన్న నా కుమారుణ్ణి వశిష్ఠుణ్ణి నా ఆదేశం తెలిపి తోడు పెట్టుకుని రండి.' అని పంపించాడు. వారు శీఘ్రంగ వెళ్ళి వశిష్ఠుణ్ణి చేరి మ్రొక్కి 'త్రిమూర్తులు మీ రాకకై ఎదురు చూస్తున్నారు. మీ తండ్రిగారు మిమ్ములను వెంటబెట్టుకొని రమ్మని మమ్మాదేశించారు' అని తెలుపగానే, వశిష్ఠుడు జరుగుతున్న విషయమంతా తెలుసుకున్నవాడవడంచేత, తండ్రి ఆజ్ఞను శిరసావహించి లేచి, అక్షమాలను కంఠమాలగ చేసుకొని, బ్రహ్మదండం, నారవస్త్రం, కెందలిరాకు ఛాయతో ఉన్న పెద్ద జడలతో, శరీరమంతా విభూతి రేఖలతో తళతళ లాడుతుండగా శీఘ్రగమనాన వచ్చి త్రిమూర్తులకు సాష్టాంగ ప్రణామాలర్పించి నిలబడ్డాడు.

సాష్టాంగ యోగ దీక్షాదక్షుడైన వశిష్ఠుడు వినయవంతుడై తమ ముందు నిలబడ్డ వశిష్ఠుని ఆదరంతో చూచి ముక్కంటి 'కుమారా! దేవతల ఆరాటాన్ని తీర్చడానికని మేము ఇక్కడకు రావడం జరిగింది. ఈమె దృష్టి మరల్చడానికి నీవే సమర్థుడవని తెలుసుకున్నాము. ఈమెను ఈ దీక్ష విరమణకు నీవే ఆదేశించు. నీ ప్రబోధము లేనిదే ఈమె మరెవ్వరి మాటను చెవిని పెట్టునట్లు లేదు. ఈమె దృష్టి మరల్చనిదే లోకాలకు శాంతి లేదు. దేవతల ఆర్తి కడతేరదు. వెంటనే నీ సతిని ఆదేశించు.' అని పలుకగానే, దేవతలందరు ఏకకంఠంతో 'లోకాలను కాపాడు, లోకాలను కాపాడు' అని అర్థించారు. త్రిమూర్తుల ఆజ్ఞను శిరసావహించి వశిష్ఠుడు దేవతలతో 'మహనీయులారా! ఈమె మనోనిశ్చలతను పరీక్షించడానికే నా ఈ కమండలం చూస్తూండమని చెప్పి వెళ్ళిపోయాను. ఈమె దృఢ దృష్టి వలన ఇక్కడ అగ్నిజ్వాలలు అలుముకున్నాయి. నేను ఇప్పుడే ఈ స్థిరమతి దృష్టి దీక్షను వారిస్తాను. కాని మీరు నాకు ఒక వరం ప్రసాదించాలి. నేను ఈమెను నా అర్థాంగిగా స్వీకరించాను. ఈమె అంత్యజ అని భావింపక లౌకిక వైదికజ్ఞులు మెచ్చుకొనే రీతిగ మీరే శాస్త్రోక్తంగ మా వివాహం జరిపించండి.' అని విన్నవించుకున్నాడు. త్రిమూర్తులు 'తథాస్తు' అన్నారు. దేవతలు అంగీకార సూచకంగ కరతాళ ధ్వనులు చేశారు.

అంతట వశిష్ఠుడు అరుంధతిని సమీపించి 'ఓ సీమంతినీ! చాలా అలసట చెందావు. చిరకాలం దీక్ష వహించావు. నీవు దృష్టి మరల్చకుండా ఇంతకాలం ఈ కమండలంపైనే చూపు నిలిపావు. దీనివలన లోకాలకు అశాంతి కలుగుతోంది. కాబట్టి ఇక చాలు. నీవు నీ దీక్షను విరమించుకో.' అనే వశిష్ఠుని మాటలు చెవిని పడగానే అరుంధతి భక్తి యోగంతో కనురెప్ప లార్చి, చాల ప్రయత్నంతో కదలి ముని పాదపద్మాలకు వినమితురాలైంది. మునినాధుడు తన ప్రేయసికి ప్రసన్నుడై 'ఓ సాధ్వీ! ఇక్కారుచిచ్చులో పడగలవేమో చూడదలచాను' అని అనీ అనగానే ఇంకా వశిష్ఠుని మాట పూర్తి కాకుండానే అరుంధతి ఆ వనాగ్నిలో ప్రవేశించింది. త్రిమూర్తులు, సకల దేవతలు మునీశ్వరులు సన్నుతిస్తూండగా చెక్కు చెదరక అగ్ని కీలలనుండి బయటకు వచ్చిన అరుంధతిని వశిష్ఠుడు సకల దేవతల సాక్షిగ పరిణయం చేసుకున్నాడు.

అరుంధతీ వశిష్ఠుల చరితం లోకపావనం. ఆమె చల్లని చూపు లేనిదే దంపతులకు వైవాహిక జీవితమే లేదు. అటువంటి పవిత్ర వంశాన జన్మించిన వారే అనంతర కాలంలో "అరుంధతేయులు"గా వాసి కెక్కారు. ఈ సమాజంలో వారి స్థానం అత్యున్నతం. అది తెలుసు కోవడం వారి కర్తవ్యం. తమ స్థానాన్ని బలపరచుకోవడం వారి బాధ్యత.

మతంగుడు

మహర్షులలో శ్రేష్ఠుడుగ పేరొందిన మతంగుడు గౌతమ మహర్షి వంశంలో జన్మించాడు. వేదశాస్త్రాల నభ్యసించి యజ్ఞకర్మల నవలోకించి బాల్యంనుంచీ అతడు సాటి బాలురలో మేటిగా ఉండేవాడు. ఒకనాడు మతంగుడు మార్గాన పోతూ ఒక గాడిద పిల్లను తన చేతి కర్రతో కొట్టాడు. అది బాధ కలిగి ఆ విషయాన్ని తన తల్లికి చెప్పింది. ఆ గాడిద తల్లి "వాడు చండాలుడు. అందుచేత క్రూరకర్ముడు కాక శాంతియుతుడెలా అవుతాడు." అంది. పక్షులు, జంతువుల భాష నెరిగిన మతంగుడు, ఆ విషయం నిర్ధారణ చేసికొని, తప మాచరించి తన దుష్ట సంస్కారాన్ని పోగొట్టు కోవాలనుకున్నాడు. ఆ పట్టుదలతోనే మతంగుడు కొన్ని వేల సంవత్సరాలు మహోగ్రతపస్సు చేశాడు. అపుడు ఇంద్రుడు ప్రత్యక్షమై 'నీకేం వరం కావాలో కోరుకో' అన్నాడు. మతంగుడు 'నా దుష్ట సంస్కారంనుంచి నన్ను బయట పడెయ్యి. నన్ను బ్రహ్మవిద్వద్వరుణ్ణి చెయ్యి' అని కోరుకొన్నాడు. ఇంద్రుడు 'అది సాధ్యంకాదు. మరొక వరమేదైనా కోరుకో' అన్నాడు. మతంగుడు తన పంతం వీడకపోవడంతో ఇంద్రుడు వెనుతిరిగిపోయాడు.

మతంగుడు తన దీక్ష వదలక, పట్టుదలను సడలనీక బ్రహ్మవిద్వద్వరుడు కావాలని ఒంటికాలిపై నిలబడి నూరేళ్ళు తపస్సు చేశాడు. మళ్ళీ ఇంద్రుడు ప్రత్యక్షమై 'ఇలాంటి తపానికి పది రెట్లు తపస్సు చేస్తే చండాలుడు శూద్రుడు అవుతాడు. దానికి నూరు రెట్లు తపస్సు చేస్తే వైశ్యుడు అవుతాడు. దానికి నూరు రెట్లు తపస్సు చేస్తే వైశ్యుడు క్షత్రియుడవుతాడు. దానికి పదివేల రెట్లు తపస్సు అధికంగా చేస్తే క్షత్రియుడు చెడ్డ బ్రాహ్మణుడు అవుతాడు. దానికి లక్ష రెట్లు అధికంగ తపస్సు చేస్తే శమ, దమ, సత్య, అహింసలచేత, నిర్మాత్సర్యంచేత సజ్జన హృదయాలను సదయములు చేసే దుర్బ్రాహ్మణుడు సద్బ్రాహ్మణుడు అవుతాడు. అలాంటి సద్బ్రాహ్మణుడు నిరంతర బ్రహ్మ పదార్థ సందర్శనాభిలాషుడై పెక్కు జన్మ లెత్తితేకాని బ్రహ్మవిదుడు కాలేడు. అట్టి బ్రహ్మవిదుడు ఎముకలగూడు మాత్రమే మిగులునంతటి మహా తపస్సుచేసి బ్రహ్మము తప్ప వేరేమీ తెలియక అహోరాత్రులు అనేక వేల సంవత్సరాలు తపస్సుచేస్తే బ్రహ్మవిద్వద్వరు డవుతాడు. నువ్వు ఆది స్థానంలో ఉండి అంత స్థానంలో ఉన్న పదవి కావాలంటున్నావు. బ్రాహ్మణుడై పుట్టినా ఆ జాతి మహత్త్వం నిలుపుకోవడం చాలా కష్టం. పుట్టుక మాత్రంచేత బ్రాహ్మణుడు అనిపించుకోడు. అనేక జన్మలకు ఒకసారి బ్రాహ్మణ

జన్మ లభించినా ధన వాంఛా, విషయ లౌల్యములచేత నూటికి తొంభై తొమ్మండుగురు సదాచారాన్ని విడిచిపెట్టి బ్రాహ్మణ ధర్మాన్ని మంటగలిపి వాళ్ళు చెడిపోవడమే గాక, తమ వంశానికీ అప్రతిష్ఠ తెస్తున్నారు. అందుచేత నువ్వు నీకు తగిన ఏదైనా వరం కోరుకో, ఇస్తాను' అన్నాడు ఇంద్రుడు. మతంగుడు మాత్రం తన పంతం విడిచిపెట్టక ఇంద్రుని మాటకు బదులు పలకలేదు. ఇంద్రుడు చేయగలిగినదేమీ లేక తిరిగి స్వర్గం చేరుకున్నాడు.

మతంగుడు ఏలాగైనా తాను బ్రహ్మవిద్వద్వరుణ్ణి కావాలని కాలి బొటనవ్రేలు మాత్రము నేలపై ఆనించి నూరు సంవత్సరాలు అతి భీకరమైన తపస్సు చేశాడు. ఆ ఘోర తపస్సువలన అతనికి అస్థిపంజరం మాత్రమే మిగిలింది. సర్వశక్తులు నశించిపోవడంతో అతడు నేలమీదకు ఒరిగిపోయాడు. మళ్ళీ వెంటనే ఇంద్రుడు ప్రత్యక్షమయ్యాడు. 'అమాయకుడా! నేను నీకు ఎన్నిసార్లు చెప్పాలి? బ్రహ్మవిద్వద్వరుడు అవడం మహామహులకే సాధ్యంకాని పని. నీ ప్రయత్నం వ్యర్థం. ఇకనైనా నా మాట విను. నేనిచ్చిన వరం తీసుకో.' అన్నాడు. మతంగుడు తన పంతం వీడి 'సరే' అనగానే ఇంద్రుడు 'కుమారా! నీవు ముందుజన్మలో చండదేవుడనే పేరున ప్రసిద్ధుడవై ఉంటావు. స్త్రీలు నిన్ను పూజిస్తారు. కామరూపం ధరించే శక్తి కలవాడవై పక్షిరూపంలో లోకాలన్నీ విహరిస్తూంటావు. దానివలన నీకు, ఈ లోకాలకికూడా ఆనందం కలుగుతుంది. అనంతరం నీకు బ్రహ్మజ్ఞానం కలిగి బ్రాహ్మణుడవై, ఆ పిమ్మట నీవు కోరినవిధంగ బ్రహ్మవిద్వద్వరుడవు అవుతావు. నీ పేర నీ వంశం "మాతంగ" వంశంగా కీర్తింప బడుతుంది.' అని వరమిచ్చి ఇంద్రుడు అదృశ్యమయ్యాడు.

మతంగుడు సంతృప్తుడై అక్కడే ఒక ఆశ్రమాన్ని నిర్మించుకొని తపోజీవనం సాగిస్తున్నాడు. కాలక్రమంలో ఒక కన్యను పెండ్లి చేసుకొని సాంసారిక జీవనం సాగిస్తూ ఒక కుమారుణ్ణి కన్నాడు. ఆ బాలుడు ప్రసన్నుడను పేరుతో తల్లిదండ్రులను తన సేవలతో మెప్పిస్తూ పెరిగి పెద్దవాడయ్యాడు. మతంగుడు సంసారం చేస్తున్నా తన లక్ష్యాన్ని మాత్రం వదులుకోలేదు. బ్రహ్మజ్ఞానాన్ని సంపాదించనిదే తనకు బ్రాహ్మణత్వం రాదు. బ్రాహ్మణత్వం రానిదే తాను బ్రహ్మవిద్వద్వరుడు కాలేడు. ఏలాగైనా బ్రహ్మవిద్వద్వరుడు కావడమే ఆతని అంతిమ లక్ష్యం. మహాత్ములు లక్ష్యసాధనకోసమే జీవిస్తారు. ఆ మహా తపోధనుని ఆశ్రమం పరమ రమణీయం. మతంగుని ఆశ్రమంలో లవంగ, నారింజ, పోక, పున్నాగ, వకుళ, కరివేర, ప్రియాళు, చూత మొదలైన పలు వృక్షాలు వికాసమానములై ఉన్నాయి. అనేక రకాలైన వికసిత పుష్పాల సుగంధాలతో సంవాసితమై ఉంది. పవిత్రములైన పరిమళ వాయువులు పథికుల శ్రమను వెంటనే పోగొడుతున్నాయి. పరస్పర శత్రువులైన జంతువులు తమ శత్రుత్వాన్ని మరచి మిత్రులుగా మెలగుతున్నాయి. అమృతంవంటి స్వచ్ఛమైన నీళ్ళతో నిండి వికసించిన తామరలతో చెఱువు శోభాయమానంగా ఉంది. ఆ ఆశ్రమంలో నిరంతరం అగ్నిదేవునికి హోమ క్రియలు నిర్వహిస్తూ వేద, వేదాంత, శాస్త్ర వ్యాఖ్యాన గోష్ఠులతో తలమునకలై వికసిత విజ్ఞాన హృదయులైన శిష్యుల నడుమ చుక్కలలోని చంద్రునివలె మతంగ మహర్షి వెలుగొందుతున్నాడు.

కాలం సాగిపోతుండగా ఒక రోజున మాతాపితృ సేవాతత్పరుడైన ధర్మవ్యాధుడు తన కుమార్తెయైన 'అర్జునకి'కి తగిన వరుణ్ణి అన్వేషిస్తూ మతంగ మహర్షి ఆశ్రమానికి వచ్చాడు. ఆ మహర్షి కుమారుడు ప్రసన్నుడికి తన కుమార్తెను భార్యగ చేసికోమని అర్థించాడు. ధర్మవ్యాధుని ధర్మ మహత్తుని అంతకు పూర్వమే వినియున్న మతంగుడు సంతోషంగ మారుమాట లేక తన అంగీకారం తెలిపాడు. ఒక సుముహూర్తాన ప్రసన్నుడికి అర్జునకికి వివాహం జరిపించారు. ధర్మవ్యాధుడు తన కుమార్తెకు తగిన బుద్ధులు చెప్పి అత్తవారింటికి పంపించాడు. అర్జునకి అత్తమామలకు నిరంతరం అతి భక్తితో సేవలుచేస్తూ, భర్త మాటకి జవదాటక అనుకూలవతియై ఉత్తమ సతిగ కాపురం చేస్తోంది. ఆమె ఆశ్రమ సరోవరంలోని తామరలకంటె ముందు నిద్ర లేస్తుంది. పర్ణశాలముందు గోమయం కలిపిన నీళ్ళను కళ్ళాపి చల్లుతుంది. ఆశ్రమం లోపలంతా అలికి ముగ్గులు పెడుతుంది. హోమక్రియకు కావలసినవన్నీ సిద్ధపరుస్తుంది. దేవపూజకోసం గంధం, అక్షతలు, పూవులు ఏర్పాటు చేస్తుంది. మధ్యాహ్న సమయానికి భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య, పానీయాలను పాక శుద్ధిగా వండి సిద్ధం చేస్తుంది. మామగారు, భర్త అతిధులతో కలిసి భుజించిన తరువాత అత్తగారికి పెట్టి తాను తింటుంది. ఈలోగా నీరెండలు పడుతూంటే బిందెలతో నీళ్ళు తెచ్చి బృందావనంలోని మొక్కలను తడుపుతుంది. లేళ్ళకి, గోవులకి ప్రేమతో లేత పచ్చికను అందించి సేవలు చేస్తుంది. ఈ విధంగ అర్జునకి ప్రతి నిత్యం నడుచుకుంటూ అత్తమామల, భర్త ఆదరణకు పాత్రురాలైంది. అనుకూలవతియైన కోడలు, మాట జవదాటని కొడుకు లభించడంతో మతంగుని జీవితం ధన్యమే కదా!

మహర్షులు శాపానుగ్రహ సమర్థులు. ఈ విషయం మతంగుని విషయంలో కూడా సార్థకమయింది. ఒకసారి మతంగుడు నిశ్చల తపోధ్యానపరుడై ఉండగా ప్రియదర్శనుడనే గంధర్వ రాజకుమారుడు అక్కడకు వచ్చి గర్వంతో స్వేచ్ఛా విహారం చేస్తూ మతంగుడి ధ్యానానికి విఘ్నం కలిగించాడు. మతంగుడికి కోపం కట్టలు తెంచుకుంది. 'ఓరీ! మదోన్మత్తుడవై నువ్వు నా ధ్యానానికి భంగం కలిగించావు. కాబట్టి నువ్వు మదగజంగా జన్మిస్తావు' అని శపించాడు. దానితో గంధర్వుడు గర్వం తగ్గి కళ్ళుతెరచి మతంగ మహర్షి కాళ్ళమీద పడ్డాడు. మహర్షుల కోపం తాటాకు మంట లాంటిది. దయామయుడైన మతంగ మహర్షి ఆ గంధర్వుణ్ణి కనికరించి 'ఓయీ! విచారించకు. ఇక్ష్వాకు వంశపు రాజు తన బాణంతో నీ కుంభస్థలాన్ని కొట్టగానే నీకు శాప విమోచన మవుతుంది. మళ్ళీ నీకు నీ పూర్వరూపం వస్తుంది' అని అనుగ్రహించేడు.

మతంగుని దయార్ద్ర హృదయాన్ని గురించి మరొక చక్కని దృష్టాంతంకూడా ఉంది. మతంగ మహర్షి ఒక రోజున తన హోమ, ధ్యానాదులు పూర్తిచేసుకుని సమిధలకోసం వనంలోకి వెళు తున్నాడు. ఇంతలో అక్కడ ఒక ఆడ ఏనుగు ఒక పిల్లను ప్రసవించి మరణించి ఉంది. ఆ సన్నివేశం చూడగానే మతంగుని హృదయం కనికరంతో కరిగిపోయింది. ఆ ఏనుగు పిల్లను నెమ్మదిగా

ఆశ్రమానికి తీసుకొని వచ్చి చాలా ముద్దుగ పెంచసాగాడు. ఆ ఏనుగుపిల్ల మునీంద్రుడి సంరక్షణలో పెరిగి పెద్దదయింది. మతంగుడు దానిని తన కొడుకుతో సమానంగా చూసుకుంటున్నాడు. అది కూడా మతంగుణ్ణి తండ్రిలాగే గౌరవిస్తూ ఆయన అగ్నిహోత్రానికి కావలసిన సమిధలు తానే తెచ్చి ఇస్తుంది. ఆయన దేవపూజవేళకి నదిలో స్నానం చేసి తామరలను, పుష్పాలను తానే తొండంతో తెచ్చి ఇస్తుంది. ఆశ్రమస్థలాన్ని తన తొండంతో చెఱువులోని నీళ్ళను తెచ్చి ప్రతి నిత్యం పరిశుద్ధం చేస్తుంది. మతంగుడు ధ్యానదీక్షలో ఉంటే అది విశ్రాంతి తీసుకుంటుంది. మహర్షి ధ్యానం చాలించి బయటకు రాగానే లేచి నిలబడి ఆయన పనులను చెప్పకుండానే చేసేస్తూంటుంది. మతంగుడు నదీ స్నానానికి వెళితే ఆశ్రమాన్ని కంటికి రెప్పలా కాపాడుతూ మనిషిని మించిన మహిత భక్తితో, విశ్వాసంతో మసలుతోంది. వెయ్యిమాటలు ఎందుకు? ఆ ఏనుగు తన సేవలతో మతంగుని మనస్సును పూర్తిగా దోచుకుంది. ఆ తండ్రి, కొడుకుల అపురూప స్నేహబాంధవ్యానికి ఇంద్రుడు ఎంతో ఆశ్చర్యపోయాడు. మతంగ మహర్షి అంటే ఇంద్రునికి చాలా ఇష్టం. ఆయనకు మేలు చేయడమంటే ఇంకా ఇష్టం. ఒక రోజున ఇంద్రుడు రాజు వేషంలో మతంగ మహర్షి ఆశ్రమానికి వచ్చాడు.

రాజు : మహర్షీ! నీ దగ్గరనున్న ఏనుగును నాకియ్యి. నేను రాజును. కాబట్టి దీని అవసరం నాకు ఉంది. తపోధనుడవైన నీకు దీని అవసరము లేదు. దీన్ని తీసుకునివెళ్ళడానికి నాకు అనుమతి ఇయ్యి.

మతంగుడు : రాజా! ఇది నా పుత్రునితో సమానంగ నన్ను సేవిస్తోంది. సమిధలు తెచ్చి పెడుతుంది. నేను లేనప్పుడు నా ఆశ్రమాన్ని కంటికి రెప్పలా కాపాడుతోంది. దీనికి ఏ మనుష్య బుద్ధికూడా సరిపోదు. కాబట్టి నీ కోరికను నేను తీర్చలేను.

రాజు : ఓ మహర్షీ! నీకు వెయ్యి గోవులను ఇస్తాను. కావలసినంత ధన, ధాన్యాలనూ ఇస్తాను. ఒక్క మాట చెప్తాను విను. ఈ ఏనుగు నా మనసుకు నచ్చింది. నీకేం కావాలో చెప్పు దీనికి బదులుగా తప్పక ఇస్తాను. తపోధనుడివి. నీకు ఈ ఏనుగుతో పనేమిటి? పట్టుపట్టకు.

మతంగుడు : రాజా! నువ్వు చెప్పిన మాట చాలా విచిత్రంగా ఉంది. తపఃశాలికి ఏనుగు ఎందుకన్నావు కదా! మరి నువ్వెందుకు నాకు గోవుల్ని, ధన, ధాన్యాల్ని ఇస్తానంటావు? అవి మాత్రం నా కెందుకు? ఈ ఏనుగును నువ్వు ఏమిచ్చినా ఇవ్వను.

రాజు : మహర్షీ! నువ్వింక దీనిపై ఆశ వదులుకో. నేను రాజును. రాజ్యంలోని ఏ వస్తువైనా రాజు అధికారానికి లోబడే ఉండాలి. నా వాహనంగ నేను దీన్ని తీసుకుంటే అది ఏమాత్రం తప్పు కాదు. నువ్వు అంగీకరించకపోయినా నేను ఈ ఏనుగును తీసుకు పోతాను.

మతంగుడు : (కృపాళువై చాల విచారించి) రాజా! పుణ్య కర్ములు హర్షం పొందడం, పాప కర్ములు శోకార్తి పాలుపడడం ఎక్కడ జరుగుతుందో అటువంటి యమలోకానికి ధర్మమూర్తి ధర్మరాజు

సభకు వెళదాం. అక్కడే నీకు ఇవ్వవలసి వస్తే నేను నా ఏనుగుని ఇస్తాను.

రాజు : మునీ! యముడి సభకు నాస్తికులు, పాపాత్ములు చేరుకుంటారు. అటువంటి చోటికి నేనెలా రాగలను.

మతంగుడు : యముడు నిన్ను ఆదరిస్తాడు. నేను నీతో ఉంటాను కదా!

రాజు : మునీశ్వరా! నీకు తెలియదు. యముడు నన్ను ఆదరించడు. తల్లిదండ్రులను అతి భక్తితో పూజించేవారినే అతడు గౌరవిస్తాడు.

మతంగుడు : అయితే గంగా తీరానికి రా! అక్కడిస్తాను నీకు నా ఏనుగుని.

రాజు : సహృదయా! అతిథులకు పెట్టి మిగిలినదే తినే పుణ్యాత్ములు, ఎదుటివారి సొమ్ము నాశించని పవిత్ర చరిత్రులు తప్ప ఇతరులు గంగా తీరం చేరలేరు. నేను అందుకు అర్హుణ్ణి కాదు.

మతంగుడు : అయితే, మేరు పర్వత సుందర వనాలకు రా! అక్కడ నా ఏనుగుని నీకిస్తాను.

రాజు : తపోనిధీ! మృదు స్వభావం కలవాళ్ళు, సత్య సమన్వితులైనవాళ్ళు, భూతదయాపరులైన వాళ్ళు మాత్రమే ఆ వనంలో ప్రవేశించడానికి అర్హులై ఉంటారు. నేను ఆ ప్రదేశానికి రావడానికి అశక్తుణ్ణి.

మతంగుడు : అయితే రాజా! నారద విహారభూమికి రా! అక్కడ అప్సరస స్త్రీల ఆటపాటల మధ్య నీకు నా పుత్రసమానమైన ఏనుగుని ఇచ్చేస్తాను.

రాజు : కానీ మహాయశా! గీత నృత్యాలలో చతురులై దేవతల్ని, మునీశ్వరుల్ని సంతోష పెట్టిన వాళ్ళు మాత్రమే అక్కడ ప్రవేశానికి తగినవారు. నేను అక్కడికి రావడానికి అర్హత లేనివాణ్ణి.

మతంగుడు : పోనీ, దేవతలు నివసించే చోటు, ఇంద్రుడు సర్వకాలాలు వర్షించే చోటు అయినటువంటి ఉత్తర కురుభూములకి రా! అక్కడ నా ఏనుగును ఇస్తాను.

రాజు : మునిచంద్రా! కామ, మోహ విరహితులైన వారికే కానీ ఇతరులకి అక్కడ ప్రవేశం లేదుకదా! వీలుకాని చోటికి నన్ను రమ్మంటే నేనెలా రాగలను?

మతంగుడు : సరే, రాజా! చంద్రుని ఇంటికి రా! అక్కడిస్తాను.

రాజు : యశోనిధీ! నిరంతర దానవ్రతులు, క్షమాశీలురు, ప్రతిగ్రహ బుద్ధి లేనివారునైన మహాత్ములు పోయే చోటికి నేను రాలేనని తెలిసి రమ్మనుట న్యాయమా?

మతంగుడు : అయితే సూర్యుని దగ్గరకు రా! ఇస్తాను.

రాజు : అయ్యో! అది తపస్స్వాధ్యాయ నిరతులకు కూడా ప్రవేశింప శక్యముకాని చోటు, అక్కడికి నేనెలా రాగలను?

మతంగుడు : బాగుందయ్యా! పోనీ వరుణపురికి రా!

రాజు : నిరతాగ్నిహోత్రులు, అవిరళ జప,హోమ తత్పరులు, యజ్ఞ,యాగ క్రియా నిరతులు అక్కడికి వెళతారు. అంతేకాని నేను మాత్రం రాలేను.

మతంగుడు : పోనీ ఇంద్రలోకానికి రాగలవా?

రాజు : అది శూరులు, వీరులు, శతవర్షవేదులు పోయే పుణ్య ప్రదేశం, నీకు తెలియనిదేముంది?

మతంగుడు : రాజా! సత్య లోకానికి రా! అక్కడిస్తాను ఏనుగుని.

రాజు : అది అశ్వమేధయాగం చేసినవారు చేరే చోటు. నాకు అర్హత లేదు.

మతంగుడు : మరి గోలోకమో!

రాజు : అది తీర్థయాత్రలు చేసినవాళ్ళు, గోదానం చేసిన పుణ్యాత్ములు, బ్రహ్మచర్య వ్రతం పాటించినవాళ్ళు పోయేచోటుకదా!

మతంగుడు : అయితే శీతోష్ణాలు, సుఖ,దుఃఖాలు వంటి ద్వంద్వాలకి అతీతమైన పుణ్యలోకం బ్రహ్మ లోకానికి రా!

రాజు : అది విరాగులు, నియమవ్రతులు, కృతపుణ్యులు, ఆధ్యాత్మ నిరతులు ఉండే చోటు. నాకు అక్కడికి ప్రవేశము లేదు.

మతంగుడు : (రాజు సమాధానాలు అన్నీ విని) సరే! తెలిసింది. నువ్వు భూమండలంలోని రాజువు కావు. రాజు రూపంలో వచ్చిన సురరాజువు. నువ్వు ఏం కోరి ఈ కపటరూపంలో వచ్చావు. ఇంద్రా! చెప్పు.

ఇంద్రుడు : (నిజరూపంతో ప్రత్యక్షమై) మతంగ మహర్షీ! నన్ను తెలుసుకున్నావు. సంతోషం, నీకేం కావాలో కోరుకో.

మతంగుడు : దేవేంద్రా! నాకు ఏ కోరికలు లేవు. దయచేసి నన్ను, నా పుత్ర సమానమైన ఈ ఏనుగుని విడదీయకు. దీన్ని విడిచిపెట్టి దయచెయ్యి చాలు.

ఇంద్రుడు : మునిసత్తమా! నీ అభీష్టం ప్రకారమే జరుగుతుంది. నిన్ను పరీక్షించడానికే వచ్చాను కానీ నీ ఏనుగుని కోరి రాలేదు. నన్ను తెలుసుకోవడం సామాన్యులకు సాధ్యమయ్యేది కాదు. నీ తపః శక్తివల్ల నన్ను తెలుసుకో గలిగావు. నీ కరుణాపూరిత హృదయానికి కానుకగా నీకు, నీ ఏనుగు పుత్రునికి స్వేచ్ఛగా ప్రవేశించడానికి స్వర్గ ద్వారాలు తెరుస్తున్నాను. ఇదిగో ఈ దేవ విమానం ఎక్కి రండి. స్వర్గలోకంలో చిరకాలం నాకు మిత్రులుగా ఉండండి.

ఇంద్రుడు ఇలా పలుకుతూండగానే మాతలి విమానంతో అక్కడికి వచ్చి నిలిపాడు. ఇంద్రుని మాటని కాదనలేక మతంగుడు తన ఏనుగు కుమారుణ్ణి ముందుగా ఆ విమానం ఎక్కించి తరువాత తాను ఎక్కి ఇంద్రుడు దగ్గరుండి తీసుకుని వెళ్ళగా తపః సిద్ధులుకూడా ప్రవేశింప శక్యము కాని ఇంద్రలోకానికి వెళ్ళి చిరకాలం సుఖించి తరువాతి కాలంలో చండదేవుడిగా సమస్త జనులచేత పూజింపబడ్డాడు.

అటువంటి దయాశాలి, తపోనిరతుడు అయిన మతంగుని పవిత్ర వంశంలో జన్మించిన వారే "మాతంగులు. వాళ్ళే చండదేవుని వంశము వారగుటచేత "చండాలురు"గానూ ప్రసిద్ధి కెక్కారు. తమ వంశీకుల మూలస్థానాన్ని గుర్తుంచుకొని దానికోసం ప్రయత్నించడం, దాన్ని నిలబెట్టుకుని కాపాడుకోవడం ఉత్తముల పద్ధతి. క్రొత్తొక వింతని తన పూర్వీకుల మార్గాన్ని కాదని వేరొక మార్గాన్ని అనుసరించడం సజ్జనులు అంగీకరిచే మార్గం కాదు. మన సంప్రదాయాన్ని కాపాడుకోడం మనందరి కర్తవ్యం. ఈ విషయంలో ఒకరు మమ్మల్ని బయటకి తోసేశారని కానీ, ఒకరు అవమానించారనీ కానీ భావించడం మన పిరికితనం అవుతుంది. మన స్థానాన్ని మనం పొందడానికి మరొకరి అనుమతితో పనేముంది? ఆస్తిలో వాటా ఇవ్వనంటే హక్కున్న సోదరుడు ఊరుకుంటాడా? సర్వమానవ సౌభ్రాత్రమే భారత ధర్మం. విశ్వమానవ శ్రేయస్సే మన భారత లక్ష్యం. సకలలోక కల్యాణమే మన భారతీయ ఆదర్శం.

ధర్మవ్యాధుడు

భారతదేశంలో ప్రసిద్ధిపొందిన రాజ్యాల్లో విదేహ రాజ్యం ఒకటి. ఆ రాజ్యాన్ని మిథిలా నగరం రాజధానిగా జనకుడనే రాజు పరిపాలిస్తున్నాడు. ఆ మిథిలా నగరం ఎత్తైన కోటతోను, లోతైన అగడ్తతోను, విశాలమైన వీధులతోను, పెద్ద పెద్ద మేడలతోను దేవేంద్రుని పట్టణం అమరావతిని పోలి వెలుగొందుతోంది. పరిమళ భరితాలైన పూలతోటలు, సొగసులు నింపే సరోవరాలు ఆ పట్టణం అందాన్ని ఇనుమడింప చేస్తున్నాయి. జనక మహారాజు ధర్మమూర్తి, పండితుడు, మహాదాత, రాజనీతి ననుసరించి పరిపాలన సాగిస్తున్నాడు. ఆ మహారాజు ప్రజలను కన్నబిడ్డలుగా చూసుకుంటున్నాడు. "యథా రాజా – తథా ప్రజా" అని కదా పెద్దలు అంటారు. అందుకని ఆ రాజ్యంలోని ప్రజలంతా ధర్మవర్తనులు. తమతమ కులవృత్తులను చక్కగా నిర్వహిస్తూ ఇతరులకు ఆదర్శప్రాయంగ జీవిస్తున్నారు. ఆ నగరమంతా వెదకినా మచ్చుకైనా పనిలేని సోమరులు, పనికిమాలిన మూర్ఖులు కనబడరు. జనక మహారాజు ధర్మనిష్ఠవలన మిథిలా రాజ్యం ధర్మ రాజ్యంగ భాసిల్లింది.

ఆ మిథిలా నగరానికి చివర ఒక సుందర, సురుచిర ప్రదేశంలో ఒక అందమైన భవనం ఉంది. అది ధర్మవ్యాధుడనే అంత్యజుని నివాసం. అది ఒక నిర్మల తపోవనంలాగ, పరమ పూజనీయమైన దేవాలయంలాగ పవిత్రంగాను, పరిశుభ్రంగాను వెలుగొందుతోంది. అక్కడ ధర్మవ్యాధుడు ముసలివాళ్లైన తన తల్లిదండ్రులతోను, భార్యాపుత్రులతోను నివాస ముంటున్నాడు. ధర్మవ్యాధుడు తన కుల ధర్మానుసారం మాంసం అమ్ముకొని సంసారం గడుపుతున్నాడు. అతడు గురువుద్వారా ఏ విద్యలు అభ్యసించ లేదు. అయినా పూర్వజన్మ సుకృతంవలన అతనికి అన్ని విద్యల సారము కరతలామలక మయింది. ఎవరికి ఏ సందేహము కలిగినా వారి సంశయాన్ని ధర్మవ్యాధుడు నివారిస్తాడు. అందుకే అతని విషయంలో ధర్మవ్యాధుడనే పేరు సార్థక మయిందనే చెప్పాలి.

ఇలా ఉండాగా ఆ కాలంలో కౌశికుడనే బ్రాహ్మణు డొకడున్నాడు. అతడు వేదాలు, శాస్త్రాలు అన్నీ చక్కగా అభ్యసించాడు. కానీ ఏం లాభం? చదువుల సారం అతనికి ఒంట బట్టలేదు. కోపం, తాపం, అహంకారం, అసహనం అతనిలో పెచ్చు పెరిగాయి. తల్లిదండ్రులంటే లక్ష్యం లేదు. వారి మాట వినకుండా, వద్దన్నా మానకుండా దేశాటనకు బయలుదేరాడు. ఒక

రోజున ఒక గ్రామ సమీపంలో ఒక చెట్టు క్రింద సుఖాసీనుడై వేద పఠనం చేస్తున్నాడు. ఇంతలో ఆ చెట్టు కొమ్మపైన ఉన్న ఒక కొంగ అతనిమీద రెట్ట వేసింది. కౌశికుడు కోపంతో కన్ను లెఱ్ఱజేసి ఆ కొంగకేసి చూశాడు. వెంటనే ఆ కొంగ గిలగిల కొట్టుకుంటూ నేలపై పడి చనిపోయింది.

అంతలో మధ్యాహ్న సమయం కావడంతో కౌశికుడు భిక్షకోసం గ్రామంలోకి బయలుదేరాడు. ఒక పుణ్య గృహస్థు వాకిట ముందు నిలబడి 'భిక్షాం దేహి' అన్నాడు. ఆ ఇంటి ఇల్లాలు తొందర తొందరగా భిక్ష పెట్టడానికి గిన్నె శుభ్రపరుస్తున్న సమయంలో ఆమె భర్త ఆకలితో అలసి ఇంటికి చేరుకున్నాడు. ఆ ఇల్లాలు చిరునవ్వుతో ఎదురేగి శైత్యోపచారాలు చేసి, భోజనం పెట్టి సంతుష్టుణ్ణి చేసింది. ఆ తరువాత భిక్ష తీసుకుని వచ్చిన ఆ ఇల్లాలిని చూచి కౌశికుడు కోపంతో ఉగ్రుడై పోయాడు. 'అడిగినప్పుడే పొమ్మనక నన్ను ఇంతసేపు నిలబెట్టి దుర్మార్గంగ భిక్ష పెట్టక అవమానించావు.' అని అరిచాడు. అది విన్న ఆ పతివ్రత 'అయ్యా! నా భర్త చాలా అలసి ఆకలితో వస్తే ఆయనకు సపర్యలు చేయడంలో కొంచెం ఆలస్యం అయింది. క్షమించు. అది నా ధర్మం. నువ్వు దాన్ని తప్పుగా ఎంచకు' అని అణకువగా చెప్పింది.

దానితో కౌశికుడు 'పండితుల నవమానిస్తే వారి క్రోధాగ్నులు కొండలు, అడవులతో సహా ఈ భూమండలాన్నే దహించివేస్తాయి. ఎరుగవా?' అన్నాడు. 'అయ్యా! నీ మహత్త్వం నేను పూర్తిగా ఎరుగుదును. చూడు! నాకు నా భర్తే పరమ దైవం. త్రికరణ శుద్ధిగ నేను నా భర్త మేలే కోరుకుంటాను. ఇంతకు మించి వేరే ధర్మం నాకు తెలీదు. ఇంక నీ కోపం సంగతంటావా? నీ కోపాగ్నికి భస్మం కావడానికి నేను చెట్టుమీది కొంగను కానుసుమా! శాంతించు. భిక్ష తీసుకో.' అంది ఆ ఇల్లాలు. కౌశికుడి గర్వం అణిగిపోయింది. 'ఎక్కడో ఊరి చివర జరిగిన సంఘటన గడప దాటని ఈ ఇల్లాలికి ఎలా తెలిసింది?' అని ఆశ్చర్యపోయాడు. తన సందేహం తీర్చుకుందుకు ఆ విషయం ఆ ఇల్లాలినే అడిగాడు.

'బ్రాహ్మణోత్తమా! నేనేమీ తపస్సు చేయను. గొప్పగా చదువుకోనూ లేదు. స్త్రీలకు పాతివ్రత్యాన్ని మించిన వ్రతం లేదంటారు. భర్తను సేవిస్తే సకల దేవతలను సేవించినట్లే అవుతుంది. దాని వలన సకల శ్రేయస్సులు లభిస్తాయి. నాకు కలిగిన మహిమలకు అదే కారణం తప్ప వేరేమీ కాదు. నువ్వు పండితుడివి. కానీ కోపావేశంవలన నీ పాండిత్యం ఎందుకూ కొరగాకుండా పోతోంది. కాబట్టి కోపాన్ని జయించు. నీకు అన్నీ వశమవుతాయి. అదీగాక నువ్వు వేదాధ్యయనపరుడవే గాని ధర్మసూక్ష్మాలు ఎరిగినవాడవు కావు. అందుచేత నువ్వు ఆలస్యం చేయకుండా మిథిలా నగరానికి వెళ్ళు. అక్కడ జితేంద్రియుడు, మాతాపితృ సేవాతత్పరుడు అయిన ధర్మవ్యాధుడు అనే అంత్య కులస్థుడు నీ సందేహాలన్నీ తీర్చి నీకు ధర్మ సూక్ష్మాలు ఉపదేశిస్తాడు. భిక్ష ఆలస్య మయినందుకు, ఏవో కబుర్లు చెప్పి కాలక్షేపం చేసానని అన్యధా భావించకు' అని ఆ పతివ్రత సెలవు తీసుకుంది.

కౌశికుడు మనస్సు పరిపరి విధాల పోయింది. 'ఒక స్త్రీ తనకు జ్ఞానోపదేశం చేయడమా? పోనీ! అనుకుందామంటే ఇదేం ఖర్మ? వేదాధ్యయనపరుడైన తాను ఒక అంత్యజుని యొద్దకు ధర్మభిక్షకై వెళ్ళడమా? తన మూర్ఖత్వమే దీనికంతకు కారణము' అని తనను తాను నిందించుకున్నాడు. మిథిలా నగరానికి వెళ్ళడమా? మానడమా? చాలసేపు తటపటాయించాడు. చివరకు ధర్మవ్యాధుణ్ణి చూడాలనే కోరికతో మిథిలా నగరానికి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు. అపరాధం చేసినవాడిలాగ తనను భావించుకుంటూ, పతివ్రత మహిమకు ఆశ్చర్యపోతూ, అనేక గ్రామాలు, నగరాలు దాటుకుంటూ కౌశికుడు కన్నులపండువుగా ఉన్న మిథిలా నగరాన్ని ప్రవేశించాడు. ఆ నగరం ధర్మదేవతకు నివాసంగాను, సత్యానికి సింహాసనంగాను, గుణాల కుప్పగాను కాంతులీనుతోంది.

ఆ నగర సౌందర్యానికి ఆశ్చర్యపోతూ కౌశికుడు రాజమార్గాన వెళుతూ కనబడిన వారిని అడుగుతూ ధర్మవ్యాధుడున్న ప్రదేశం తెలుసుకున్నాడు. నెమ్మదిగ ధర్మవ్యాధుని దుకాణం దగ్గరికి చేరుకున్నాడు. అక్కడ రకరకాల మాంసాలు వరుసగ వ్రేలాడ కట్టబడి ఉన్నాయి. వచ్చే పోయే జనాలతో సందడిగ ఉన్న ఆ దుకాణంలో ఉన్న ధర్మవ్యాధుణ్ణి సమీపించడానికి మనసు ఒప్పక కౌశికుడు ఒక ప్రక్కగ నిలబడి నిరీక్షిస్తున్నాడు. ఇంతలో ధర్మవ్యాధుడు అతని రాకను గుర్తించి దుకాణం విడిచి వచ్చి 'బ్రాహ్మణోత్తమా! అభివాదములు. పతివ్రతా తిలకం పంపించగ నీవు నా దగ్గరకు వచ్చావు. అంతేకదా! నీ మనోవాంఛితం నెరవేరుతుంది. దయచెయ్యి. నా గృహం పావనం చెయ్యి.' అని కౌశికుణ్ణి సాదరంగ తన గృహానికి తీసుకొని పోయాడు. ధర్మవ్యాధుని మాటలు వినగానే కౌశికునికి మతిపోయింది. 'ఆ ఇల్లాలు సంగతే వింత అనుకుంటే, దానిని మించిన రెండో వింత ఇది. ఇతడు నిజంగా ధర్మ స్వరూపుడే. ఏదో పూర్వజన్మ కర్మవలన అంత్యకులంలో జన్మించాడు. అయితేనేం, ఇతనినుండి ధర్మసూక్ష్మాలను తెలుసుకోవడమే ప్రస్తుత నా కర్తవ్యం.' అనుకున్నాడు. ధర్మవ్యాధునితో అతని భవనానికి చేరిన కౌశికుడు అతనిచే పూజింపబడి, కుశల ప్రసంగ సమయంలో 'ధర్మవ్యాధా! నీవు ధర్మ విదుడివి. మరి జీవహింస జీవనంగ గడుపుతున్నావు. ఇదేం ధర్మం. ఈ విపరీతానికి నేను చాలా దుఃఖ పడుతున్నాను సుమా!' అన్నాడు.

"ఆర్యా! బ్రాహ్మణులకు తపస్సు, వేదాధ్యయనం, సత్యం, బ్రహ్మచర్యం., రాజుకు దండనీతి., వైశ్యులకు వ్యవసాయం, పశుపోషణ, వాణిజ్యం., శూద్రులకు శుశ్రూష ఎలా పరమ ధర్మాలని చెప్పబడుతున్నాయో అలాగే మాకు మృగమాంస ఉపజీవనం ధర్మంగా చెప్పబడింది. మీదు మిక్కిలి ఇది మాకు వంశ పారంపర్యంగ వచ్చిన జీవనాధారం. ఎవరి వృత్తి వారు అవలంబించడమే సృష్టి ధర్మం. స్వధర్మాన్ని ఆచరించడం తప్పు కాదు. నీకు కొంత నా స్వవిషయం వివరిస్తాను విను. 'నేను ఎన్నడూ జీవహింస చెయ్యను. ఇతరులు చంపి తెచ్చిన

జంతువులనే కొని వాటి మాంసం అమ్ముకుని ఆ ధనంతో జీవనం సాగిస్తున్నాను. ఉన్నదాంట్లో కొంత దానం చేస్తాను. పాపపు పనులు ఎప్పుడూ చెయ్యను. అతిథులను దేవతల్లా పూజిస్తాను. అన్నిటినీ మించి ముసలివాళ్ళైన నా తల్లిదండ్రులను దైవాల్లా భావించి పూజిస్తాను. కులవృత్తి పాటించడం ధర్మమనీ, దాన్ని విడిచిపెట్టడం అధర్మమనీ నా విశ్వాసం. ఆ కారణం చేతనే నేను హీనకులంలో జన్మించిన వాడిని అయినప్పటికీ నిర్మలంగ జీవించగలుగుతున్నాను." అని ధర్మవ్యాధుడు పలుకుతూ "నువ్వు ధర్మసూక్ష్మాలు తెలుసుకోవడానికి కదా! నా దగ్గరకు వచ్చావు. నీకు ఇక ఆ ధర్మ సూక్ష్మాలు వివరిస్తాను విను."

"ఎప్పుడూ సత్యాన్ని, హితాన్నే పలకాలి. సజ్జనులను గౌరవించడం నేర్చుకోవాలి. రాగద్వేషాలకు లొంగి బుద్ధి చలించి ధర్మ మార్గం తప్పకూడదు. ప్రియము నందైనా, అప్రియము నందైనా హర్షాన్ని, దైన్యాన్ని పొందకూడదు. అపకారం చేసిన వారికైనా ఉపకారమే చేయాలి. అన్యదోషకారి తన తప్పుచేతనే తాను పాడైపోతుంటే వానికి వేరే కీడు చేయడమెందుకు? ధర్మపరులు చేసే ఉత్తమ కార్యాలను నాస్తికులు చెడగొట్టడానికి ప్రయత్నిస్తూంటారు. బుద్ధిమంతుడు దాన్ని తెలిసికొని ధర్మాన్ని విడిచిపెట్టకుండా నడచుకోవాలి. పాతకా లన్నిటిలోకి పెద్ద పాతకాలు క్రోధ, లోభాలు. ఆ రెండింటిని జయించినవాడే ధార్మికుడనబడతాడు. అయితే కొన్ని వక్రమార్గాలు గడ్డిచే కప్పబడిన నూతుల్లా మనకు సత్యమార్గాల్లా కనబడుతూ మనల్ని మోసగిస్తూంటాయి. అలాంటప్పుడు మానవుడు శిష్టాచారాలను తెలుసుకొని, గురు శుశ్రూష ద్వారా యథార్థాన్ని గుర్తించి జ్ఞానంచేత పరిపక్వమైన మనస్సు కలవాడు కావాలి. కామ, క్రోధాలనే మొసళ్ళు కల, కోరికలనే సుడిగుండాలతో కూడిన మోహ మహానదిని అస్ఖలిత ధైర్యమనే తెప్పను ఆధారంగ చేసికొని దాటగలగాలి. ధర్మాలన్నిటిలోను 'సత్యము' చాలా గొప్పది. ఇష్టమున్నా, లేకపోయినా ఎవరూ తన కులవృత్తిని విడిచిపెట్టకూడదు. అంతేకాదు, అది తన భాగ్యమని భావించి తప్పక అనుసరించాలి.'

'తనకు ఆపద గలిగితే దానికి దైవాన్ని నిందించాల్సిన పని లేదు. తన పూర్వ కర్మ ఫలం అనుకోవాలి. ఆ పూర్వ కర్మ ఫలం తన అధీనంలో ఉండదు. ఒక కార్య ఫలానికి తానే కర్తను అనుకోవడం అజ్ఞానం చేత మాత్రమే. నిజంగా తానే కర్త ఐతే ఎవరూ తన పని చెడిపోవాలని తానే కోరుకోడు కదా! మనుష్యుడు కర్మాధీనుడై జీవించవలసిందే. అలా కాదని తన జీవితం తన వశమే అనుకొనేటట్టయితే కష్టాలు, రోగాలు, చావు ఇవేం లేకుండా జీవించ వచ్చు కదా! కర్మ వశంచేతనే ఈ దేహం కలుగుతోంది. ఈ దేహం నడక కూడా కర్మ వశంలోనే జరుగుతోంది. చివరకు ఈ దేహం నశించినా దేహంలోని జీవుడు కర్మవిహితమైన చోటికే చేరుతుంది. ఈ దేహం ఒక రథం. ఇంద్రియాలు గుఱ్ఱాలు. మనస్సు సూతుడు. ధైర్యమనే పగ్గాలను బిగపట్టినవాడు క్షేమంగ ప్రయాణం చేయగలుగుతాడు. ఇంద్రియాలు లాగిన వైపుకి

పరుగెత్తే మనస్సు ఆ గుఱ్ఱాలను ఆపలేని సూతునిలా విఫలమైతే ఆ రథంలోని రథికునిలాగే బుద్ధి నశిస్తుంది. తుఫాను గాలి తాకిడికి సముద్రంలోని పడవ ఏమవుతోంది? అంతే. కాబట్టి అయిదు ఇంద్రియాలను, మనస్సును తన వశంలో ఉంచుకోగల్గిన మనుష్యుడు దేవతలచేత, మునులచేత కీర్తింపబడతాడు. బ్రాహ్మణోత్తమా! నువ్వు అడిగిన సమస్త ధర్మాలను సంక్షేపంగ తెలియ పరిచాను. ఇంక ఏం వినాలనుకుంటున్నావో చెప్పు' అని ఈ ప్రకారంగ ధర్మవ్యాధుడు ధర్మసూక్ష్మాలను కౌశికునికి విశదపరిచాడు.

ఆ ధర్మసూక్ష్మాలను విన్న కౌశికుడు 'మహాత్మా! వినవలసిన దానినంతను విన్నాను. ప్రబుద్ధుడ నయ్యాను. నీవు సర్వజ్ఞుడవని నాకు తేటతెల్ల మయింది.' అని పలుకుతూండగానే ధర్మవ్యాధుడు 'విప్రోత్తమా! నేనీవిధంగ ఉత్తమ విజ్ఞానంతో ఉన్నతిని పొందడానికి మూలకారణం ఒక్కటుంది. అది నువ్వు తప్పక దర్శించి వెళ్ళాలి.' అని కౌశికుణ్ణి వెంటబెట్టుకుని ఒక సుందర భవనంలో ప్రవేశించాడు. అక్కడ రెండు భద్రాసనాలపై ఇరువురు వృద్ధ దంపతులు సుఖాసీనులై ఉన్నారు. వాళ్ళు ఆరముగ్గిన పళ్ళలా ఉన్నారు. దివ్యతేజస్సుతో కళకళ లాడుతున్నారు. స్వచ్ఛమైన తెల్లటి వస్త్రాలు ధరించి ఉన్నారు. వాళ్ళిద్దరూ అరుంధతి, వశిష్ఠుల్లాగ ప్రకాశిస్తున్నారు. ధర్మవ్యాధుడు వారికి పాదప్రణామం చేసి కుశల సమాచారం అడిగేడు.

ఆ వృద్ధ దంపతులు 'నాయనా! కుమారా! నీవంటి సత్పుత్రుడు ఉండగా మాకేమిటి లోటు? నీవు నిర్వర్తించే పుత్ర ధర్మమే నీకు తోడు. ఆయురారోగ్య ఐశ్వర్యాలు పొంది సుఖంగా జీవించు. నీవలన మన వంశమే పవిత్రమైంది. ఏ శాపంవల్లో మానవుడవై జన్మించావు.' అని పలికి ఆశీర్వదించారు. అపుడు ధర్మవ్యాధుడు కౌశికునకు వారిని చూపించి 'బ్రాహ్మణశ్రేష్ఠా! వీరు నా తల్లిదండ్రులు. వీరికి సేవచేయడం మూలంగానే నాకు ఇట్టి పరిజ్ఞానం కలిగింది. అమాయకులై అందరూ అన్యదైవాలను ఆరాధిస్తారు. నేను ఇతర దేవతలను ఎరుగను. ఈ వృద్ధులైన నా తల్లిదండ్రులే నా పాలిటి దైవాలు. వీరికి ఆహార, విహారాల్లో ఏ లోపం జరుగకుండా నేను, నా భార్యాబిడ్డలు శుశ్రూష చేస్తూంటాము. వేదాలు, యజ్ఞాలు, వ్రతాలు అన్నీ నాకు వీరే అని నిశ్చయంగ భావిస్తాను. ఉదయం మొదలు రాత్రి వరకు వీరికి కావలసిన అవసరాలు తీర్చడమే నా విధి. స్నానం చేయిస్తాను. బట్టలు కడతాను. పళ్ళు, పాలు, ఆహారం ఆరగింప చేస్తాను. వారి ఆనందమే మా ఆనందం. అలాగే వారి దుఃఖపడితే అది మాకు అపరిమితమైన దుఃఖ మవుతుంది.' అని చెప్పగానే కౌశికుడు తల్లిదండ్రుల సేవ అంత గొప్పదన్నమాట అనుకున్నాడు.

అది తెలుసుకున్న ధర్మవ్యాధుడు 'మహానుభావా! సందేహం లేదు. 'మాతృ దేవో భవ' 'పితృ దేవో భవ' అని వేదాలు ఘోషిస్తున్నాయి. తల్లి కొడుకు పుట్టాలని తపిస్తుంది. స్నానాలు, ధ్యానాలు, వ్రతాలు, ఉపవాసాలు ఎన్నో చేస్తుంది. వెయ్యి దేముళ్ళకు మ్రొక్కి నవమాసాలు మోసి

బిడ్డను కంటుంది. ఆ బిడ్డ బాల్య చేష్టలకు తల్లి మురిసిపోతుంది. వాని యోగక్షేమాలకోసం తన సర్వస్వం ధారపోస్తుంది. అలాగే తండ్రి తన బిడ్డను సంరక్షిస్తూ, చదువుసంధ్యలు చెప్పించి సంస్కారం నేర్పుతాడు. పదిమందిలో ఒక వ్యక్తిగ తీర్చి దిద్దుతాడు. తన కుమారుడు గొప్పవాడు కావాలని శతవిధాల ప్రయత్నిస్తాడు. కొడుకు అభ్యుదయం చూసి తల్లిదండ్రులు పొంగి పోతారు. వాడు పాడయితే క్రుంగిపోతారు. అలాంటి తల్లిదండ్రుల ఋణం ఎవరు తీర్చగలరు?' అని హితోపదేశం చేశాడు ధర్మవ్యాధుడు. అది విన్న కౌశికుడు 'పుణ్యాత్ముడా! నాకు కనువిప్పు కలిగించావు. నా మూర్ఖత్వం నశించింది. నాలో జ్ఞానజ్యోతి వెలిగించావు. తల్లిదండ్రుల సేవ ఇంత గొప్పదని నేనెన్నడు ఆలోచించలేకపోయాను.' అని దీనంగా పలికాడు.

ధర్మవ్యాధుడు ఆతనిని ఊరడించి 'విప్రశ్రేష్ఠా! ఒక్క విషయం విను. తల్లి, తండ్రి, గురువు, అగ్ని, పరమాత్మ – ఈ అయిదుగురు గృహస్థుచేత పూజింపదగినవారు. అందులోను తల్లిదండ్రులు మిన్న అని ధర్మవిదులు చెబుతారు. అదే ధర్మ రహస్యం. అది నాకు బాగా వంటబట్టింది. మాతాపితృ సేవవల్లనే నాకు ఏ విద్యలు లేకపోయినా అన్ని సిద్ధులు సిద్ధించాయి. ప్రత్యక్షం, పరోక్షం అంతా నేను తెలుసుకో గలుగుతున్నాను. నీ విషయం, నిన్ను పంపించిన పతివ్రత విషయం ఒకటేమిటి జరిగింది, జరుగబోయేది అన్నీ నేను తెలుసుకోగలను పతిభక్తివల్ల ఆ పతివ్రతకు శక్తులు లభిస్తే, మాతాపితృ భక్తివల్ల అంతకు మించిన శక్తులు నాకు లభించాయి. అదే నాకు మహాప్రసాదం. నీ విషయం ఒక్కటి చెబుతాను విను. అన్ని శాస్త్రాలు చదివావు. అన్ని ధర్మాలు నీకు తెలుసు. కాని నీకు ఆచరణలో శ్రద్ధ లేదు. నువ్వు ఒక పెద్ద పొరపాటు చేశావు. నీకు నీ తల్లిదండ్రులమీద గౌరవం లేదు. వాళ్ళు ముసలివాళ్ళు, గ్రుడ్డివాళ్ళు, అమాయకులు వాళ్ళు ఈ వయసులో నీవంటి పుత్రుడు ఉండికూడా నానా బాధలు పడుతున్నారు. వారికి సేవలు చేయడం మానేసి వాళ్ళు వద్దన్నా వినకుండా దేశాటనం కోసం ఇల్లు విడిచిపెట్టి వచ్చావు. అది ధర్మం కాదు. అందుచేత వెంటనే ఇంటికి తిరిగి వెళ్ళు. తల్లిదండ్రుల్ని మనసార సేవించు. నీకు సకల శ్రేయస్సులు కలుగుతాయి. పాండిత్యం గొప్పదే కావచ్చు. మాతా పితృ సేవ దానికంటె గొప్పది. గట్టిగా మాట్లాడితే దానిని మించిన ధర్మం మరొకటి లేనేలేదు.' అని ధర్మవ్యాధుడు కౌశికునికి హితవు పలికాడు.

'ధర్మనిధీ! ధన్యుణ్ణి. నాకు మంచి ఉపదేశం చేశావు. చక్కని జ్ఞానం ప్రసాదించావు. ఇంతవరకు నేను స్త్రీలను తక్కువగా భావించే స్వభావంతో ఉన్నాను. పతివ్రతయైన ఇల్లాలు ధర్మమా అని స్త్రీజాతిపై గౌరవం ఏర్పడింది. హీనజాతి వారని అంత్యజులను దూరంగా ఉంచేవాణ్ణి. నేడు నీ అనురాగం నాకు జాతి ప్రధానం కాదనీ, గుణమే ప్రధానమనీ తెలిసి వచ్చింది. వెంటనే నేను వెళ్ళి నా తల్లిదండ్రుల సేవ చేసికొని తరిస్తాను.' అని ధర్మవ్యాధుని దగ్గర సెలవు తీసుకొని, ఆతని ధర్మాచరణనే తలపోసుకుంటూ తన గ్రామానికి బయలుదేరాడు. ధర్మవ్యాధుడు తన

ధర్మాన్ని విడిచి పెట్టలేదు. ధర్మాన్ని కాపాడినవారిని ఆ ధర్మం తప్పకుండా కాపాడుతుంది. అందుకే ధర్మవ్యాధుని కీర్తి ఆచంద్రతారార్కంగ నిలబడింది.

ఈ ధర్యవ్యాధుని ధర్మ వర్తనం, మాతా పితృ సేవనం మనకు ఆదర్శప్రాయం కావాలి. మన ధర్మాన్ని మనం రక్షించుకోవాలి. మన ధర్మాన్ని తాత్కాలిక ఆవేశాలకు లొంగి వదలిపెట్టుకోవడం మరణ సదృశమని గ్రహించుకోవాలి. ధర్మాన్ని రక్షించుకోవడమే హిందూ ధర్మ లక్ష్యం. మానవులంతా ఒక్కటేనని మన ధర్మం ఎలుగెత్తి చాటుతోంది. మధ్యలో వచ్చిన మార్పులను గురించి చర్చించుకోవడం కాదు, అసలు మూలాన్ని గురించి ఆలోచించుకోవాలి. అప్పుడు తెలిసేది ఒక్కటే అది 'చాతుర్వర్ణ వ్యవస్థే కాని పంచమ వర్ణ మనేది వైదిక ధర్మంలో లేనేలేద'ని. ఆలోచించండి – ఆలోచించి అడుగు ముందుకు వెయ్యండి. భారతీయ ఐక్యతను కాపాడడానికి అందరం కలిసి నడుద్దాం.

చండాలుడు

భారతీయులకు కాశీ పరమ పవిత్ర పుణ్యక్షేత్రం. కాటికి కాళ్ళు చాచినవాడైనా కాశీలో మరణించాలనుకుంటాడు. ఆ కాశీపట్టణం కదంబ వనాలతో, గంగాతీరమందున్న యూప స్తంభాలతో, మహానుభావులైన యోగులతో బహు మనోజ్ఞంగ ఉంది. గంగానది విష్ణు పాదాగ్రం నుంచి జన్మించినదవడం వల్లనో, శివుని శిరస్సునందున్న చంద్రుని స్పర్శ వల్లనో, మంచుకొండ శిఖరంనుండి పడటం వల్లనో స్ఫటిక మణిలా ప్రకాశిస్తూ స్వచ్ఛమైన జలాలతో నిండి ఉంది. శ్రీ శంకరాచార్యులు అద్వైత మత స్థాపకుడు. ఆయన శంకరుని అపరావతారంగ కీర్తింపబడ్డాడు. ఆసేతు హిమాచలం తన ధర్మబోధలతో ఆయన తన కీర్తి ప్రతిష్ఠలను వ్యాపింపచేసుకున్నాడు. ఆయన సన్యసించి దేశాటనం చేస్తూ ఒకసారి కాశీ నగరం చేరుకున్నాడు. గంగా స్నానం, విశ్వేశ్వర పూజనం చేసుకుంటూ, ముముక్షువులకు అనుదినం బ్రహ్మవిద్యా తత్త్వాన్ని బోధిస్తూ ఆయన ఆ క్షేత్రంలో కొంతకాలం గడుపుతున్నాడు. అనేకమంది శిష్యులతో కూడిన శ్రీ శంకరాచార్యస్వామి కిరణ పంక్తులతో కూడిన సూర్యభగవానునిలా ప్రకాశిస్తున్నాడు.

ఒకనాటి మధ్యాహ్న సమయం. శ్రీ శంకరాచార్యస్వామి శిష్యబృందంతో మాధ్యాహ్నిక విధులను తీర్చుకోడానికి గంగానదికి బయలుదేరాడు. సుస్నాతుడై భిక్షాటనంకోసం కాశీ నగర వీధులలో ప్రవేశించాడు. ఇంతలో ఒక చండాలుడు వారి మార్గానికి అడ్డుగా వచ్చాడు. అతని దేహం కారుమేఘాలు అలుముకున్న అమావాస్యనాటి అర్థరాత్రి చీకటిని పరిహసిస్తోంది. మొలకు నల్లని గోచీ, తలకు తెల్లని పాగా, కుత్తుకకు వెండి కంటె, కాళ్ళకు మెట్టెలు ధరించాడు. కల్లు త్రాగిన మైకం తలకు ఎక్కడం చేత కళ్ళు నెత్తురు ఓడుతున్నాయి. చేతిలో దుడ్డుకఱ్ఱ పట్టుకొని, మాట్లాడటానికి నాలుక లొంగక పోవడంచేత తడబాటు మాటలతో, తప్పుడు పాటలతో, తనకు సరిపడేటట్టు ప్రక్క వాయిద్యాల్లా మొరుగుతున్న నాలుగు కుక్కలతో ఆ చండాలుడు శంకారాచార్యుల మార్గానికి అడ్డుపడ్డాడు.

వాణ్ణి చూచి శంకరాచార్యులు ప్రక్కకు తప్పుకుంటూ "ఓరీ! దూరంగ తొలగు, తొలగు" అన్నాడు. మహాజ్ఞానియైన ఆ శంకరాచార్యస్వామి అలా అనగానే ఆ చండాలుడు ఇలా బదులు పలికేడు. 'ఓ సన్యాసీ! అద్వితీయమనీ, అనఘమనీ, అఖండమనీ, అసంగమనీ, అనాది సత్య బోధ సౌఖ్య రూపమనీ ఆత్మను శ్రుతులు పేర్కొంటూ ఉన్నాయి. అలాంటి ఆత్మను నువ్వు వేరు చేస్తున్నావు. చాలా ఆశ్చర్యంగా ఉంది. చేత దండ కమండలాలు ధరించావు. కాషాయ బట్టలు కట్టేవు. జ్ఞాన గంధం లేని మాటకారులైన నీలాంటి కొందరు ఇలాగే పగటి వేషాలతో గృహస్థులను

మోసగిస్తున్నారు. సరే కానీ, ఇప్పుడు నన్ను దూరంగ పొమ్మన్నావు కదా! ఏది పోవాలి? దేహమా! దేహియా! పోనీ దేహాన్ని అందామా! సమస్త దేహాలు అన్నమయములే. కాదూ, దేహిని అందామా! సర్వసాక్షియైన దేహి అన్నింటా, అంతటా ఒక్కటే కదా! ఈ రెంటికి భేదం లేనప్పుడు నీ మాటకు అర్థం ఏమిటి? ప్రత్యగాత్మ విషయంలో ఇతడు బ్రాహ్మణుడు, ఇతడు చండాలుడు అనే విచారం ఎలా పొసుగుతుంది? గంగలోను, కల్లు కడవలోను ప్రతిబింబించే సూర్యబింబానికి ఏదైనా భేదముంటుందా? దేహాలన్నిటిలోను వెలుగొందుతూ, అదేహుడైన పూర్ణ పురాణ పురుషుణ్ణి నువ్వు నీ బుద్ధిని మరచిపోయావు. నేను శుచుణ్ణి, నేను ద్విజుణ్ణి, నువ్వు చండాలుడవని నాపై మిథ్యాగ్రహం ప్రదర్శిస్తున్నావు. అచింత్యము, అనంతము, అఖండమునైన ఆత్మానందాన్ని విస్మరించావు. ఏనగు చెవిలా అతి చంచలమైన ఈ కళేబరంమీద ఇలాంటి అహంభావం వహించడం నీవంటి సర్వసంగ పరిత్యాగికి తగినదేనా? చెప్పు. ముక్తిమార్గమైన విద్యను పొంది కూడా తుచ్ఛమైన జనవశీకరణేచ్ఛను విడువలేక పోతున్నావు. ఎంతటి వారైనా పరమాత్ముని మాయావశులై ఈ జగత్ ఇంద్రజాలంలో మునుగక తప్పదని నిరూపించావు. ఆహా! ఏమి చిత్రం? ఎంత విచిత్రం?' అని చండాలుడు పలికిన పలుకులను విని శంకారాచార్యస్వామి అత్యాశ్చర్యంతో, ఇతడు సామాన్యుడుకాడని నిర్ణయించుకొని 'ఓ మహానుభావా! సత్యం వచించావు. నువ్వు చండాలుడవని మూర్ఖపు బుద్ధిని తలంచాను. పరమ తత్త్వవేత్తవైన నీ మాటలవలన నాకు జ్ఞానోదయ మైంది. నువ్వు జ్ఞానస్వరూపుడవయిన ఆ విశ్వేశ్వరునిలా కనబడుతున్నావు. చండాలునకు ఇట్టి తత్త్వజ్ఞానము ఉండటం అద్భుతం. ఏది ఏమైనా ఇప్పుడు నేను నీ ప్రశ్నకు సమాధానం చెప్పవలసిన వాడనయ్యాను, విను. నేను దేహాన్నిగానీ, దేహినిగానీ దూరంగ పొమ్మన లేదు. లోకసామాన్య రీతిని ప్రాణులు దేహాత్మ బుద్ధి కలిగి ఉంటారు. నువ్వుకూడా అలాంటి వాడవేనని తలంచి నేను నిన్ను దూరంగ పొమ్మన్నాను. నువ్వు దేహానికి, ఆత్మకు గల భేదము నెఱిగినవాడవు. సర్వదా ఆత్మనిష్ఠుడై ఉండేటటువంటి నీవంటి మహానుభావు డెవ్వడైనా నాకు వందనీయుడు. వందనీయుడే కాదు, ముమ్మాటికి గురుస్థానీయుడు అని నొక్కి చెబుతున్నాను. జగమంతా ఆత్మ స్వరూపముగా చూచే నిశ్చితమతి ఎవ్వరో అట్టివాడు బ్రాహ్మణుడైనా, చండాలుడైనా నేను నిశ్చయంగ వానికి మ్రొక్కుతాను. 'విష్ణువు మొదలు కీటకం వరకు గల దేహులన్నిటియందు ఉండే చైతన్యమునే నేనుకానీ, కనబడు దృశ్యమును నేను కాను' అనే సిద్ధపురుషుడు వాడు చండాలుడైనా, నా పాలిటి గురువుగానే నేను భావిస్తాను.' అని కళ్ళు మూసుకొని, చేతులు జోడించి ఆ చండాలుని క్షమించమని వేడుకున్నాడు.

జ్ఞానోన్మత్తుడైన శంకరునికి తన ఎదుటనున్నది చండాలుడను భావనయే లేకపోయింది. తెల్లని దేహంలో శివాకృతియే ఆయన కన్నులకు కనబడింది. చేతనున్న దుడ్డుకఱ్ఱ ముమ్మొనలతో వెలుగొందు త్రిశూలమే అయ్యింది. తెల్లని తలపాగ చంద్రఖండ మయింది. నల్లని గోచి ఏనుగుచర్మ మయింది. ప్రక్కనున్న నాలుగు కుక్కలు సాంగములైన నాలుగు వేదము

లయ్యాయి. నల్లని దేహము తెల్లనిదై సచ్చిదానందమూర్తిగానే ఆ చండాలుడు శ్రీ శంకరునికి భాసిల్లాడు. ఆయనకు భయం, భక్తి, వినయం, ధైర్యం, విస్మయం, హర్షం అన్నీ ఒక్కసారిగ కలిగాయి. "దేవా! దేహభావంతో నేను నీకు దాసుణ్ణి. జీవభావంతో నేను నీ అంశాన్ని. ఆత్మభావంతో నేనే నువ్వు. దేని దర్శనం వలన లోకాలన్నింటియందు వ్యాపించిన అంధకారం పటాపంచ లవుతోందో, దేనికి మంజూష, శాణం, గని లేదో, దేనిని యతిశ్రేష్ఠులు ఏకాంతంగ ప్రేమతో అహర్నిశం ధ్యానిస్తారో అదే ఆత్మ స్వరూపం. అలాంటి ఆత్మ స్వరూపం నిఖిల నిగమ శిరోభూషణం. ఆ మహామణికి ఇదే సాష్టాంగ వందనం." అని శ్రీ శంకరులు చండాలుని పాదాలపై పడగా శిష్యకోటికి అర్థంకాక పోయింది. వారు మొహాలు తెల్లబార నిశ్చేష్టులై నిలుచుండి పోయారు.

శంకరుడా చండాలుని ఇంకా ఇలా కొనియాడుతూనే ఉన్నాడు. 'దేవా! గహనమైన పరతత్త్వాన్ని తెలియ చెప్పడానికి గురువునకు తప్ప అన్యులకు సాధ్యమయ్యేది కాదు. సమస్త శాస్త్రాలు చదివినా గురూత్తముని కరుణ లేకుంటే ఆ చదువు నిరర్థకం. జ్ఞాన వైభవం లభించని నాడు గురువర్యుని కృప లభించిందనుకోవడం నీటిపై వ్రాత వంటిదే అవుతుంది. అలాంటి తత్పద, స్వపద లక్ష్యార్థమైన అనుపమ అద్భుతాలకు పరమావధియైన పరమతత్త్వాన్ని గుర్తింప చేశావు. నా అహంకారాన్ని అణచి వేశావు. నీకు ఇవే నా శతకోటి నమోవాకాలు.' అని వినిపిస్తూ కనుకొలకులనుండి జాలువారే ఆనందబాష్పాలను అరచేత ఒత్తుకుంటూ ఆ శంకరాచార్య స్వామి తిరిగి తిరిగి సాష్టాంగ వందనా లర్పిస్తూంటే నిర్వికారుడైన ఆ చండాలుడు, తనకు తన కుక్కలు తోడు రాగా నగరి వెలుపలకు దారి తీశాడు. శిష్య బృందంతో కూడి శ్రీ శంకరాచార్య స్వామి భారావనత హృదయుడై ప్రాణికోటి అంతా ఒక్కటేననే పరమ సత్యాన్ని గ్రహించినవాడై ఆశ్రమానికి శిష్య పరివారంతో కూడి బయలుదేరాడు. పంచమ వర్ణీయుడైనా పవిత్రమైన అద్వైతాన్ని తనచే గ్రహింపచేశాడని, ఆనంద పులకిత గాత్రుడై శ్రీ శంకరులు పదేపదే ఆ దృశ్యాన్ని తలచుకుంటూ నిష్క్రమించాడు.

మనుషుల బాహ్య స్వరూపాలను బట్టి విలువలు నిర్ణయించడం అల్పజ్ఞుల లక్షణం. ఆత్మ సౌందర్యాన్ని అవలోకించ గలగడం, ఆరాధించడం ఆత్మజ్ఞుల లక్షణం. ఆ స్థితికి చేరుకోవడం మన ఆశయం కావాలి. అపురూపమైన మన ప్రాచీన సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెట్టుకోవడానికే మనం ప్రయత్నించాలి. మనది కాదని మన పూర్వుల ఆస్తిని వదలుకోవటం లేదు కదా! పోరాడుతున్నాము, సాధించుకుంటున్నాము. రండి. మన స్థానంకోసం మనమూ పోరాడుదాం. సాధించుకుందాం.

శ్రీపాణి

శ్రీరంగం వైష్ణవులకు భూతల స్వర్గం. మానవుడు మరణానంతరం స్వర్గం చేరాలనుకుంటాడు. కాని విష్ణుభక్తుడు మరణించే లోపున ఒక్కసారైనా శ్రీరంగనాధుణ్ణి దర్శించాలనుకుంటాడు. అలాంటి పరమ పవిత్ర శ్రీరంగ క్షేత్రానికి సమీపంలో 'ఉరయూర' నే గ్రామంలో శ్రీవత్స లాంఛనంతో 'శ్రీపాణి' ఆరవిచ్చిన మందారంలా జన్మించాడు. పంచమ వర్ణంలో జన్మించినా శ్రీపాణికి బాల్యంనుంచీ భగవత్కటాక్షం సంప్రాప్తించింది. పరమ సాత్త్విక ప్రవృత్తి కలవాడై పరమ పురుషార్థ లక్షణమైన మోక్షమే ప్రధానాశయంగ భగవంతుణ్ణి తన గానామృతంతో అభిషేకించేవాడు. భగవదనుగ్రహ ప్రాప్తినందిన తత్త్వజ్ఞాన సంపన్నుడైన నారద మహామునిలా భగవద్గాన విద్యా సార్వభౌముడై పరాత్పరుణ్ణి ప్రస్తుతించే ఆ శ్రీపాణిని చూచిన వారంతా 'ఈతడెవడో సామగానవేత్తయైన మహాపండితుడై ఉంటాడు. ఇతరులకు ఇంతటి అత్యుత్తమ గాన సామర్థ్యం ఎక్కడిది?' అని పరిపరి విధాల ప్రస్తుతించేవారు.

శ్రీరంగనాధ దేవాలయ ముఖద్వారం దగ్గర శ్రీపాణి పద్మాసనం వేసుకుని భగవంతుడు తనతో ప్రత్యక్షంగ మాట్లాడుతున్నట్టు అతని మహిమను కొనియాడుతూ గానం చేస్తూండేవాడు. లేతమామిడి చిగురు మెక్కి ఒగరెక్కిన గొంతుతో పాడే కోయిలలా శ్రీరంగనాధుని భక్తిలో తన్మయుడై, తలమునకలౌతున్న శ్రీపాణి తన కవిత్వ మాధుర్యాన్ని గాన మకరందంతో కలిపి దశదిశలా వ్యాపింప చేస్తూండేవాడు. శ్రీరంగనాధుని పాదపద్మాలను తన హృదయ మందిరంలో నిలుపుకొని ఆ అనుభవ జనిత మహానంద సందోహ కందళిత హృదయారవిందుడై ఒక చేత వీణ వాయిస్తూ, వేరొక చేత తాళం వేస్తూ నారాయణుని దివ్య కల్యాణ గుణాలను ఆడుతూ, పాడుతూ గానం చేస్తూండేవాడు. ఆ గానంలో వివశుడై ఉన్మత్తుడిలా వికవిక నవ్వుతూ, ఏడుస్తూ,, గంతులు వేస్తూ, దొర్లుతూ భక్త్యాతిరేకంతో మాటిమాటికి సాష్టాంగ పడుతూ భ్రాంతుడై ఇటు అటు పరుగులు పెడుతూ శ్రీరంగని దివ్యనామం కీర్తిస్తూండేవాడు. శ్రీపాణికి శ్రీరంగని దివ్యమంగళ విగ్రహాన్ని ధ్యానించడమే లోకం. ఆ స్వామి పాదపద్మాలను దర్శించాలనుకోవడమే తీరని కాంక్ష.

కొందరు ఆతని కంఠ మాధుర్యాన్ని, భక్తి పారవశ్యాన్ని ప్రశంసిస్తే, కొందరు ఆతనిని పొగరెక్కి గంతులు వేస్తున్నాడన్నారు. పంచముడు గాయకుడు, భక్తుడు అవడమా! అని కొందరు పరిహసించేరు. వర్ణాశ్రమ ధర్మాలు మంట కలుపుతున్నాడనీ, శ్రీరంగనాధుడు ఈతని వలన

మైలపడి పోతున్నాడనీ మరికొందరు విచారించారు. శ్రీరంగనాధునికి తనపై ఇంకా కరుణ కలుగనప్పుడు సామాన్యులగు వీరల తప్పేముంది? అని శ్రీపాణి తలపోస్తూండేవాడు. ఆలయ ప్రధాన పూజారి లోకసారంగముని వృద్ధుడైనా నియమ నిష్ఠలు వదలని శ్రోత్రియుడు. ప్రాతఃకాలాన్నే కావేరిలో సుస్నాతుడయి కావేరి జలాలు నిండిన సువర్ణ కలశాన్ని ఆయనే తీసుకొని రావాలి. అంతేగాని అన్యులు దానిని తాకనైనా తాకకూడదు. ఆయన గాన మాధుర్యానికి ఉప్పొంగుతూ, భక్తులు అతని గాన మహిమవలన శ్రీరంగనాధుడే పరిశుద్ధుడవుతున్నాడని తలపోసేవారు. అటువంటి మాటలు విని శ్రీపాణి వారిపై జాలి పడుతూండేవాడు. సమస్త జీవకోటిని కంటికి రెప్పలా కాపాడుతూ ఆ పరమాత్ముడే సమస్త జీవులను పరిశుద్ధులను చేస్తూంటే, సామాన్య మానవుడు ఆ పరాత్పరుని కాపాడుతున్నాడనీ, పరిశుద్ధుణ్ణి చేస్తున్నాడనీ తలంచే మూఢుల మాటలకు శ్రీపాణి ఆశ్చర్యపడుతూండేవాడు.

లోకసారంగముని కావేరి పవిత్ర జలాలతో ఆలయంలో ప్రవేశించాడు. శ్రీపాణి పంచముడవడంచేత ఆలయ ముఖద్వారం వరకు అతన్ని ఎందుకు రానిచ్చారని ఆయన తన శిష్యులను మందలించాడు. కాని శిష్యులు రావడానికి పూర్వమే శ్రీపాణి ముఖద్వారం చేరుకుంటే పాపం వాళ్ళేం చేస్తారు? ధ్యాన నిష్ఠలో ఉన్న అతణ్ణి పలకరించేదెలా? కళ్ళు మూసుకొని ధ్యానముద్రలో ఉన్న అతణ్ణి బయటకు పంపేదెలా? శిష్యులకు పెద్ద సమస్య అయింది. శిష్యుల రణగొణ ధ్వనిని విని శ్రీపాణి ధ్యానం చెదిరింది, కళ్ళు తెరిచాడు. 'రాకూడని చోటికి ఎందుకు వచ్చావు?' అని లోకసారంగముని ప్రశ్నించాడు. 'ఏనాటికైనా తమకు దయ కలిగి నాకు ఆలయ ప్రవేశాన్ని కలిగిస్తారనే ఆశతో ఇక్కడున్నాన'ని శ్రీపాణి బదులు పలికేడు. 'అంతవరకు ఆగక ఎందుకు తొందరపడి పద్మాసనం వేసుకొని నీ స్పర్శతో దేవాలయ ప్రాంగణాన్ని మైల పరుస్తున్నావు?' అని ముని అడిగాడు. శ్రీపాణి 'ఒక్కసారి నన్ను శ్రీరంగని పాదపద్మాలను దర్శించనివ్వండి' అని దీనంగా విన్నవించుకున్నాడు. ముని 'అది కుదరదు' అన్నాడు. 'నా రంగడే నన్ను రమ్మన్నప్పుడు నన్నాపే వారెవ్వరు? నేను మిమ్మల్ని ఎదిరించలేను. నా తండ్రిని చూడకుండ ఉండలేను. ఏంచెయ్యను?' అని పరితపిస్తూ దేవాలయ ప్రదక్షిణానికి బయలుదేరి వెళ్ళిపోయాడు. 'ధర్మం అడుగంటింది. దేవాలయం అపవిత్ర మయిపోయింది.' అని సణుగుకుంటూ లోకసారంగ ముని దేవాలయంలో ప్రవేశించాడు. అక్కడ చేరిన భక్తులు కొందరు శ్రీపాణి భక్తి తత్పరతను ప్రశంసించేరు. శ్రీపాణి ఇహలోక చింత లేక పరమాత్ముని ధ్యానం కొనసాగిస్తూనే ఉన్నాడు.

కావేరీ నది భగవంతుని అభిషేకించుకోవాలనో, శ్రీరంగనాధుని పదకమలాలను స్పృశించాలనో, మరి సూర్యోదయాత్పూర్వమే తనను చేరిన శ్రీపాణికి స్వామి దర్శనభాగ్యం లభించలేదనో ఆరాటపడుతూన్నట్టుంది. నదికి ఎంత ఆరాటమున్నా తీరం దాటి రాలేదు కదా! మరి ఆ తీరం దాటిందా? ఇంకేముంది. ప్రళయం తప్పదు. లోకసారంగముని కావేరి గట్ల

పవిత్రతను కాపాడే చేదోయిగ భావిస్తారు. ఆ నదీమతల్లి ఎందరో మునీశ్వరులను తన పుణ్య జలాలలో స్నానమాడించి పునీతులను చేసింది. ఆ తల్లి శ్రీపాణిని ఎన్నడూ తిరస్కరించ లేదు. అతడు జీవన్ముక్తుడు. పూర్వజన్మ తపః ఫలాన కాని అది అందరకు సాధ్యపడేది కాదు.

అనవరతం తన దివ్య గానంలోను, తన దివ్య వైభవ కీర్తనంలోను ఆసక్త చిత్తుడైన శ్రీపాణిమీద శ్రీరంగనాధుడు ప్రసన్నుడయ్యాడు. శ్రీదేవి కూడా 'మనకు పరమాంతరంగ భక్తుడైన ఈ మహానుభావుడు మన మందిర బాహ్యప్రదేశంలోనే ఉండిపోవడం అన్యాయం. మన సన్నిధానానికి రప్పించండి' అని రంగనాధుణ్ణి ప్రార్థించింది. ఆ దేవదేవుడు కూడా శ్రీపాణిని తన సన్నిధానానికి రమ్మని అనుగ్రహించాడు. కాని సాత్విక శ్రేష్ఠుడైన శ్రీపాణి భగవద్భక్తుల అనుమతి లేనిదే ఆలయ ప్రవేశం చేయలేనన్నాడు. తన రూపాన్ని, వర్ణాన్ని వేలెత్తి చూపిన లోకసారంగముని పిలువనిదే దేవాలయ ప్రవేశం తనకు అంగీకారం కాదన్నాడు.

మనుజులంతా ఆత్మికంగా ఒకటే. భేదాలు శారీరకాలు మాత్రమే. భగవదనుగ్రహం ఉంటే ఏటి నీరే అభిషేక జలం, అదిలేని నాడు అమృత బిందువే విష సింధువు. శ్రీపాణి తపోనిష్ఠచేత పవిత్రీకరింపబడిన రేవులోని నీరు అని లోకసారంగముని క్రమంగా గ్రహిస్తున్నాడు. శ్రీపాణి అస్పృశ్యుడట, కాబట్టి అతడు స్పృశించిన ఆ రేవు అస్పృశ్యం. మరి ఆ నీటిని కలశంలో చేర్చిన లోకసారంగమునీ అస్పృశ్యుడే. పంచముడు స్పృశించిన రేవులోని నీటితో అభిషేకించబడిన ఆ రంగనాధుడు కూడా అస్పృశ్యుడేకదా! కాని దీనికి లోకసారంగముని అంగీకరించడు. అంగీకరిస్తే ఇంకేముంది? తనకు శిక్ష దేవాలయ బహిష్కారం. రంగనాధుణ్ణి సేవించకుండ తాను ఉండలేడు. అసలు ఇటువంటి ఆలోచనే లోకసారంగమునికి దుస్సహం. దేవుని సన్నిధికి దూరమవుతాననే ఆలోచనే తనకింత ఆందోళన కలిగిస్తే, ఆ రంగనాధునికి కొన్నివేల ఏండ్లు దూరమైన జాతి పడే వేదన లోకసారంగమునికి అర్థం కాకపోవడమేమిటో? రంగనాధునికి శ్రీపాణిపై కరుణ తనపై ఏల లేదని లోకసారంగమునికి మనస్సులో విచికిత్స బయలుదేరింది.

పూర్వాచార పరాయణుడు, వర్ణాశ్రమ సంకర ద్వేషియైన లోకసారంగమునిలో మార్పు కనబడుతోంది. అతడు పశ్చాత్తప్తుడవుతున్నాడు. నిరంతరం శ్రీరంగనాథ పదసేవా ధ్యాన తత్పరుడునైన తన్ను ఆ భగవంతుడు ఎందుకు బాధిస్తున్నాడని మనసులో తర్కించుకుంటున్నాడు. తనను కరుణించమని రంగనాధుణ్ణి పరిపరి విధాల ప్రార్థిస్తున్నాడు. బుద్ధిపూర్వకంగ తాను చేసిన తప్పిద మేమీ లేదనీ, పారవశ్యంతో తాను ఏదేని తప్పు చేస్తే దండించమనీ వేడుకొంటున్నాడు. లోకసారంగమునికి రంగనిమీది ధ్యానంకన్నా శ్రీపాణి చింతయే అధికమయింది. రంగనాధుడు మార్పు చెందేడంటాడు. ఆ మార్పు జరిగింది తనలోనే అని ఆ ముని గుర్తించుకో లేకపోతున్నాడు. భగవంతుణ్ణి 'నీ నవ్వు శ్రీపాణిది. నీ కోపం నిరంతరం నిన్ను సేవించే నాది. ఏమిటి స్వామీ? నీ లీల!' అని తనలో తానే అనుకుంటూ రంగని ప్రశ్నిస్తాడు.

నిర్మల కావేరీ ప్రవాహంలో నిండు వెన్నెల, సుమధుర గాన శీకరం గాలిలో శబ్ద తరంగాలుగ శ్రీపాణి సందేశాన్ని శ్రీరంగనాధునికి అందిస్తోంది. గుడిలో మ్రోగిన గంటలు శ్రీపాణి సందేశానికి రంగని ప్రతి సందేశంలా ఉంది. లోకసారంగముని శయనమందిరంలో ధ్యాన నిమగ్నుడై ఉన్నాడు. ఆ శయన మందిరం నుంచి ప్రవహించే ఒక వెలుగు వెల్లువ అతని నిశ్చేతనునిగ రంగనాధుని పాదపద్మాల దగ్గరికి చేర్చింది. రంగనాధుడు ఎందుకో దుఃఖిస్తున్నట్లు లోకసారంగమునికి తోచింది. అందుకు కారణం ఏమిటో తెలుసుకోలేక 'స్వామీ! నేనుండగా నీకు చింత ఏలనయ్యా?' అని ప్రశ్నించేడు. అంతలో రంగనాధుడు అతనికి కంటిముందు నిలబడ్డాడు. లోకసారంగముని తన అదృష్టానికి అపరిమితానందం పొందాడు.

రంగనాధుడు : శ్రీపాణి నా భక్తుడు.

లో. సా. ముని : అవును. అతడు భాగ్యశాలి.

రంగనాధుడు : శ్రీపాణి ఇంతవరకు గుడి వెలుపలనే ఉండిపోయాడు. నా భక్తుడు ఆలయ ప్రవేశం కోరుతున్నాడు.

లో. సా. ముని : అదెలా సాధ్యం? అతడు అస్పృశ్యుడు కదా!

రంగనాధుడు : నా దర్శనం భక్తులందరకు సమానంగ లభించాలి కదా!

లో. సా. ముని : అందరకు అంటే? అది పంచమునికి ఎలా సాధ్యమవుతుంది?

రంగనాధుడు : నీద్వారా అతనికి ఆలయ ప్రవేశం సాధ్యమవుతుంది.

లో. సా. ముని : నీ భావమేమిటో నాకు ఏమాత్రం అవగతం కాలేదు.

రంగనాధుడు : నేనాతనికి సాక్షాత్కారం కాబోను. కాబట్టి అతడే వచ్చి నన్ను దర్శించుకోవాలి.

లో. సా. ముని : అది అసంభవమైన విషయం. పంచముడి ప్రవేశం వల్ల ఆలయం మైలపడి పోతుంది. అది ఎలా ఒప్పుకోను? ఎవ్వరు అంగీకరిస్తారు?

రంగనాధుడు : నాకు మాలిన్యం అంటుతుందా? నాకు లేని మాలిన్యం దేవాలయానికి ఎలా అంటుతుంది? పంచముడైనంత మాత్రాన శ్రీపాణి చేసిన పాపం ఏమిటి? అతని ధర్మబద్ధమైన కోర్కెను మన్నించడం మన ధర్మం కాదా?

లో. సా. ముని : దేవా! లోకాచారాన్ని ఎదిరించడానికి నేను అశక్తుణ్ణి. శ్రీపాణి ఆలయ ప్రవేశం చేసి అపవిత్ర పాదం మోపి ఆలయాన్ని అపవిత్రం చేయడం భక్తులు సహించరు. దాన్ని శ్రీపాణి కూడా అంగీకరించడు.

రంగనాధుడు : నా భక్తుడు ఎవరయినా నన్ను దర్శింప కోరినప్పుడు తప్పకుండా అతనికి నా దర్శనం లభింపవలసినదే. అతడు పాదం మోపితే అపవిత్ర మవుతుందనుకుంటే అతణ్ణి నీ భుజాల మీద మోసుకుని వచ్చి దర్శనం చేయించు. అప్పుడతడు గుడిలోకి నడచి వచ్చి దాన్ని అపవిత్రం చేయనట్టే అవుతుంది కదా!

లోకసారంగముని ఇక చేసేదేమీ లేక, తన ఇష్ట దైవం ఆజ్ఞను తిరస్కరించలేక ఏలాగో అంగీకరించాడు. వెంటనే రంగనాధుడు అదృశ్యుడయ్యాడు. లోకసారంగమునికి జరిగినదంతా ఒక విచిత్ర స్వప్నంలా ఉంది. తాను కావేరీ జల పరిపూతుడు కాక ఆలయ ప్రవేశం ఎన్నడూ చేసింది లేదు. 'నేడు ఇదేమిటి? ఆశ్చర్యం.రంగనాధుడు నన్ను ఇలా పరీక్షిస్తున్నాడు. ఏం చెయ్యను? నేను ఆ స్వామి పాద దాసుణ్ణి. ఆ రంగనాధుని అభీష్టం మేరకు నేను ఏ పనినైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. తరువాత సంగతి అందామా? ఫలితం పరమాత్మ అధీనం. నేను నిమిత్త మాత్రుణ్ణి. భగవానుడు నావల్ల ఈ పని చేయించుకోవాలనుకుంటున్నాడు, అంతే. ఇది నా పూర్వ పుణ్య పరిపాకం తప్ప ఇతరమేమీ కాదు.' అని మిక్కిలి సంతోషంతో కావేరీ నదికి వెళ్ళి సుస్నాతుడై కాలోచిత హరి పూజనములు పూర్తి కావించుకుని 'భగవద్భక్తుడు ఎచ్చట ఉన్నా సందర్శించ వలసిందే.' అనేటటువంటి న్యాయాన్ని మనసులో తలంచుకొని సూర్యోదయం వరకు ఆలసించక శ్రీపాణిని వెదుక్కుంటూ అతని నివాసం చేరుకున్నాడు. సాష్టాంగ దండ ప్రణామం చేసి 'మహానుభావా! శ్రీమహావిష్ణువు నిన్ను ఆశీర్వదించాడు. దయచేయ'మన్నాడు. 'స్వామీ! ధన్యుడను. ఈ సుదినం కోసమే నేను ఎదురు చూస్తున్నాను.' 'ఇకనేం. లే, మరి, ఆలయ ప్రవేశం కావించు' అని లోకసారంగముని శ్రీపాణి భుజాన్నిపట్టి లేప ప్రయత్నించగా 'అయ్యయ్యో! ఎంత అపచారం. నన్ను తాకి మీరు మలిన దేహులు అయ్యారుకదా!' అని చింతించాడు శ్రీపాణి. 'మలినభావం కల మనస్సే మలిన మనస్సు. మలిన మనస్సు కలిగిన దేహులే మలిన దేహులు. నీవు పరమ పావనమూర్తివి. నా కన్నుల కప్పిన అంధకారం రంగనాధుడ తొలగించాడు. రంగని సన్నిధికి నిన్ను తీసుకొని రమ్మని ఈ దాసునికి ఆదేశించాడు. కాబట్టి సందేహించక ఆలయ ప్రవేశం చేయడానికి అనుగ్రహించు.' అని లోకసారంగముని వినయంగా ప్రార్థించాడు. అంతట శ్రీపాణి 'మహాత్మా! దేవాలయ ప్రవేశానికి అర్హత కలిగిన నాలుగు జాతులలోను నేను పుట్టినవాణ్ణి కాను. అతి నీచుణ్ణి, జ్ఞాన హీనుణ్ణి. అలాంటి నేను పరమ పవిత్రము, నిర్మల భాగవత స్థానము, ప్రత్యక్ష పరమపదము అయిన శ్రీరంగనాధుని నిలయం ఈ పాదాలతో ఎలా త్రొక్కను?' అని వెనుకకు అడుగులు వేస్తూ భయపడుతున్న శ్రీపాణిని చూచి లోకసారంగముని 'స్వామీ! నీవు ఏమాత్రం సందేహించవద్దు. నా భుజాలపై నిన్ను ఎక్కించుకుని ఆలయానికి తీసుకుని వెళతాను. నేనే నీకు రంగనాధుని దర్శనం చేయిస్తాను. ఇక మారు మాటాడక, బయలు దేరు. నా ప్రార్థన మన్నించు.' అని బలవంతంగా శ్రీపాణి యోగీంద్రుణ్ణి తన భుజాలపై ఎక్కించుకుని రంగనాధ ఆలయం ప్రవేశించాడు. అది న్యాయం కాదనీ, పవిత్రుల్ని తాను అపవిత్రుల్ని చేయలేనని శ్రీపాణి మొర పెట్టుకుంటున్నా లోకసారంగముని అది భగవానుని ఆదేశంగ అమలు పరిచాడు. మహాభక్తుణ్ణి సేవిస్తున్నాననే ముని భావించాడు.

నిత్య దరిద్రుడికి పెన్నిధి లభించిన విధంగ శ్రీరంగనాధుడు నిజ దివ్య మంగళ విగ్రహాన్ని శ్రీపాణి యోగీంద్రుడికి కన్పింప చేశాడు. ఆ స్వామి 'నవరత్న ఖచిత తప్త చామీరకర కిరీట కేయూర కుండలుడు, ప్రలంబమాన మౌక్తిక హారుడు, శ్రీవత్స లక్ష్మీ కౌస్తుభాలంకృత విశాల వక్షుడు, కల్ప శాఖలను పోలిన నిజ భుజాకల్ప శంఖ, చక్ర, గద, అసి, శారంజాది అనేక దివ్య ఆయుధయుతుడు. బాల భాస్కర ప్రభల వెలుగొందు పీతాంబర ధారుడు. శింజాన మంజు మంజీరాది అపరిమిత దివ్య భూషణధారుడు.' అలాటి శ్రీరంగనాధుణ్ణి శ్రీమదనంత గరుడ విశ్వక్సేనాది మహాభక్తులు సేవిస్తున్నారు. ఆ పరమ పురుషుణ్ణి చూచి, హర్షించి, పులకించి తల్లి పాలకై ఆరాటపడే పసిబిడ్డ ఇతరమేమీ కోరక తల్లి స్తన్యం మాత్రమే కోరే విధంగ శ్రీపాణి శ్రీహరి దివ్య మంగళ విగ్రహాన్ని తనివితీర అనుభవించేడు. తాను అనుభవించిన అనుభవాన్ని 'అమలనాది పిరాన్' అనే ఒక దివ్య ప్రబంధంగ గానం చేసేడు. శ్రీరంగనాధుడు ఆ పరమ భాగవతోత్తముణ్ణి దివ్య దేహంతో తనలో ఐక్యం చేసుకోవాలనుకున్నాడు. దానితో క్రమంగ శ్రీపాణి తల, వక్షం చివరకు మొత్తం దేహం కనబడకుండా పోయింది. మాట మాత్రం వినబడుతోంది. తన భక్తుడైన శ్రీపాణిని భగవానుడు తనలో ఐక్యం చేసుకున్నాడని లోకసారంగముని గ్రహించాడు. మానవుడే మాధవుడని గుర్తించాడు.

తరతరాలుగ దైవ దర్శనానికి నోచుకోని జాతి పడే ఆవేదనకు శ్రీపాణి మారు రూప మనుకున్నాడు. శ్రీపాణికి తన తనువున చోటిచ్చిన భగవానుణ్ణి, భగవదైక్యం చెందిన శ్రీపాణిని లోకసారంగముని మనసారా కొనియాడేడు. సర్వజీవుల్ని సమంగ చూచేవాడే దివ్యుడు. అతడే పుణ్యుడు. నిజానికి అతడే ఆత్మవేత్త. అతే భగవదీప్సితం. ఆ శ్రీపాణియే తిరుప్పాణాళ్వారుగ శ్రీవైష్ణవుల పన్నిద్దరాళ్వారులలో ఒకడుగ నేటికీ ఆరాధింపబడుతూండడం మన సమ సమానత్వ భావానికి, మన దేశ సామాజిక దృక్పథానికి తార్కాణం. అది తెలుసుకుని నడచుకోవడం సామాజికుని కర్తవ్యం.

నందనారు

భక్తి మార్గంలో ఈశ్వరుణ్ణి సేవించి కృతార్థులైన ధన్యుల్లో 'నందనారు' ఒకడు. అతడు కావేరీ నదికి దక్షిణ తీరంలో ఉన్న 'ఆదనూరు' గ్రామ నివాసి. నందనారు పూర్వజన్మలో చిదంబర నటరాజ స్వామిని దర్శింప బోతున్న యతి శ్రేష్ఠుడు. దారిలో అతనికి అకాల మృత్యువు ప్రాప్తించింది. తాను మళ్ళీ ఆ స్థలంలోనే పుట్టాలనీ, అక్కడినుంచే బయలుదేరి నటరాజస్వామిని దర్శించాలనీ కడసారిగా కోరుకున్నాడు. ఆయన మరణించిన స్థలం ఆదనూరు మాలవాడ. మరుజన్మలో ఆతని చివరి కోరికగా ఆ మాలవాడలోనే జన్మించాడు. పూర్వ జన్మ సంస్కారంచేత నందనారు బాల్యం నుంచీ భక్తి వైరాగ్యాల యందు ఆసక్తి కలవాడయ్యాడు.

నందనారు తపోదీక్షను, సమాధి స్థితిని ఆ వాడలోని జనాలు అర్థం చేసుకోలేక పోయారు. బాల్యంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్న నందుడు మేనమామ 'కుప్ప' సంరక్షణలో పెరిగి పెద్దవాడయ్యాడు. అందరిలాగానే పశువులను మేపడానికి వెళ్ళిన నందుడు అక్కడే కదలకుండా కూర్చుండిపోయేవాడు. పశువులు ఇంటికి వచ్చేసేవి. నందుడు ఇంటికి రాకపోవడంతో కుప్పడు పోయి బలవంతంగ ఇంటికి తీసుకుని వచ్చేవాడు. అలాగే మరోరోజు పొలం పనికని వెళ్ళిన నందుడు ఉన్నట్టుండి సమాధిలోకి వెళ్ళిపోయేడు. అది తెలియని పల్లె జనం అది మూర్ఛ రోగం అనుకున్నారు. వివాహమైతే పిచ్చి కుదురుతుందని ఆలోచించారు. కుప్పడు తన ఏకైక కుమార్తె కుప్పమ్మను ఇచ్చి నందుడికి వివాహం చేశాడు. అది పిచ్చి అయితే కదా! తగ్గడానికి. కుప్పమ్మ మాత్రం భర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. కుప్పడికి పిల్ల గొంతు కోసేనేమో అని తీరని మనస్తాపంగా ఉండేది. జగన్నాథుని అనుగ్రహం తన కుటుంబంపై పడిందని కానీ, తమ నందుడు మహాభక్త శిరోమణి అని కానీ కుప్పడు గుర్తించలేక పోయాడు. జనాలెంతటి బేలలో! ఒడిలో ఉన్న రత్నాన్ని గ్రహింప లేకపోతూంటారు. గనులలో రాళ్ళకోసం వెదుక్కుంటూంటారు.

ఇంతలో ఆదనూరులో ఒక విచిత్రం జరిగింది. గ్రామపెద్ద నటరాజ భట్టరుగారి కుమారుడు విశ్వనాథుడు బాల్యంలోనే ఇల్లు విడిచిపోయి కాశీ నగరం చేరి విద్యాభ్యాసం చేసి మహాజ్ఞానియై తిరిగి వచ్చాడు. మహా పండితుడైన విశ్వనాథుడు నందుడికి పిచ్చి కాదనీ, అతడు గొప్ప జ్ఞాని అనీ గ్రహించుకున్నాడు. ఆనాటినుంచీ నందుడు, విశ్వనాథుడు ఆప్తమిత్రులు

అయ్యారు. అర్థం కానివారికి అది రాయి, అర్థమయినవారికి అదే దైవం. నందుడు విశ్వనాథుడు గ్రామంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తొలుతగా జంతు బలులను అరికట్టారు. వర్ణ ధర్మాలు కృత్రిమములనీ, మానవులంతా ఒక్కటేననీ ఎలుగెత్తారు.

ఈ తిరుగుబాటు మాలగూడెంలో గగ్గోలు రేపింది. నందుడు కులం కట్టుతప్పి చెడిపోతున్నాడని గోలచేశారు. 'జంతువులూ మనవంటి జీవాలే. వానిని బలి ఇస్తే ఏ దేవునికి దయ కలుగుతుంది. ఇవి కూడా దేవుని బిడ్డలే కదా! స్వామీ! పరమ దయాళూ! ఈ వజ్ర హృదయాలను మెత్తపరచలేవా? ప్రభూ! నీ కరుణామృత సృష్టితో వీరి కర్కశ హృదయ క్షేత్రాలలో భక్తిబీజాలు మొలక లెత్తించలేవా? స్వామీ! నీ సంకల్పము ఉంటే ఇంక అడ్డేముంది? నీ బిడ్డల ఆర్తి నీవుగాక ఇంకెవరు తీరుస్తారు? ఈ అజ్ఞానం తొలగించడానికి నీవుకాక ఇంకెవరు సమర్థులయ్యా?' అని పలవిస్తూ నందుడు వారిని పట్టించుకోకుండా తన దీక్షలో తానుండి పోయాడు.

ఏంచేయాలో తోచని పెద్దలు ఈ విషయం నటరాజభట్టరుకు తెలియచేద్దాం అనుకున్నారు. 'నందుని పిచ్చి మరీ ముదిరిందనీ, ఈ మధ్య చిన్నయ్య కారణంగ మొన్న జాతరలో మరిడమ్మ దాసరయ్యకు పూని, చిన్నయ్య మాలవాడకు రావడం వలన పెద్దమ్మోరు గొట్టాలమ్మ తల్లి పల్లెలోకి వచ్చిందని చెప్పాడ'ని తెలియ చేశారు. నటరాజ భట్టరు తన కుమారుణ్ణి మాలవాడకు రాకుండా చేస్తానని మాట ఇచ్చాడు. కుప్పణ్ణద్వారా చిన్నయ్య విశ్వనాథుడు మాలవాడకు వెళ్ళి అర్థరాత్రినుంచి తెల్లవారు వరకు భజనలు చేస్తూంటాడని ఆ తరువాత కోనేటిలో స్నానంచేసి కోవెలకు వెళుతూంటాడని తెలుసుకున్నాడు. 'ఇదేమి దౌర్భాగ్యం. ఈ నిర్భాగ్యుడికి ఈ దుర్బుద్ధి ఎలా కలిగింది? మాలవాడు వీడికి గురువా? మహా పండితుడు. వీణ్ణి వాదంలో గెలవడం నావల్ల కాదు. పోనీ, కోప్పడదామా అంటే మళ్ళీ ఇల్లు విడిచి పారిపోతాడేమో? స్వామీ! శివకామేశ్వరా! నీకు పుత్రసంతానం లేదా స్వామీ? ఈ పరీక్షలు నాకే కల్పించేవు ఎందుకయ్యా? ఈ అగ్రహారంలో తలెత్తుకుని నేను ఎలా తిరగ్గలను?' అని విచారిస్తాడు. నందుణ్ణి కబురంపి విచారిద్దామని కబురు చేశాడు. నందుడు వచ్చి 'అయ్యా! మా వాళ్ళు పరమ మూర్ఖులు. దేవుని పేరుమీద ఎన్నో కలుష కార్యాలు చేసేస్తున్నారు. మొన్న జాతర పేరుతో జంతువధ, మాంస భక్షణ, మద్య పానం యధేచ్ఛగ జరిపించారు. ఈ అకార్యాలు వద్దంటే నన్ను పిచ్చివాడంటున్నారు. ఇట్టివారిపై స్వామికి కృప ఎన్నడు కలుగుతుందో?' అని సమాధి స్థితికి చేరిపోయాడు.

'స్వామీ! చిదంబరేశ్వరా! నీ క్షేత్రం ఒక్కసారి దర్శిస్తే చాలదా? నీ దేవాలయ స్వర్ణ గోపురం చూసి ఆనందించే భాగ్యం ఎవరికో మహానుభావులకు కాని లభిస్తుందా? ఆహా! ఆహా! అడుగో నా నటరాజమూర్తి. అయ్యో! అయ్యో! అంతలో మాయమయి పోయాడు' అని మూర్ఛపోయాడు. విశ్వనాథుడు పరుగున పోయి నందుని ముఖం మీద నీళ్ళు చల్లి అతణ్ణి సేద

తీర్చాడు. అక్కడి బ్రాహ్మణులంతా 'విశ్వనాధుడు ఇంత ఉన్మత్తుడయి పోయాడేమిటి? పోయి మాలవాణ్ణి తాకేడేమిటి? మూర్ఛ పోయినంత మాత్రాన ప్రాణం పోతుందా? మాలవాడు తేరుకోడా? ఎంత పండితుడైనా ఇలాంటి అసంప్రదాయపు నడతలు తగినవేనా?' అని ముక్కుపై వేలు వేసుకున్నారు. 'ఎఱ్ఱని ఎండలో తోటి మానవుడు మూర్ఛపోతే ముఖంమీద నీళ్ళు చల్లడం తప్పా?' అని విశ్వనాధుడు మానవతా దృక్పథంతో వాపోయాడు. కాని నందుణ్ణి ఇకపై కలవనే కూడదని నటరాజభట్టరు తన కుమారునికి కట్టడి చేశాడు.

విశ్వనాధుడు రాకపోవడంతో నందుడు చాలా దుఃఖించాడు. 'ఈశా! జగదీశా! నిరంతర సంతోషదాయకమైన నీ సంకీర్తనానికి నోచుకోక పోయామా? నాకు సహచరుడొకణ్ణి ప్రసాదించి మళ్ళీ మరుక్షణంలోనే యథాపూర్వకంగ ఒంటరిని చేస్తావా? స్వామీ! ఈ పాప పంకిల సంసార నాటకంలో మరో అంకం ప్రారంభించ దలిచావా?' అని పలవిస్తూ 'సతీదేవి నీకోసం అగ్గి పాలయితే ఆమెకోసం నీవు పరితపించావు. సర్వ స్వతంత్రుడవైన నీకే ఈ భవబంధాలేమిటి? నీ అనుగ్రహామృతంతో ఈ చిన్ని హృదయం నిండినా నా బంధ స్మృతులు ఇంకా మాసి పోకున్నవేమి స్వామీ? ఏలనో నీ చరిత చాలా గూఢంగా ఉంది. ఏమీ తెలియని వాడనని కోపించకు. మహామహులే నీ లీలలు తెలిసికోలేక పోయారుకదా! అయ్యో! మరిచిపోయాను. ఈ రోజు నేను పొలం కావలి కాయాలని మామ చెప్పేడు. నేను త్వరగా అక్కడికి వెళ్ళాలి.' అంటూ బయలుదేరాడు.

నందుడు పొలం చేరాడు. మంచె ఎక్కి పక్షులను కొట్టడానికి ఒడిసెల, రాళ్ళు చేతబట్టాడు. 'ఓహెూ! ఈ పక్షులు పొలం అంచుల్లో గుమికూడి ఉన్నాయి. పైరుమీద వ్రాలవేమిటి? ఓ విహంగములారా! రండి. మీ ఆకలి తీర్చుకోండి. మీ ఇచ్ఛ వచ్చినట్లు స్వేచ్ఛగా తినండి... అయ్యో! ఏల రాకున్నవి? చేతిలో ఒడిసెల ఉండటం చేతనా?' అని ఒడిసెల దూరంగా పారవేస్తాడు. అపుడు పక్షులన్నీ భయంలేక పైరుమీద వ్రాలాయి. 'ఓహెూ! వేషానికి ఎంత మాహాత్మ్యముంది. నా ఒంటి విభూతిని చూచి నన్ను జగజ్జనకునికి తనయునిగ గుర్తించాయేమో? ప్రభూ! సుందరేశ్వరా! భూతిలిప్త సర్వాంగా! భూతియందు ఎంతటి విభూతిని ఉంచావయ్యా? నీయందు ఎంతటి విభూతి ఉందో? అజినధారివైనా అనంత ఐశ్వర్యం ఇస్తావు. ఈశ్వరుడివైనా భిక్ష మెత్తుకుంటావు. ఓ పక్షులారా! తనివితీర తినండి. నేనే ఈ ప్రపంచాకాశ పథంలో విహంగంలా విహరిస్తున్నాను. కాని మీలా నాకు స్వేచ్ఛా యోగం లేదు. స్వామీ! త్రిలోకైక మోహనా! నీ కృపామృత వర్షంతో నీ పాదపద్మాలపై భక్తి బీజాలు నాటావు. ఫలకాలము తెలియచెయ్యి ప్రభూ? అమ్మా! భవానీ! నీవైనా నీ నాధునికి ఈ దీనుని చేరదీయమని చెప్పరాదా తల్లీ?' అని మైమరచిపోయాడు.

ఇంతలో నటరాజభట్టరు అక్కడికి వచ్చాడు. పైరు పక్షులు మేస్తూండడం, నందుడు మైమరచి ఉండడం చూశాడు. 'నందా! నందా!' అని గట్టిగా పిలిచాడు. నందుడు అచేతనంగానే

మంచె దిగివచ్చి 'స్వామీ! ఈ విరహం భరించలేకున్నాను. చిదంబరం పోయి ఆ నటరాజస్వామిని దర్శించకుంటే నేను జీవించడం కల్ల. పల్లె జనులందరికీ చిదంబరం యాత్ర రేపు రేపని చెబుతూ ఇన్నాళ్ళూ గడిపేను. ఇక ఓర్వలేను. నటరాజస్వామిని దర్శించుకునే భాగ్యం ప్రసాదించండి.' అని పాదాలపై పడ్డాడు. నటరాజభట్టరుకు నందుని ప్రార్థన పట్టలేదు. 'పక్షులు పైరు తినేస్తూంటే ఏం చేస్తున్నావురా?' అని గద్దించాడు. 'ఏం చెయ్యను? నా చేతిలో ఒడిసెల ఉంటే పక్షులు బెదిరి చెదిరిపోతున్నాయి. ప్రాణికోటికంతకూ ఆహారం అవసరమే కదా! అందుకని ఒడిసెల పారవేశాను. పక్షులు హాయిగ పైరు మేస్తున్నాయి. నటరాజు ఎంతో సంతోషంగా ఉన్నాడు.' అని పలుకుతూంటే 'ఓరి దుర్మార్గుడా! నీ తాత ముల్లె అనుకున్నావురా? మాలవాడివి నీకు నటరాజ దర్శనమా? పాపాత్ముడా!' అని నందుణ్ణి కొడతాడు. 'ఇదేమిటి? వీడి స్పర్శమాత్రం చేతనే నా సర్వాంగాలు ఇలా మోహ వివశాలవుతున్నాయి. ఏదో అద్భుత శక్తి నా దేహమంతా ప్రవహిస్తోంది. వీని యందేదో మహత్తు దాగి ఉంది. ఓరీ! నీ మంత్రాలు, తంత్రాలు నా దగ్గరనంటరా?' అని మళ్ళీ కొడతాడు.

నందుడు ఈ లోకంలోనే లేడు. 'నటరాజస్వామీ! ఏమి నా భాగ్యం. పార్వతీదేవి ఎంతో అర్థిస్తేగాని లభించని నీ కౌగిలి ఈ దీనుడికి అడక్కుండానే ప్రసాదించావా! ఏమి నా భాగ్యం. సకల లోకైకనాథుని కౌగిట అణగియున్నాను. తండ్రీ! నాపై నీకెందుకింత కరుణ! నా కెందుకింత అనుగ్రహం!' అని అంటూ నటరాజభట్టరు పాదాలపైన పడి మూర్ఛపోతాడు. నటరాజభట్టరు కోపం మితిమీరి పోయింది. నందుణ్ణి ఒక తన్ను తన్ని 'ఎంత పొగరురా నీకు! నాపై నీకు అనుగ్రహమా! మాలవానికి నీకే ఇంత పొగరైతే, మహాపండితుడినైన నాకెంత ఉండాలిరా? చావు! చావు! నువ్వు ఛస్తే మా నిర్భాగ్యుడైనా బాగుపడతాడేమో! ఆ దరిద్రుడికిట వీడు గురువట!' అని నిందిస్తూ మళ్ళీ తంతాడు. ఇంతలో ఈ విషయం తెలిసి పేటలోని జనమంతా పరుగు పరుగున అక్కడికి చేరుకుంటారు. నటరాజభట్టరు వీరావేశం ఇంకా తగ్గలేదు. 'దొంగ గాడిదల్లారా! ఎక్కడికి పోయార్రా? పైరు పశువులు, పక్షులు మేసేస్తూంటే ఈ మందుడైన నందుణ్ణి కాపుపెట్టి పోతారా? ఈ దిక్కుమాలిన పిచ్చివాని మూలంగ నేను మైలపడ్డాను.' అని సంఘటితంగ ఉన్న మాలలను చూచి కొద్దిగ వణుకు పుట్టగ, దాన్ని కప్పిపుచ్చుకొని నటరాజభట్టరు అక్కడినుంచి నిష్క్రమించాడు.

నందుడు చెప్పేది అర్థంకాకపోయినా, నందుడంటే పేటలో అందరికీ అభిమానమే. నందుణ్ణి చావ చితక్కొట్టడం అందరికీ చాలా బాధ కలిగించింది. 'ఈ సంపన్నులకి చచ్చి చాకిరీ చేయడం, కడుపు కాల్చుకొని వాననక, ఎండనక అడ్డమైన పనీ చేస్తే మనల్ని వాళ్ళు చావబాదడం. పోనీ మనల్నైతే అనుకోవచ్చు. నోరు మెదపని నందుణ్ణి ఈవేళ చంపక వదిలేవాడు కాడు. ఇన్ని తన్నులు తిని వీళ్ళకి చాకిరీ చెయ్యమని ఎవరు చెప్పారు? నందుడు చెబితేగాని ఈ పైరు కొయ్యద్దు.

మన అయ్యోరు దిగిరాక ఏం చేస్తాడో చూద్దాం.' అని ఒక నిశ్చయానికి వచ్చి సంఘటిత శక్తిగ మారుతూంటే నందుడికి తెలివి వచ్చింది. 'నా నటరాజమూర్తి ఏడీ? స్వామి వెళ్ళిపోయాడా?' అని దుఃఖిస్తూంటే పేటలోని వాళ్ళంతా 'చాలదటరా! నిన్ను దంచి వదిలేడు. ఇంకా స్వామి, స్వామి అంటావేమిటిరా? నిన్ను తన్నిన దానికి ఆయన పైరు కొయ్యకూడదని నిశ్చయించుకున్నాం.' అని వాళ్ళు అనగానే 'ఏమిటి? పెద్దయ్యగారు నన్ను తన్నారా? నాకు తెలియనే తెలియదు. ఎవరో వచ్చి నన్ను కౌగలించుకున్నారు. నేను అసలు వేరుగానే లేను.' అన్నాడు నందుడు. 'మంచివాడవురా! ఆయన నిన్ను కాలితో తన్నడం మేము మా కళ్ళతో చూశాం. ఇలాంటి పిచ్చివాడవు కనుకనే ఆయన అలా చితక్కొట్టాడు.' అనగానే నందుడు 'తొందర పడకండి. నన్ను నా నటరాజమూర్తే కాపాడాడు. అయ్యగారు నిష్కారణంగ తన్నారంటారా? రెండేళ్ల క్రితం కరువులో, నాలుగేళ్ళ క్రితం గాలివానలో ఆయన మనకందరికి అన్నంపెట్టి రక్షించిన దయాళువు కాదూ! కారణం లేకుండా ఊరికినే నన్ను తన్నాడా? అదీగాక శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. ఇంకా మీకు తెలియవలసినది ఎంతైనా ఉంది. రండి. శాంతించండి.' అని వాళ్ళను తీసికొని పేటలోకి బయలుదేర తీసాడు. సగం అర్థమయి, సగం అర్థంకాక పేటలోని వాళ్ళంతా నందుడి వెనకే పేట దారి పట్టారు.

నటరాజభట్టరు నందుణ్ణి కొట్టినందుకు చాలా పశ్చాత్తాప పడ్డాడు. కాని తన కొడుకు విషయం జ్ఞప్తికి వస్తే మాత్రం అతని కోపం మేర మీరుతోంది. తన కుమారుడు నందుడివల్లే చెడిపోతున్నాడని ఆయన నమ్మకం. నందుడికి మెల్లిగ చెప్పాలని ఒక రోజున నందుణ్ణి పిలిపించేడు. 'నందా! మీ నాయన ఎంత ఉత్తముడు. నా దగ్గర బ్రతికున్నంతకాలం పాలేరుతనం చేశాడు. ఒక్కనాడైనా పల్లెత్తు మాట వాణ్ణి అన్నానా? పొలాల్లో రేయింబవళ్ళు కష్టించి పనిచేసేది పైరు పక్షులకి, పశువులకి పెట్టడానికటరా? నాచేత అనవసరంగ చచ్చీ దెబ్బలు తిన్నావుకదా!' అని ప్రారంభించేడు. 'అంతా స్వామి అనుగ్రహం.' అన్నాడు నందుడు. 'స్వామి! గీమి! ఊ అంటే స్వామి. ఆ అంటే స్వామి. భక్తి ఉండడం మంచిదే కానీ ఇంత విపరీతమా! నటరాజమూర్తి అయినా కష్టపడకుండా కబళం అందిస్తాడురా? నీ భక్తి నీవద్ద ఉండనీ. చెయ్యాల్సిన పని మాత్రం చక్కగా చెయ్యి. అలా చేశావా! నీ కోరిక తీరుస్తాను నేను.' అని నటరాజభట్టరు అన్నాడో లేదో 'స్వామీ! ఒక్కసారి చిదంబరం పోయి నటరాజమూర్తిని దర్శించుకోనివ్వండి. ఈ దీనుణ్ణి అనుగ్రహించండి.' అన్నాడు. అది విన్న నటరాజభట్టరు 'ఏమిటి వీని కోరిక! వీని మొగానికి నటరాజ దర్శనమా! ఆ ఆలయం నీడనైనా వీణ్ణి తొక్కనిస్తారా? ఆ దేవుని ముందున్న నందీశ్వరుని దర్శనమైనా వీడికి అవుతుందా? అయినా ఇవన్నీ నాకెందుకు? నా పని పూర్తిచేస్తాడేమో ఒక పరీక్ష పెడదాం.' అనుకుని 'నందా! నీ కోరిక తప్పక తీరుస్తాను. కానీ కోతల కాలం కదా! రెండు వందల ఎకరాల పంట సిద్ధంగ ఉంది. నీలాగే దైవ దర్శనానికనీ, దయ్యాల దర్శనానికనీ

అందరూ పోతే అయ్యే దెలాగ? పైరుకోసి కుప్పవేసిన తరువాత నీ ఇష్టం వచ్చినట్టు చిదంబరం వెళ్ళు. పో' అన్నాడు. నందుడికి అమృతవర్షం కురిసిందనిపించింది. ఆయన పని అదేమంత కష్టం అనిపించలేదు. నటరాజస్వామీ! నీ శిశువును ఎలా దరి చేరుస్తావో అంతా నీదే భారం.' అని ఉరకలు వేస్తూ పేటకు చేరాడు.

\+ + +

పేటలోని వాళ్ళకి ఇదంతా అయోమయంగ ఉంది. పెద్దయ్య పైరుకోస్తే నందుణ్ణి చిదంబరం వెళ్ళనిస్తా ననడమేమిటి! నందుడు మనల్ని పైరుమీదకు ఎగబడ మనడమేమిటి! వాడిమాట పిచ్చిమాటగ తీసిపారెయ్యక మనం సిద్ధబడట మేమిటి! ఏమయింది? ఒక్క రోజులో రెండువందల ఎకరాల పంట కోసి, కుప్ప వేశామా! ఇది మనం చేసిన పనేనా? లేక నందుడి అతీత శక్తా? ఇలాంటి మహానుభావుడని తెలుసుకోలేక ఇన్నాళ్ళూ పిచ్చివాడని ఎంత పాపం చేశాము. మన నందన్న దేవుడు కానీ మనిషి కాడు. ఏ శాపం వల్లనో మనిషిగా పుట్టాడు. అంతే.' అని అనేక విధాలుగా అనుకుంటున్నారు. ఇంతలో విశ్వనాధుడు అక్కడికి వచ్చాడు. నందుని దివ్య తేజస్సుని చూచి ఆ పొలం గట్టుమీదే సాష్టాంగ పడ్డాడు. 'ఓ నందస్వామీ! ఇన్నాళ్ళూ ఈ నీ దివ్య తేజస్సు ఎక్కడ దాచావయ్యా!' అని స్తుతిస్తూంటే నందుడు విశ్వనాధుని శిరస్సుమీద చేతినుంచి 'నీ భవ బంధాలను భగవానుడు విచ్ఛిన్నం చేస్తాడు.' అని ఆశీర్వదించాడు. విశ్వనాధుడు 'ధన్యోస్మి' అన్నాడు. ఈ విషయం విన్న నటరాజభట్టరు మోహాంధకారం పటాపంచలై పోయింది. పరుగు పరుగున వచ్చి నందుని పాదాలపై పడి శరణు కోరాడు. 'తండ్రీ! నువ్వు సాక్షాత్తూ ఆ పరమ శివుడివే. నిన్ను పాలేరుగ భావించి మహాపాపం చేశాను. నిన్ను కొట్టి నరకం కోరి తెచ్చుకున్నాను. దైవాంశ సంభూతుడవైన నిన్ను సామాన్యునిగ తలచి ఇంతపనీ చేశాను. నా అవివేకమే నాచేత ఇలా ఈ అకార్యం చేయించింది. నన్ను క్షమించు.' అని వేడుకున్నాడు. నందుడు 'సంసార విషయాలలో మునిగిన వారికి సర్వం భ్రమే అవుతుంది.' అన్నాడు. తండ్రీ! నీవు సాక్షాత్తూ ఆ శివుడివే. కాకుంటే కుమారస్వామివి. సందేహం లేదు. కాకుంటే ఈ అమానుష కృత్యం మరొకరి వల్ల అవుతుందా! ఎక్కడైనా చూశామా! విన్నామా! నన్ను నీ శిష్యునిగా స్వీకరించు.' అని ప్రార్థించాడు. నందుడు చిదంబరం యాత్రకు అనుమతి వేడుకొన్నాడు. 'నందా! ఈ చిన్ని విషయానికి నన్ను యాచించాలా? నేను నీ యజమానిని కాదు. నువ్వు నా సేవకుడివీ కాదు. నేనే నీ సేవకుణ్ణి. నీ దాసుణ్ణి. చెప్పు. నీ ఆజ్ఞ పాలిస్తాను. ఏం చెయ్యమంటావో నాకు ఉపదేశించు.' అన్నాడు ఆవేశంగ. నందుడు 'స్వామీ! పంచముణ్ణి. గురుసేవ చేయని వాణ్ణి. శాస్త్ర పరిచయం లేనివాణ్ణి. నేను తమబోటి వారికి ఏం ఉపదేశం ఇవ్వగలను. ఒక్కమాట చెబుతాను. ఈ సమస్త చరాచరం శివలీలా విలాసం. భేదాలెంచడం న్యాయం కాదు. ఉన్నదానితో తృప్తి చెందడం విజ్ఞుల లక్షణం. భక్తి లేనివాణ్ణి భగవంతుడు కూడా రక్షించడు. మనస్సే సమస్త

బంధాలకు మూలం. మాంస భక్షణం చేయక, మద్యపానం మానివేసి, సత్యమే పలుకుతూ, పరాత్పరుణ్ణి నమ్మి సేవిస్తూ ఉండడం సర్వవిధాల శ్రేయస్కరం. భగవంతుని అనుగ్రహం అటువంటివారికి తప్పక లభిస్తుంది. ఇక నాకు సెలవివ్వండి. చిదంబరం పోయి నా నటరాజ స్వామి దర్శనం చేసుకుంటాను. విశ్వనాధుణ్ణి నాతో రానివ్వండి.' అని ముందుకు సాగిపోయాడు.

'స్వామీ! చిదంబరనాథా! ఇన్నాళ్ళకు నీ పాద పద్మాలను దర్శించుకునే అవకాశం ఇచ్చావా? తల్లీ! కావేరీ! ఏ పాప విముక్తి కోరి నువ్వు నీ పవిత్ర జలాలతో స్వామి పాద ప్రక్షాళన చేస్తున్నావమ్మా! నీకు కూడా అఘమేనా? తల్లీ! ఆనాడు కంసుని భయంతో కృష్ణదేవుణ్ణి రక్షించడానికి గోకులానికి బయలుదేరిన వసుదేవుడికి యమున రెండుపాయలై దారి ఇచ్చిందట! నేను భవభీతితో నా నటరాజుని దర్శించుకోడానికి చిదంబరం వెళుతున్నాను. కరుణించి నాకు దారి ఇవ్వవా?' అని ప్రార్థించాడు. కావేరి నది వరద వెల్లువై ప్రవహిస్తోంది. ఇంతలో దూరంగా విశ్వనాధుడికి ఒక నావ కనబడింది. గట్టుకు చేరగానే ఆ పడవవాడిని విశ్వనాధుడు తమను ఆవలి గట్టుకు చేర్చమన్నాడు. కావలసినంత పైకం ఇస్తానన్నాడు. అందుకు ఆ పడవవాడు 'దొరా! ఈ వరదలో పడవ ఎవరు కడతారు? ఎవరికీ ధైర్యం సరిపోదు. ఈయన ఎవరో వెలిగి పోతున్నాడు. మీరిద్దరూ మహానుభావుల్లా ఉన్నారు. సరే! ప్రాణాలు పోతే పోనివ్వండి. మిమ్మల్ని అవతలి గట్టుకు చేరుస్తాను. రండి.' అని పడవవాని రూపంలో పరమాత్ముడు అవతలి గట్టుకు చేర్చాడు వారిద్దరిని.

\+ + +

చిదంబరంలో వాళ్ళకందరికీ ఇదేదో వింతగా ఉంది. 'మనిషి చూస్తే మాలవాడు. మాట చూస్తే మహిమోపేతం. అంతకంటే విచిత్రం బ్రాహ్మణుడైన విశ్వనాధుడు అతని దాసుడు కావడం. అతడైనా సామాన్యుడా! పండితరాజు. ఏమిటో ఈ విపరీతం? మాలవాడు ఊళ్ళో తిరగడ మేమిటి! కోవెల గోపురం వరకు రావడ మేమిటి! ఎన్నడైనా విన్నామా! కన్నామా! ఏదో విపరీతం దాపురించింది. ఆ పంచముణ్ణి చూసినా, ఆతని మాటలు, పాటలు విన్నా ఆయనతో చేరి భజన చేయాలనిపిస్తోంది. అదిగో నందస్వామిని ఆలయంలోనికి ప్రవేశించనీయడం లేదు. చూద్దాం' అని ప్రజలు పలువిధాలుగా అనుకుంటూ ఆలయం దగ్గరికి చేరుకున్నారు.

ఆలయంలో ప్రవేశింపనివ్వని ధర్మకర్తకు విశ్వనాధుడు 'ఆర్యా! ఈయన నందనారు. మహాభక్తుడు. కారణజన్ముడు. మాలయని సందేహించకండి. పరమ భక్తుడుగా చూడండి. భగవానుణ్ణి సేవించాలనుకోవడం దోషం ఏమీ కాదు.' అన్నాడు. దానికి ధర్మకర్త 'మాలవాణ్ణి ఊరిలోకే రానివ్వం. మీరున్నారని అభ్యంతరం చెప్పలేదు. ఇంత చిన్న వయసులో ఎన్నో ధర్మ శాస్త్రాలు చదివి పండితరాజు బిరుదాన్ని పొందిన మీరు ఇలాంటి ధర్మవిరుద్ధ కార్యం తలపెట్టడం న్యాయంగా లేదు.' అన్నాడు. విశ్వనాధుడు 'అయ్యా! శాస్త్రాలు సామాన్యులకు కానీ ఇలాంటి

లోకాతీత వ్యక్తులకు కాదు. వీరికి అలాంటి వాటితో పని లేదు. వారి మహిమలు అనేకములు ప్రత్యక్షములు. కొద్దిమంది ఆప్తులతో సంగూరు కోనేటి పనిని ఒక్క రోజులో పూర్తి చేసేరు. పరమాత్ముని దర్శిపంగోరిన ఈయనకు నందీశ్వరుడు తనకు తానే అడ్డు తొలగాడు. స్పర్శ మాత్రంచేతనే పరమ పాపులకు పరిశుద్ధ మార్గాన్ని చూపగలుగుతున్నాడు. ఇన్నూరు ఎకరాల పైరు నలుగురితో ఒక్క పూటలో కోసేశాడు. ఇవన్నీ మీరు వినలేదా?' అన్నాడు. దానికి ధర్మాధికారి 'మీరు చూచిన వాటికి మాకెలా ప్రమాణం?' 'నామాటమీద మీకు నమ్మకం కలుగదా? ఇంతకు ముందు నన్ను ఎంతగానో పొగిడారు. గురువు విషయంలో అసత్యమాడతానా?' 'ఏమిటీ, ఈ చండాలుడా మీకు గురువు? యుక్తి వాదంలో మీరు గెలిచినా అంతమాత్రాన ఆగమ శిష్టాచారాన్ని, అనుగత సంప్రదాయాన్ని మేము ఉల్లంఘించలేము. దుష్కృత్యానికి ప్రయత్నించకండి.' అన్నాడు ధర్మాధికారి. అంతట నందనారు 'విశ్వనాథా! నన్ను గూర్చి ఇంత శ్రమ ఎందుకు? సంకల్పముంటే నా తండ్రి నటరాజే నన్ను తన అంకపీఠాన చేర్చుకోడా?' అని అంటూండగానే 'హర హర మహాదేవ శంభో! ప్రసీద ప్రసీద. ఆశ్చర్యం, అద్భుతం. రాతి నంది ఊగులాడుతోంది. ఇదేదో విలయం కాలం. నిజంగా ఇతడు మహాభక్తుడేమో! అయ్యా! విశ్వనాధులవారూ! తమరు తలపెట్టిన ఈ అకార్యం వలన స్వామికి ఆగ్రహం కలిగింది. నందీశ్వరుడు ఊగిపోతున్నాడు. ఇకనైనా మీ పాప ప్రయత్నం మానండి. చివరి సారిగ చెబుతున్నాను.ఈ మాలవాణ్ణి దూరంగ తీసుకొని పొండి.' అని మందలించారు. విశ్వనాధుడు 'మాలవాడైతేనేమి? మహాతేజస్సంపన్నుడు. అనుమానం లేదు. బాలచంద్రుని జటాజూటంలో ధరించిన బంధుర తేజమే కాని అది అన్యం కాదు. పాపాలను తొలగించే వీరి పాదాలను భజించండి. ఆదనూరు నుండి ఇక్కడి వరకు రప్పించిన పరమేశ్వరుడు ఇక్కడ ఆయన్ని వదలిపెడతాడా? లోనికి తీసుకొని పోతాడనడానికి ఏమాత్రం సందేహం లేదు.' అని వేదనాపూర్వకంగ పలుకుతున్న విశ్వనాధునికి నందనారు 'విశ్వనాథా! కోపమేలనయ్యా! వీరిని నిర్బంధించడ మెందుకు? ఓర్పు చేతనే వారి మనసులు కరుగుగాక. మేము అర్చ్యులమైన వారు మమ్ము కోవెలలోనికి అనుమతించరా? శివరూపులైన వీరు మనలను అవమానింప చూస్తారా? శివుడే మా పాపములకు అవధి నిరూపింపవలసి ఉన్నది' అని సాత్వికంగ పలికాడు. 'శివస్వరూపులైన తమకు క్షమ తగినదే. సామాన్య మానవులమైన మాకు తమ ఓర్పు ఎలా కలుగుతుంది?' అన్నాడు విశ్వనాధుడు. అపుడు ధర్మాధికారి 'అయ్యా! మీపై మాకు కొంచెమైనా ద్వేషం లేదు. మీ జోలికి మేము రాదలంచ లేదు. మా జోలికి వచ్చి మా ఆచారాలను పాడు చేయకండి. స్వామికి అనుగ్రహముంటే ఆయనే మిమ్మల్ని లోపలికి తీసుకొని వెళతాడు. అంతవరకు ఆగండి' అన్నాడు. 'మంచి ఆలోచనే. తల్లీ! శివకామేశ్వరీ! నా గురువు లోనికి రావడానికి నీవైనా అనుమతించరాదా? నీ అనుగ్రహం కలిగే వరకు నేనిక్కడే నిరశన దీక్ష చేస్తాను.' అని కూర్చున్నాడు విశ్వనాధుడు. దానికి నందనారు

'ఎందుకయ్యా ఈ నిర్బంధం. నిర్బంధించడం వలన ప్రేమ జనిస్తుందా? ఒకవేళ మీ ప్రాణానికి భయపడి మమ్మల్ని ఆలయంలోనికి అనుమతించినా నిజమైన ప్రేమలేక శుభ పర్యవసాన మవుతుందా?' అని మందలించాడు. 'స్వామీ! నన్ను క్షమించండి. నేను నా ప్రతిజ్ఞ చేశాను. మీకు శివదర్శనం కావాలి. లేదా నాకు మరణమే శరణ్యము' అని నిశ్చయంగా పలికాడు విశ్వనాధుడు. 'సరి! స్వామి శివయ్య ఏమి ఉపహారము కోరుతున్నాడో! ఎవరికి తెలుసు? కానీ!' అన్నాడు నందనారు.

మరునాడు ఉదయం ధర్మకర్త పరుగు పరుగున విశ్వనాధుడున్న చోటికి వచ్చాడు. 'స్వామీ! నటరాజు అనుజ్ఞ అయింది. నందనారు నావాడు. ఆలయంలోనికి రానివ్వండి' అని స్వామి కలలో కనబడి చెప్పాడు. కాని ఈ విషయాన్ని సామాన్య జనం అంగీకరించరు. కాబట్టి మీ గురువుని అగ్ని ప్రవేశం చేసి ఆలయ ప్రవేశం చెయ్యమనండి.' అన్నాడు. అది విన్న నందనారు 'స్వామీ! నీ దివ్య సుందర రూపం చూడడానికి అగ్ని స్నానం చేయాలా? జనులెంత వెర్రివారు! నీ సంకల్పం తప్పక నెరవేరుస్తాను. నీ నేత్రాగ్నిచే మన్మధుణ్ణి దహించి మళ్ళీ నువ్వే అతనికి రూపం ప్రసాదించావు. ఈ రోజుతో నాకు ముక్తి తప్పదనిపిస్తోంది. ఈ రోజే నీ ప్రత్యక్ష స్వరూప దర్శనం.' అని అగ్నిగుండం సమీపించి 'స్వామీ! సుందరేశా! నీ కుమారుడు ఓడిపోతే ఆ అపకీర్తి నీదే. నా సమస్త కలుషాలు అడగించు. నీ అంకసీమను చేర్చుకో.' అని అగ్నిగుండం ప్రవేశించాడు. నందనారు దేహం క్షణంలో నల్లగా మారి పోయింది. మరుక్షణంలో హిమస్వచ్ఛ మయిపోయింది. ఇంకొక క్షణంలో పాండుర వర్ణయుక్త మయిపోయింది. అగ్నిగుండంనుంచి దివ్య తేజస్సుతో నందనారు కసుగందకుండా వెలుపలికి వచ్చాడు.

'చండాల కులములో పుట్టినా పూజ్యుడైన నందనారుకు జయము, జయము.

శరవణ భవునిలా శివుని అంకపీఠం చేరిన నందనార్యులకు జయము, జయము'

అంటూ జయ జయ ధ్వనులు మిన్నుముట్టాయి. నందనారు దేవా! నీ చరితము మహాభక్తికి ప్రమాణమై జనులకు శిరోధార్యమై వెలుగొందుతోంది. అల్ప బుద్ధితో అంటరాని తనమారోపిస్తున్న జనాలకు కనువిప్పు నీ చరితము. నీవు అమరుడవు. నీ చరిత అజరామరము. స్వధర్మాన్ని వీడే నీ జాతికి నీ చరితము గుణపాఠము అగుగాక.

కనకదాసు

కనకదాసు పురందరదాసులాగే సాంసారిక జీవనంలో సంపన్నుడు. చివరకు వైరాగ్యం పొంది భగవంతునితో వాదించి మోక్షం పొందిన భక్త శిఖామణి. ఆదిని ఒక కుటుంబంగా ఉన్నవారే పలువృత్తులు చేపట్టేవారు. ఆ వృత్తులనుండే కులాలు ఏర్పడ్డాయి. కాలం మారి వృత్తులు మానివేసినా కులాలు మాత్రం అలాగే ఉండిపోయాయి. వారిలో వారికి భోజనభాజనాలు, కన్యల నిచ్చి పుచ్చుకోడాలు నేరమై ద్వేషభావం పెరగవలసినంతా పెరిగింది. ఈ వీరావేశం కర్ణాటకలో ప్రబలిన వీరశైవం వల్ల, దక్షిణంలో విజృంభించిన వీరవైష్ణవం వల్ల కొంతవరకు అరికట్టబడింది.

ధారవాడ జిల్లాలోని 'బాడ' అనే గ్రామంలో వీరప్ప, బుచ్చమ్మ దంపతులకు కలిగిన ఏకైక కుమారుడు తిమ్మప్ప. వీరు గొఱ్ఱెల కాపరులుగ పుష్కలంగ ధనం సంపాదించారు. ఒకనాడు తిమ్మప్ప తన అధీనంలోని భూమిని తవ్విస్తూండగా దైవికంగ అతనికి అపారమైన ధనరాశిగల ఒక కలశం లభించింది. దానిని అతడు భద్రపరచి ఆ స్థలంలో ఒక దేవాలయం కట్టించి తన జన్మస్థలమైన 'బాడ'లోకూడా పూజాపురస్కారములు లేక పడియున్న 'ఆదికేశవస్వామి' విగ్రహం తెప్పించి అక్కడ ప్రతిష్ఠ చేయించాడు. అపార కనకరాశిని వశమొనర్చుకున్న వాడవడంతో అందరూ అతన్ని 'కనకనాయకుడు' అనేవారు.

ఒకనాటి రాత్రి కనకనాయకునికి స్వప్నంలో ఆదికేశవస్వామి సాక్షాత్కరించి 'కనకా! నాకు దాసుడవు కావయ్యా?' అని అర్థించాడు. అందుకు కనకనాయకుడు 'స్వామీ! నేను నీ కెందుకు దాసుణ్ణి కావాలి? ఇప్పుడు నేను చేస్తున్న ఈ సేవ నీకు సరిపోలేదా? దాసుడనైనంత మాత్రాన ఇంకా అదనంగ ఒరిగేదేముంది?' అని తన అసమ్మతిని తెలియజేశాడు. కొంతకాలం గడిచింది. కనకనాయకునికి కళత్ర వియోగం సంభవించింది. దానితో అతని మనస్సు వికలమైంది. ఎలాగో ఆ సంఘటనను మరచి మనసు కుదుట పరచుకుంటూండగా మాతృ వియోగం సంభవించింది. కష్టాలు ఒంటరిగా రావని కనకనాయకునికి అనుభవానికి వచ్చింది. ఆదికేశవస్వామి మాత్రం తరచు కలలో కనబడి 'కనకా! దాసుడవు కా! దాసుడవు కా!' అని హెచ్చరిస్తూనే ఉన్నాడు.

ఒకసారి కనకనాయకునికి తన వైరులతో కలహమయ్యింది. ఆ పోరాటంలో కనకుడు నిలువెల్ల గాయాలతో ఒకగోతిలో పడిపోయాడు. అతనికి స్పృహలేదు. ఆ పరిస్థితిలో ఎవరో అస్పష్టంగ కనబడి 'కనకా! ఇప్పుడైనా దాసుడవు కా. నిన్నీ దురవస్థనుంచి కాపాడుతాను.' అని అన్నట్లు వినబడింది. కనకుడు మాట్లాడే శక్తిలేనివాడై 'కేశవా!' అని మాత్రం పలికి తల పంకించాడు. అతనిలో నూతన చైతన్యం కలిగింది. 'ఆదికేశావా! నీవు సర్వోత్తముడివి. నా అపరాధం మన్నించు. నీ ఆదేశ ప్రకారం నీకు దాసుడ నవుతాను.' అని దీనంగా వేడుకున్నాడు. అంతే, నాటితో తన సర్వస్వం ఇతరుల కప్పగించి ఏకతార, చిటికెలను పట్టుకుని కేశవాలయమున కూర్చుని తదేక ధ్యానంతో కేశవుని కీర్తించడం మొదలుపెట్టాడు. భగవత్ప్రేరణమున 'కేశవుని మొదలుకొని, కృష్ణాంతము' వరకు ఆశువుగ కీర్తన ఒకటి కల్పించి దానిని కేశవునికే అంకితం చేశాడు.

గురు ముఖమున ఉపదేశం పొంది భగవానుని కీర్తిస్తున్న కనకదాసుకి వేదాంత రహస్యాలను తెలుసుకోవాలని కోరిక కలిగింది. కనకుడిపుడు సర్వసంగ పరిత్యాగి. ఎవరి అనుజ్ఞలు, అంగీకారాలు అతనికి అవసరం లేదు. కానీ దళితుడగు తనను చేరదీయు విశాల హృదయుడైన గురువెవ్వరు? భగవదాదేశంగ కనకదాసు ఒకనాడు విజయనగరం పోయే మార్గం పట్టాడు. షట్ఛాస్త్ర పారంగతులు, వేదవిదులు, అష్టాంగ యోగయుక్తులు, అరువదినాలుగు కళలలో ఆరితేరినవారు అయిన 'వ్యాసరాయలు' విజయనగరంలో తన శిష్యులకు పాఠ ప్రవచనం జరుపుతున్నారు. పండిత గోష్ఠిలో ఉన్న వ్యాసరాయలను చేరి కనకదాసు తనకు తత్త్వోపదేశం చేయమని వినయంగ ప్రార్థించాడు. పండితుడైనవాడి లక్షణం ఎలా ఉండాలంటే 'కుక్కయందు, కుక్కమాంసం తినేవానియందు సమభావం కలిగి ఉండాలి'. వ్యాసరాయలు కనకదాసును చూడగానే వాని కులాన్ని లెక్కించక మోక్ష సాధనకు భక్తియే ప్రధానమని తలంచి కనకదాసును చేరదీశారు. సద్భక్తి పథమున జాతిమతాలకు స్థానం లేదని నిరూపించారు. భక్తి సాధనకు తరతమ భావం లేదనీ, గడ్డిపరక మొదలు బ్రహ్మాండం వరకు సమస్త జీవులు భక్తి సామ్రాజ్యానికి అర్హులేనని వ్యాసరాయలు ఆచరణ పూర్వకంగ చూపించారు. సాత్త్విక జీవులకి ముక్తిని పొందడానికి వారి జాతి కాని, పరిసరాలు కాని ఎంతమాత్రం ప్రతిబంధకాలు కాలేవని ఆయన తలంచారు.

మహిమాన్వితులైన వ్యాసరాయలు కనకుని యమధర్మాంశజునిగ గుర్తించారు. కనకుని శిష్యునిగా చేర్చుకున్న సమయంలో శ్రీవ్యాసరాయలు మదనపల్లి ప్రాంతంలో 'వ్యాస సముద్రమ'నే చెరువును తవ్వించి దానికొక తూము పెట్టిస్తూంటే మధ్యలో ఒక చట్టుబండ అడ్డొచ్చింది. పనివాళ్ళకు అది తొలగించడం సాధ్యంకాక, ఏంచెయ్యలో దిక్కుతోచక ఉండిపోయారు. అది తెలిసిన వ్యాసరాయలు కనకునితో 'నీకు ఒక మంత్రం ఉపదేశం కావాలా?'

'చిత్తం స్వామీ! మీ కీర్తి విని చాల దూరం నడిచి వచ్చాను. నన్ను ఉద్ధరించండి' అని ప్రార్థించాడు. వ్యాసరాయలు వెంటనే 'ఏం మంత్రం? నీ వాహనం 'పోతు' మంత్రమా?' అన్నారు. ఆ మాటనే మహామంత్రంగ స్వీకరించి కనకదాసు జపించడం మొదులపెట్టాడు. అలా జపిస్తూండగా ఎదురుగా ఒక పోతు ప్రత్యక్షమై కనబడసాగింది. వెంటనే గురువులకు ఆ విషయం తెలియపరచాడు కనకదాసు. దానిని యముని మహిషంగ గ్రహించి వ్యాసరాయలు దానితో తూమునకు అడ్డంగా ఉన్న చట్రాతిని తొలగించమని ఆదేశించారు. దానితో అంతవరకు సామాన్యునిగా కనకదాసును భావించిన అక్కడి వారందరూ అతడొక అసాధారణ వ్యక్తి అని భావించారు. తక్కువగా భావించినందుకు పశ్చాత్తప్తులయ్యారు. కనకదాసును వ్యాసరాయలు శిష్యునిగ అంగీకరించారు.

ఈవిధంగ వ్యాసరాయలు కనకదాసును శిష్యునిగ తమతో సమానంగ గుర్తించడం ఇతర శిష్యులకు కంటకప్రాయంగ అనిపించింది. ఈ విషయం గ్రహించిన వ్యాసరాయలు ఒకనాడు 'మోక్షానికి అధికారులు ఎవరు?' అనే విషయంమీద చర్చిస్తూ తమ అభిప్రాయాలను తెలుపమని పండితుల నడిగాడు. వారు మోక్ష ప్రాప్తికి వర్ణాశ్రమ ధర్మాల అవసరాలను గురించి, శాస్త్రములు, భారత, భాగవతాదుల నుండి ప్రమాణములతో చర్చించడం మొదలుపెట్టారు. వారందరి వాదనలు విన్న తరువాత వ్యాసరాయలు 'ఇక్కడున్న వారిలో మోక్షానికి ఎవరు అర్హులు?' అని శిష్యులను ప్రశ్నించారు. అందరూ సమాధానం చెప్పలేక తెల్ల మొహాలు వేసుకుని చూస్తున్నారు. వ్యాసరాయలు కనకదాసును సమాధానం చెప్పమన్నారు. అందుకు కనకదాసు 'నేను చచ్చిన పోవచ్చును' అని బదులు పలికాడు. ఈ మాట వినగానే శిష్యులందరు 'చాలు చాలు. తత్త్వజ్ఞానులకు, సత్యనిష్ఠా గరిష్ఠులకు లేని మోక్షం నీకు మాత్రం లభిస్తుందా? స్వామి నీకు చనువిస్తున్నారని గర్వం పెరిగి ఇలా మాట్లాడుతున్నావు?' అని ఏకకంఠంగా పలికేరు.

కనకదాసు ఏమాత్రం చలించక 'నేను పలికినది త్రికాల సత్యము. నా మాటను మీరు అపార్థం చేసుకున్నట్టుంది.' అన్నాడు మెల్లిగా. అయినా శిష్యులు వినిపించుకొనక 'ఇదేమైనా శాస్త్రార్థమా అర్థంకాక పోవడానికి? ఇంకా లేకపోతే దీనికి ఏమైనా భాష్యం అవసరమా?' అని తిరస్కారంగ పలికేరు. అపుడుకూడా కనకదాసు నిర్వికారంగ 'సోదరులారా! 'నేను' అనేది పోయిన మోక్షప్రాప్తికి అవకాశ ముండుననుటయే నా భావము' అని వివరించాడు. వ్యాసరాయలు, పండితులు అందరూ కనకుని మాటలు విని ఆశ్చర్య చకితులయ్యారు. ఏ కులము వాడైననేమి జ్ఞానవంతుడని అభినందించారు. శిష్యులుకూడా వైరం మరచి ముక్తకంఠంతో శ్లాఘించారు. అంతట వ్యాసరాయలు 'పండిత పామరులకు సులభంగ వేదాంత రహస్యాలను తెలిపే ఈ మార్గమే దాస పద్ధతి' అని ఆనతిచ్చారు.

కనకదాసు మహాజ్ఞాని అని క్రమంగ అందరికీ తెలియసాగింది. అతన్ని గూర్చి ప్రజల్లో అనేక కథలు ప్రచారంలోకి వచ్చాయి. ఒకనాడు వ్యాసరాయలు కనకదాసుతో 'మాకు భగవంతుని దర్శనం చేయింపవా?' అన్నారట. అందుకు కనకదాసు 'సరే స్వామి! రేపు పూజా సమయంలో దర్శింప చేయుదును' అన్నాడట. మరునాడు మఠానికి జనులు విశేషంగా చేరుకున్నారు. సహస్ర నామార్చన ప్రారంభమయ్యింది. అంతలో అనుకోకుండా ఒక కుక్క ఎక్కడినుంచో దారి చేసికొని పూజా మందిరంలోనికి ప్రవేశించింది. భగవత్స్వరూపంగ గుర్తింపని భక్తులు దానిని తరిమి కొట్టారు. మరొకసారి కనకదాసు సర్పరూపంలో భగవంతుణ్ణి స్వామివారికి కన్పింపచేశాడు.

కనకదాసు తన జాతివారిలో ఆనాచారాలను, మూఢ సంప్రదాయాలను తొలగించాలనుకున్నాడు. ఇంటి ఆడుబిడ్డను దేవదాసిగ చేయడాన్ని అతడు నిరసించాడు. ఉత్సవాలలో జంతుబలులను నివారించడానికి కృషిసల్పాడు. బలులివ్వడానికి గుమికూడిన జనుల మనసులు కరిగేలా మాటలతో ఆకట్టుకుని వారినా ప్రయత్నం నుండి విరమింప చేసేవాడు. మద్యపానాన్ని కూడా కనకదాసు దోషకృత్యంగానే విరమింపచేశాడు.

ఒకరోజున కనకదాసు రాత్రి చాలా పొద్దుపోయేవరకు కేశవుని స్మరిస్తూ ఎప్పుడో నిద్ర పోయాడు. స్వప్నంలో కేశవస్వామి 'కనకా! తిరుపతికి రా! పద్మావతీదేవితో నాకు జరుగు కల్యాణాన్ని తిలకించు. తప్పక రావాలిసుమా!' అని అదృశ్యుడయ్యాడు. స్వామి ఆదేశంతో కనకదాసు తిరుపతికి ప్రయాణమయ్యాడు. శ్రీనివాసుడు ఆలయ ప్రధాన అర్చకునికి కలలో కనబడి 'నా భక్తుడు కనకదాసు ఇక్కడికి వస్తున్నాడు. అతణ్ణి ఆదరపూర్వకంగ ఆహ్వానించు' అని చెప్పాడు. మరునాడు ఆ ప్రధాన అర్చకుడు కనకదాసు ఎవ్వరని వెతుక్కుంటూ ఏకతార మీటుతూ వస్తున్న కనకదాసును చూచి 'కనకదాసు ఎవరయ్యా?' అని ప్రశ్నించాడు. దానికి దాసు 'ముందు పోయినవానికి వెనుకవాడు – వెనుక వచ్చేవానికి ముందువాడు' అని చెబుతూ ముందుకు సాగిపోయాడు. ప్రధాన అర్చకుడు అతనిని ఎవరో పిచ్చివాడని భావించాడు.

కనకదాసు ముందుకు నడచి దేవాలయం చేరుకున్నాడు. ఎటుచూచినా భక్తబృందమే. కనకదాసుకు దైవదర్శనం లభించలేదు. నిద్రపోవడానికి సరైన చోటైనా దొరకలేదు. చలిలో వణుకుతూ 'బాగుందయ్యా! ఇదేనా నీ పెళ్ళి వైభవం.' అని పరిహాసంగ ఒక పాట పాడుకున్నాడు. అర్ధరాత్రయింది. కడుపుకు పట్టెడన్నం లేదు. కప్పుకోవడానికి దుప్పటి లేదు. భక్తుల సద్దు అణిగింది. అప్పుడు ఒక వ్యక్తి తినుబండారాలు, పాలు తెచ్చి దాసునికిచ్చి తినమన్నాడు. ఆకలితో ఉన్న దాసు వాటిని ఆరగించి 'నీవెవరు నాయనా?' అని అడిగాడు. 'నేనా? నేనే.' అని బదులు పలుకుతూ ఆ వ్యక్తి వెళ్ళిపోతూ తన ధోవతిని కనకదాసుకు కప్పుకోవడానికి ఇచ్చి వెళ్ళిపోయాడు.

మరునాటి ఉదయం ప్రధాన అర్చకుడు ఆలయంలో ప్రవేశించేసరికి మూలవిరాట్టుకు కప్పిన ధోవతి కనబడకుండా పోయింది. దానికోసం నాలుగు మూలలా వెదకడం

మొదలుపెట్టారు. ఒక అరుగుపై పడుకున్న వ్యక్తి దానిని కప్పుకుని ఉండటం చూసి వారు దానిని లాక్కొని కారణం విచారించకుండానే అతన్ని కొరడాతో కొట్టడం ప్రారంభించారు. కనకదాసు మారు మాట్లాడకుండా, నిర్మలంగ, నిశ్చలంగ అలాగే ఉండిపోయాడు. పూజారులు దేవుని విగ్రహంమీద కొరడాతో కొట్టిన వాతలు ఉండడం ప్రధాన అర్చకునికి తెలియచేశారు. దానితో ప్రధాన అర్చకుడు ఆ వ్యక్తే కనకదాసని గుర్తించి అతన్ని క్షమాపణ వేడుకున్నాడు. భగవంతుడు ఎక్కడో చేతులు ముడుచుకుని కూర్చోడు. భక్తుల మధ్య తిరుగుతూ వారికి చేదోడువాదోడు అవుతూంటాడు. ప్రస్తుతం హేతువాదమని అధికమై లౌకికం పెరిగిపోవడంతో భక్తిభావం సన్నగిల్లింది. దాని ఫలితమే ప్రజలలో అశాంతి. సర్వ అనర్థాలకు మూలం తృష్ణ. ఇంతకన్న మనిషి పతనానికి కాలసినదేముంది?

భారతదేశంపై విదేశీయుల దాడులు, దురాక్రమణలు పెచ్చు పెరిగి ప్రజల్లో కలవరం చెలరేగినప్పుడు ఈ భక్తిభావ ప్రచారమే దేశ శాంతిని కాపాడింది. ఒక ప్రక్క జైన, బౌద్ధ, కాపాలిక, చార్వాకాది నాస్తిక మతాలు అశాంతిని రేపుతూంటే, వేరొకప్రక్క శైవ, వైష్ణవ, శాక్తేయములు రక్తపాతాలకు దిగాయి. ఇలాంటి సామాజిక స్థితిగతులను సరిదిద్దడానికి కొంతమంది మహనీయులు కీర్తనలు, భజనలు ద్వారా భక్తితత్వాన్ని ప్రచారం చేసి సామాన్య జనాల్ని శాంతపరిచారు.

కనకదాసు దక్షిణాన తీర్థసేవ చేసుకుంటూ ఉడిపి శ్రీకృష్ణుని సన్నిధికి చేరాడు. దైవ దర్శనానికి అతనికి అనుమతి లభించలేదు. దానితో కనకదాసు ఆలయం వెనుకకు వెళ్ళి ఎవరూలేని అక్కడ నందకిశోరుణ్ణి స్తుతించడం ప్రారంభించాడు. దర్శన మిప్పించమని వేడుకున్నాడు. వివిధ ఆభరణములతో, తులసి, గంధ, పుష్పాక్షతలతో, దివ్య పరీధానంతో, మురళి వాయిస్తున్నట్లున్న ఆ దివ్యమంగళ విగ్రహం భక్తులందరు చూస్తూండగానే ఒక్కసారిగ పశ్చిమాభి ముఖమయ్యింది. వెంటనే అక్కడి ప్రాకారానికి గండి ఏర్పడి కనకదాసుకు స్వామి దర్శనమిచ్చాడు. ఆనాటినుండీ స్వామి అలానే ఉండిపోవడంతో, నేటికీ 'ఉడిపి'లో దేవుణ్ణి కిటికీగుండా వెనుకవైపు నుంచి దర్శనం చేసుకుంటారు.

అనంతరం కనకదాసు 'బేలూరు' చేరి స్వామి కేశవుణ్ణి, పరమ భక్తుడైన వైకుంఠదాసును చాలకాలం సేవించాడు. అక్కడినుంచి 'మేల్‌కోట' చేరుకున్నాడు. అక్కడ నారాయణునిపై అనేక కృతులు గానం చేశాడు.కనకదాసు నిరంతరాయంగ పుణ్యక్షేత్రాలను దర్శించి చివరకు గురువులగు వ్యాసరాయలను సేవింపగోరి విజయనగరం చేరుకున్నాడు. కనకదాసు రాక మఠంలోని పండితమ్మన్యులకు అకారణంగ ద్వేషకారణ మయ్యింది. 'ఏమిటీ కనకుడి గొప్ప? వ్యాసతీర్థులవారు అతణ్ణే చేరబిలిచి వేదాంత రహస్యాలు చెబుతూంటారు! అతడు అంతరంగ భక్తుడైనట్టున్నాడు!' అని గుసగుసలాడ్డం మొదలుపెట్టారు. ఈ గుసగుసలు వ్యాసరాయల చెవివరకూ వెళ్ళాయి.

ఒకసారి వ్యాసరాయలు శిష్యబృందంతో అరణ్యమార్గాన ప్రయాణం చేస్తున్నారు. వారికి అక్కడ తినడానికి ఏమీ ఆహారం లభించలేదు. అపుడు స్వామి భగవన్నివేదనకోసం తెచ్చిన అరటిపండ్లను ఒక్కొక్కరికి ఇచ్చి 'మీరు ఈ పండ్లను ఎవరూ లేని చోటు చూసుకుని భుజించండి' అన్నారు. శిష్యులందరూ ఏమూలో నక్కి ఎవరూ చూడకుండ మెక్కేసారు. కనకదాసు మాత్రం వెనుతిరిగి వచ్చి 'గురువర్యా! ఈ పండ్లను తినడం నావల్ల కాదు. ఎక్కడ చూచినా పరమాత్మ కనబడుతూనే ఉన్నాడు. అతడు లేనిచోటే లేదు. అటువంటప్పుడు ఆ పరమాత్మునికి తెలియకుండా ఈ పండ్లను తినడం ఎలాగ?' అని ప్రశ్నించాడు. వ్యాసరాయలు కనకదాసు భక్తిని ఘనంగ కీర్తించారు.

కనకదాసు తన జాతి దళితుల అజ్ఞానాన్ని పారద్రోలి, వారి దురాచారాలను నశింప చేయాలని చాలా కృషిచేశాడు. వారిలో విష్ణుభక్తిని పాదుకొల్పడానికి చాలా శ్రమించాడు. కనకదాసు ఉపదేశం వల్ల ఎందరో సన్మార్గగాములయ్యారు. కనకదాసును చివరిసారిగ మేము చూసామంటే, మేము చూసామని 'కాగినెలె' గ్రామంవారు, 'తిరుపతి'లోనివారు చెప్పుకున్నారు. 'కాగెనెలె' గ్రామంలోని ఆదికేశవుని పాదపీఠాన కనకుని విగ్రహాన్నుంచి నేటికీ పూజలు జరుపుతున్నారు. కనకదాసు పురందరదాసులవారినుండి 'తంబుర' ప్రసాదంగ స్వీకరించి దాన్ని తిరుపతిలోని శ్రీనివాసుని భాండాగారానికి చేర్చాడు. తన 'ఏకనాదా'న్ని గర్భాలయ ద్వారంమీద ఒకచోట బంధించి ఉంచారు. వ్యాసరాయలకు మనసులోనే ప్రణతులర్పించి, పురందరదాసులను స్మరించుకుని భగవత్పాదాలను సేవించుకోవడానికి గర్భాలయంలో ప్రవేశించాడు. అంతే! ప్రధాన అర్చకుడు 'దాసులు ఏకారణంచేతనో బయటికి రాకున్నారు. చాల ప్రొద్దుపోయింది.' అని తెర తొలగించి లోపలకు చూచాడు. కనకదాసు అక్కడ లేడు. కనకదాసు ఏమయ్యాడు? అందరికీ ఆశ్చర్యం. జవాబులేని ప్రశ్న అయ్యిందది అందరికీ.

\+ + +

కాలం గడుస్తోంది. వ్యాసరాయలే మరుజన్మలో రాఘవేంద్రస్వామిగ జన్మించారు. ఒకసారి స్వామి తన శిష్యబృందంతో తిరుపతికి వెళుతున్నారు. మార్గమధ్యంలో ఒక ప్రాచీనమైన 'మారుతి' దేవాలయంలో విడిదిచేశారు. అది చాతుర్మాస్య సమయం. ఆ దేవాలయానికి ఒక మాలవాడు ప్రతినిత్యం ఒక కట్టెలమోపు తెస్తూ ఉండేవాడు. శ్రీరాఘవేంద్రస్వామి అక్కడికి రాగానే ఆ మాలవాడు కట్టెలమోపును దింపి స్వామికి సాష్టాంగ దండ ప్రణామం చేశాడు. అతన్ని చూడగానే రాఘవేంద్రులు 'నీగతి ఇట్లైనదేమి?' అని ప్రశ్నించారు. దానికి అతడు 'ఏమని చెప్పను. ఇది నా ఖర్మ. అనుభవించక తప్పదు.' అన్నాడు. అది విన్న రాఘవేంద్రులు 'నీ దగ్గర ఉన్నదేదో తీసికొనివచ్చి రామచంద్రునికి సమర్పించుకో' అన్నారు. అతడు వెంటనే ఇంటికి వెళ్ళి నాలుగు మూలలా వెతికితే ఒక గుప్పెడు ఆవాలు మాత్రం లభించాయి. వాటిని తీసుకుని వచ్చి ధ్వజస్తంభం

దగ్గర నిలబడ్డాడు. స్వామి వానిని ఉద్దేశించి 'రామచంద్రునికి ఏం కానుక తెచ్చావు?' అని అడిగారు. 'ఈ నిరుపేద కానుక ఇదే స్వామీ!' అని అతడు తాను తెచ్చిన ఆవాలు గురువు ముందుంచాడు. గురువుల ఆజ్ఞానుసారం అతడు ఆనాడు ఉపవసించి వ్రతపాలనం చేశాడు. రాఘవేంద్రస్వామి మఠం సర్వాధికారిని పిలిచి నాటి వంటకంలో మాలవాడు తెచ్చి ఇచ్చిన ఆవాలు ఉపయోగించమని చెప్పారు. 'ఇది వ్రతకాలం కదా! ఆవాలు ఉపయోగించ కూడదే!' అని సందేహపడుతున్న వానికి స్వామి 'ఇది మహాభక్తుడు తెచ్చి ఇచ్చిన కానుక. ఇకనుండి ఈ భక్తాగ్రణి జ్ఞాపకార్థం మన మఠంలో వ్రతకాలంలో కూడా నిరాటంకంగ ఆవాలు ఉపయోగించ వచ్చును. మా శిష్య పరంపరకు ఇది సంప్రదాయమగుగాక.' అని శాసనం చేశారు. ఆ అధికారి ఆశ్చర్య చకితుడై 'స్వామీ! ఈ భక్తుడెవరో మాకు తెలుపరాదా?' అని ప్రార్థించాడు. అపుడు స్వామి అందరూ వింటూండగా 'ఈ భక్తుడు ఎవరో కాదు. కనకదాసు. నా పూర్వ జన్మలో (వ్యాసరాయలు) నాకు పరమాత్ముని దర్శనభాగ్యం కలిగించిన పుణ్యరాశి' అని వివరించారు.

సమస్త జనులు సందేహం దానితో పరిహార మయ్యింది. శ్రీమఠంలో పూజలు పరిసమాప్తి ఐన తరువాత శ్రీరాఘవేంద్రస్వామి వారే స్వయంగ కనకదాసుకు తీర్థ ప్రసాదాలు అనుగ్రహించారు. గురు కృపాదృష్టి ప్రభావంవల్ల కనకదాసు జన్మ పావనమయింది. పరమ పావన నామం శ్రీరామ నామ స్మరణ ప్రారంభించాడు. అక్కడి ప్రజలు, శిష్య బృందం చూస్తూండగా కనకదాసు శ్వాసగతిని బంధించి తన ఇహలోక యాత్రను ముగించాడు. శ్రీరాఘవేంద్రస్వామి ఆ భక్తాగ్రేసరుని పార్థివశరీరాన్ని తాము విడిది చేసిన మారుతీ దేవాలయానికిఎదురుగ భూస్థాపితం చేయించారు. కనకదాసు మోక్ష మందిన స్థలమని శిలాశాసన మొకటి నేటికీ అక్కడ మనకు కనబడుతూంటుంది. కనకదాసు ఈ విధంగ తొలుత రక్తుడై భగవదాదేశంతో భక్తుడై, భగవదనుగ్రహంతో ముక్తుడయ్యాడు. దాసుని చరిత పరమ రమణీయం. అది సకల జనులకు అవశ్యం అనుసరణీయం. మొత్తం దళిత సమాజానికే ఆదర్శప్రాయం.

ఈ లోకంలోని సర్వ ప్రాణులు సుఖపడాలి. వారు ఏ రోగాలు లేకుండా ఆరోగ్యంగ ఉండాలి. ప్రతినిత్యం అందరికీ సుఖమే కలగాలి. ఈ జగత్తులో ఎవ్వరూ దుఃఖ పీడితులు కాకూడదు. ప్రజల కష్టాలన్నీ తొలగిపోవాలి. అందరి కోరికలు నెరవేరాలి. సర్వులు, సర్వత్ర ఆనందమయులయి ఉండాలి. ఇదే మన పూర్వులు మనకిచ్చిన ప్రబోధం. సకల సోదర భావానికి ఇంతకన్న వేరే ఆదర్శం ఏం కావాలి? అందుచేత మనదైన ధర్మాన్నే మనం అనుసరిద్దాం.

చండాలిక

శాక్యముని చంద్రుడైన గౌతమ బుద్ధుని ఉన్నతాశయంలా ఆకాశాన్నంటుతున్న ఆ హిమవన్నగ పాదసీమకు దక్షిణ ప్రాంతంలో 'శ్రావస్తిపురము' అనే పట్టణం ఉంది. ఆ నగరంలో సంబుద్ధమైన ప్రకృతి పంచమ స్వరమేళనంలో హృదయానందకరమైన చైత్ర మధుర సంగీతాన్ని ఒలకబోస్తోంది. ప్రకృతి చాంచల్యానికి కోపించేదేమో అన్నట్టు దినకరుడు చండ వైశాఖ భానుడై మండిపడుతున్నాడు. అప్పుడు శ్రావస్తిపురంలో భూమి బీటలు వారింది. పచ్చికబీళ్ళు ఎండి పోయాయి. పశువులు, పక్షులు నీళ్ళకోసం పిచ్చిగ చూడసాగాయి. గొంతు తడారి గూటిలో చచ్చిన కూనకోసం ఒక కాకి కొమ్మమాటున కుమిలిపోతోంది. సకల జంతుకోటి సంతప్తగాత్రమై ఉస్సురస్సు రనుకుంటూన్న మధ్యాహ్నవేళ ఒక లేగదూడ 'అంబా' అని అరచింది.

రహదారి ప్రక్కన గంగరావి మొక్క క్రింద రచ్చబండ దగ్గర పనిలేని సోమరిపోతులు కొందరు పిచ్చాపాటీకి చేరడం పరిపాటి. మెల్లమెల్లగ ఆ చెట్టునీడను చేరిన లేగదూడ అక్కడి జనాల్ని చూచి బెదరి ఒక్క గంతు వేసింది. మువ్వల మ్రోతతో బాలకృష్ణుణ్ణి తలపిస్తున్న ఆ లేగదూడ దూరంగ పోయి చివ్వున వచ్చి మళ్ళీ అక్కడే నిలబడింది. ఆ లేగదూడ వెనకాలే ఒక సుకుమారి, పదహారేళ్ళ పరువపు మొగ్గ, చేతిలో చిన్నికర్ర పట్టుకుని కొండవాగులా ఆ చెట్టునీడకు వచ్చింది. ఆ చిన్నారి తేనెలొలుకు పలుకులు అక్కడ చేరినవారికి అలసట నివారకాలయ్యాయి. చనువుగా తనవైపు చూస్తున్న వాళ్ళను పట్టించుకోకుండా, దూడ మెడను తన సందిట ఇముడ్చుకుని ఆమె కొంతదూరం ముందుకు వెళ్ళింది. ఇంతలో మెడపట్టు తప్పించుకుని లేగదూడ పరుగులు తీయడంతో ఆమె పయ్యెద జారింది. కురుల ముడి వీడి జారాయి. ఆయాసంతో వక్షస్థలం ఎగసిపడుతోంది. రచ్చబండనుంచి 'ఇంత చల్లనివేళ ఎంత చక్కని నాట్యం!' 'నీ లేగదూడని నేను పట్టుకురానా?' 'నీ దూడని నేను నీ ఇంటిదాకా పట్టుకు వస్తా' అని అంటూ కొంతమంది పోకిరిగాళ్ళు ఆమెను ఆట పట్టిస్తూ పరుగులు తీస్తున్న ఆ లేగదూడను పట్టుకున్నారు.

ఆ బాల వాళ్ళు పట్టి తెచ్చిన లేగదూడను తీసుకుని వెళ్ళబోతుంటే 'నువ్వు ఎక్కడుంటావు? ఇప్పుడు నువ్వు ఎక్కడికి వెళ్ళాలి?' అని ప్రశ్నించారు వాళ్ళు. 'మాది ఈ ఊరి వెలివాడ. అక్కడికే పోతున్నా' అంది ఆమె మెల్లిగా. ఆ మాటలు చెవిని పడగానే 'ఏమిటీ? నీదే కులం? ఏ జాతి?

నీ వెవ్వతివి? కళ్ళు కనబడ్డంలేదా? రాచబాటను చేరి నీ పోకిరి వేషాలేమిటి? నిన్నని అని ఏం లాభం? కలియుగ మాహాత్మ్యం' అని బడబడ నోటికి వచ్చినట్లు వాగుతున్న ఆ పోకిరిగాళ్ళకు బెదరి ఆ చిన్నారి పరుగులాంటి నడకతో వెళ్ళబోతుంటే 'ఇంతకీ నువ్వెవరో సరిగా చెప్పి వెళ్ళు' అన్నారు వాళ్ళు. 'నేను చండాలికను. ఊరి వెలివాడ మా నివాసం. మా నాయన నా చిన్నతనంలోనే మరణించాడు. మేము నిరుపేదలం. మా అమ్మే నన్ను సాకుతోంది.' అని గబగబ చెప్పి వెళ్ళబోయింది. చండాలిక ఆ అమాయకపు మాటలు అక్కడ చేరినవారిలో పెద్దలకు కోపాగ్నిని రగిల్చింది. 'ఔరౌరా! కడజాతి దానికి కళ్ళు నెత్తికి వచ్చాయి. మడి, మైల, మర్యాద మట్టికొట్టుకుని పోయాయి. కాలం మారిపోయింది. కులభేదాలు అంతరించి పోతున్నాయి.' అని పలువిధాల ఆమెను మాటల ఈటెలతో పొడవడం మొదలుపెట్టారు.

'సామీ! మీరంతా పెద్దలు. ఇలా అందరూ ఒక్కసారిగ దిక్కులేని నన్ను ఈ విధంగ అల్లరి పెట్టడం న్యాయం కాదు. మీవంటి పెద్దలు తిరిగే ఈ పుర వీధికి ఇంక రాను. ఒట్టు పెట్టుకుంటున్నాను. నన్ను క్షమించండి.' అని చండాలిక ఒద్దికగ బదులు పలికింది. అప్పుడు అక్కడ ఉన్న ఉదార మనస్కులు కొందరికి ఆమె మాటలలోని దైన్యం హృదయాన్ని ఆర్ద్రం చేసింది. ఛాందసులకు మాత్రం అందులో కూడా వ్యంగ్యమే తోచి కసి రేపింది. మాటకు మాటగా వాదులాడుకుంటున్న ఆ జనాలను వదలి పైట చెంగుతో జాలువారుతూన్న కన్నీటిబాష్పాలను తుడుచుకుంటూ తన హీన జన్మను తిట్టుకుంటూ, చండాలిక లేగదూడను లాగుకుంటూ తన ఇంటి దారి పట్టింది.

వెలివాడ దగ్గర రోడ్డుప్రక్కన ఆ వాడలోని వారికోసం ఒక బావి ఉంది. ఆ బావి దగ్గర ఆగి చండాలిక లేగదూడకు నీళ్ళు తోడి దగ్గర పెట్టి తాగమంటోంది. ఆ బావి చేరువలో ఉన్న వేపచెట్టు క్రింద అరమోడ్పు కళ్ళతో బసవన్న శుద్ధ సత్త్వ ప్రకృతిలా నెమరువేస్తూ పడుక్కున్నాడు. బురదలోపల దేహాన్ని ముంచి తామస గుణాన్ని పోలిన ఒక మహిషం పొరలాడుతోంది. సమాన ఉజ్జీ అనుకుందో, ఏమో! ఒక పొట్టేలు రాజసం ఒలకబోస్తూ శృంగము లొడ్డి ఒక చెట్టును ఢీకొడుతోంది. ఒక్కచోట చేరిన వివిధ జీవుల చిత్తవృత్తులను ఆ శ్రావస్తిపురం వెలివాడ తెలియపరుస్తోందో అన్నట్టు ఉంది అక్కడి ప్రకృతి. ఇంతలో ఒక భిక్షుక గణం వీనుల విందుగా గానం చేస్తూ తన ముందుకే రావడం చండాలిక కంట పడింది. 'బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి – ఈ భూమండలంలోని జనుల కందరకు ఇదే శరణత్రయం. కడుపు నింపుకోవడానికి జంతుకోటిని చంపి రక్తపానం చేయడం రాక్షస ప్రవృత్తి. జీవకారుణ్య భావం చిగురించగా జనుల బ్రతుకు తీవలు మలుచుకోవాలి.' అని భిక్షుక గణం అర్థవంతంగా పాడుకుంటూ వస్తూ ఉంటే చండాలిక కనుకొలకుల్లో అనుకోకుండా ఆనందాశ్రువులు జలజల రాలాయి. ఆమె పసి మనస్సును ఎవ్వరో నిద్దుర లేపినట్టయ్యింది.

అందులో ఒక భిక్షుక ప్రవరుని కంఠం తడారి పోయింది. అతడు దాహంతో చండాలికను చేరి నీళ్ళు పోయమని తలవంచి నిలబడ్డాడు. 'మునిశ్రేష్ఠుడు దాహమని చండాల కన్యకను అడగడమా? ఇదేమిటి! ఈయన ఇలా అడిగాడు?' అని చండాలిక సందేహిస్తోంది. 'ఓబాలా! దాహం దాహం అంటూంటే సందేహిస్తూ నిలబడతావేమిటి? చల్లని నీళ్ళు పోసి పుణ్యం కట్టుకో. ఈ తాపాన్ని భరించలేక ప్రాణికోటి డస్సిపోతోంది. చల్లని నీళ్ళే దీనికి ఉపశమనం' అని పలుకుతున్న యువ భిక్షువు మొహం చూసి 'క్షమించండి బాబూ! మాది చండాల జన్మ. మా నీళ్ళు తమవంటి శ్రోత్రియులకు ఎలా పనికి వస్తాయి?' అని వెనకడుగేస్తున్న చండాలికను చూసి మందహాసం చేస్తూ ఆ భిక్షువు 'నిన్ను నువ్వే ఎందుకిలా నిందించుకుంటావు? ఆత్మదూషణం మంచిది కాదుసుమా! నువ్వు నేనూ మానవులమే. మనలో సమానమైన గుణం మానవ ధర్మం ఒక్కటే. మిగిలినవన్నీ కృత్రిమాలు. నువ్వు తాకితే ఈ నీళ్ళు ఏలా అపవిత్ర మవుతాయి! సమస్త ప్రాణికోటికి దప్పిక తీర్చే ఈ స్వాదుజలం ఎప్పుడూ పవిత్రమే! ఎందుకు సందేహిస్తావు? కొంచెం నీళ్ళు పోసి నా ప్రాణం నిలబెట్టు.' అని దోసిలిపట్టి నిలబడ్డ ముగ్ధమోహన ఆకారుడైన మునిని కన్నార్పకుండా చూసి చండాలిక మనసులో సంకోచం విడిచిపెట్టి బావిలోని చల్లని నీటిని తన సర్వస్వం ధారపోస్తున్న దానిలా నిండు మనస్సుతో అతని దోసిట పోసింది. తనను సంస్కరింప వచ్చిన ఆ మహానుభావుణ్ణి ఏ రీతిన సత్కరింపగలనని చండాలిక ఆలోచించడం మొదలుపెట్టింది. అతనిపై కుదురుకున్న అపారమైన ప్రేమను తన చిన్ని మనస్సులో అణచుకోలేక చండాలిక సంతత బ్రహ్మచర్య దీక్షా కఠోరుడైన ఆ ముని పాదాలపై వ్రాలిపోయింది. ఆ ముని చండాలికను రెండు భుజాలు పట్టి లేవనెత్తి దీవించి నిర్వికారంగ అక్కడినుంచి తన బృందంతో వెళ్ళిపోయాడు.

ఆ ముని స్పర్శతో చండాలిక సర్వేంద్రియ శక్తులకు అపూర్వ ఆనందయోగ గుణం ఆవేశించింది. చండాలిక ఒక తపస్వినియై కదలక స్థాణువులా నిలబడిపోయింది. అంతలో తెలివివచ్చి చుట్టూ చూస్తే సర్వజగత్తూ శూన్యంగ తోచింది. సాధుసంఘం కనుచూపుమేర దాటి వెళ్ళిపోయింది. మింట సూర్యుడింకా చండ్రనిప్పులు చెరిగి పోస్తూనే ఉన్నాడు. చండాలిక అప్రయత్నంగానే ఆ సంఘం పోయినవైపే తనూ పోతోంది. 'ఈ జన్మలో నా నోములు ఫలిస్తాయా? నేను అంత భాగ్యం చేశానా? ఆ మునికుమారుడు అంగీకరించేడా! ఈ లోకంలో నా అంత అదృష్టవంతురాలు ఉండదు. లేకపోతే! నాకు మరణమే శరణ్యము. బౌద్ధుల దృష్టిలో జీవహింస అత్యంత పాపకార్యం కదా! ఆ ముని కుమారుడైనా నన్ను తలుస్తాడో? తలవడో? ఆ సుందరాకారుని మనోజ్ఞ మానసంలో నేనొక రాజహంసనై కోరిక తీరా ప్రేమ కలకూజితాలు ఎపుడు చేస్తానో ఏమో? మునుల చిత్తములు అణుమాత్రాలుగ కనబడతాయే కాని చాలా గంభీరాలు. కొలను కదా అని దిగ జూస్తే నదులై, అంబుధులై అగాధాలవుతాయి. ఆ ముని మనోంబుధిని మునిగి నా జీవితాన్ని

పరిత్యజిస్తాను. అతడు అంగీకరించకపోతే అంతకంటే నాకు గత్యంతరం లేదు. కమ్మగ మాటలాడి మది గాయం మాన్పాడు. ప్రేమ మూర్తియైన ఆ మునికోసం నా ప్రాణం త్యజించడం ఒక గొప్ప కాదు. కానీ! మా అమ్మ? ఆమెకు నేను తప్ప లోకంలో ఇంకెవ్వరున్నారు? ఆమెకోసం బ్రతకాలి. తప్పదు. మునికుమారుడు అంగీకరించాడా! మా అమ్మ ఆనందానికి అంతు ఉండదు. లేకపోతే నా నిశ్చయం మారదు.' అని అనుకుంటూ నడుస్తూండగానే మునివాటిక సమీపించింది.

ఇంతలో సంధ్యారుణ కాంతులు నాలుగు దిక్కులా వ్యాపించాయి. పొలాలకు మేతకు వెళ్ళిన పశువులు ఇళ్ళకు తిరిగి వస్తున్నాయి. పక్షులు తమతమ గూళ్ళకు చేరుకుంటున్నాయి. 'నా చిట్టితల్లి ఎక్కడికి వెళ్ళిందో, చీకటి పడుతోంది, ఇంకా ఇంటికి రాలేదు.' అని చండాలిక తల్లి ఆమెకోసం వెదకడం ప్రారంభించింది. మెల్లగ వస్తున్న లేగదూడ ఒక్కటే ఆమె కళ్ళ పడింది. 'అన్నమైనా తినకుండా ఎండలో అప్పుడనగా పోయి ఇప్పటివరకు ఎక్కడి కెళ్ళారు? మీ ఆకలైనా మీకు తెలియడం లేదు. రోజులా! చూద్దామంటే ఏమీ బాగోలేవు. మీకేదైనా అయితే నేను ఏమై పోవాలి? మీపైనే ప్రాణాలు నిలుపుకుని బ్రతుకుతున్నాను కదా! నా పిచ్చితల్లికి అడ్డూ ఆపూ లేకుండా పోతోంది. చిన్నదాన్ననుకుంటోందో, ఏమో! పెళ్ళీడుకి వచ్చింది. ఇంతవరకు ఇంటికి చేరుకోలేదు. నువ్వొక్కత్తివే వచ్చావు ఇంతసేపు తిరిగి తిరిగి, తనేమైంది?' అని కడలి పొంగిన విధంగ కన్నీళ్ళు ఉబికి ఉబికి వస్తూండగా దుఃఖిస్తూ వెదకుతూంటే, అంతలో చండాలిక మెల్లిగా తల్లిని చేరుకుంది.

మనసులో కోరిక స్పష్టంగా ఉన్నా మాటల్లో తల్లికి స్పష్టం చేయడానికి చండాలిక అశక్తురాలవుతోంది. అమ్మ చెయ్యి పట్టుకుని మెల్లమెల్లగ నడుస్తూ, ఆకాశం కేసి చూస్తూ 'ఇదేమిటమ్మా! ఈ సంజ ఇంత కొత్తగా ఉంది? అటు పడమటి కొండపై ఆ భానుబింబం, ఇటు తూరుపు కొండపై ఈ ఇందుబింబం. అటు రవి రాజసం, ఇటు శశి సత్త్వం. ఇద్దరూ ఇలా ప్రకాశిస్తూంటే ఇక ఈ భూమండలంలో తమస్సు ఎట్లా ఉంటుంది? ఆకాశం సూర్య చంద్రులకి ఆటపట్టుగ కనబడుతోంది కదమ్మా? నీళ్ళింకిన మన వాడ కొలనులోని పేద కలువ ఇంత సోయగం పోతోంది ఏమిటమ్మా?' అని ఈ విధంగా ప్రశ్నల పరంపర కురిపిస్తున్న చండాలికను తల్లి ఆశ్చర్యంతో తేరిపార చూసింది. 'ఏమిటీ పిచ్చిపిల్ల! ఎపుడూ నోరు విప్పి మాటాడేది కాదు. ఈ ప్రౌఢ శృంగార భావ దశా సూచకములైన మాటలు క్రొత్తక్రొత్తగా మాటాడుతోంది.' అని అనుకుని, 'ఊరూ వాడా తిరిగి తిరిగి వచ్చావు. ఏవేవో క్రొత్త క్రొత్త ప్రశ్నలు వేస్తున్నావు? నువ్వు వేసిన ప్రశ్నలకు సమాధానం నాకేం తెలుస్తుంది? నువ్వేమో చాలా అనుభవజ్ఞురాలివి.' అని కోపం నటిస్తుంది. తన తల్లికి నిజంగా కోపం వచ్చిందేమో అనుకుని చండాలిక ఇంక మాట్లాడకుండా మౌనంగా తల్లిని అనుసరించింది.

ఇల్లు చేరినా ఆ ముని మానసంనుండి దూరం కాకపోవడంతో నిద్రాహారాల ధ్యాస తనకు లేకపోయినా అమ్మ దగ్గర బయటపడకూడదని ఒక ముద్ద తినీ తినక లేచి మునికుమారుణ్ణి

చేరిన మనసులేని తన శరీరాన్ని పక్కపైకి చేర్చింది. కలత నిద్దురలో ఒక కల వచ్చింది. తాను మునికుమారుని సమీపించింది. మాటాడబోయింది. 'మునికుమారా! మునికుమారా!' అంతలో కల చెదిరిపోయింది. కళ్ళు తెరచి చూసేసరికి 'ఎవరమ్మా ఆ మునికుమారుడు?' అని సంభ్రమంగా అడుగుతున్న తల్లి తన ప్రక్కనే కూర్చుని ఉంది. పిచ్చిపిల్ల కల కందని తల్లి తనబిడ్డను పొదివికొని నిద్రపుచ్చుతూ విషయం తెలుసుకుంది.

చండాలిక తల్లి పడుకుందే కాని 'మునికుమారుడు అంటుందేమిటి? మౌనయోగంతో అంతర్ముఖుడైన మన్మధుణ్ణి జయించిన సంయమీంద్రుడేనా? ఈ పేదపిల్లను అనురక్తను చేసి వెళ్ళిపోయాడు. ఇది చాలా ఆశ్చర్యంగ ఉంది. అప్సరసలు అప్పుడప్పుడు ఇంద్రుడు పంపిస్తే వచ్చి తమ నాట్యం, గానం ప్రదర్శించి మునుల మనసులు దోచుకున్నారని విన్నాం. నా పిచ్చితల్లి ఏ కళలూ నేర్చింది కాదు. మరి ఇదెలా సమకూడింది? నిజంగా మునికుమారుడేనా? నా చిట్టితల్లి బ్రతుకు నాశనం చేయడానికి ఎవరైనా ఆడుతున్న నాటకమా?' అని పరిపరి విధాల ఆలోచిస్తూండగానే తెల్లారిపోయింది. కుమార్తెను లేపి కాలకృత్యాలు తీర్పించి, 'ఇంట్లోనే ఉండు ఎక్కడికీ వెళ్ళకు' అని హితవు చెప్పి, తన జీవనాధారమైన పనికి వెళ్ళిపోయింది చండాలిక తల్లి.

తల్లి ఎంత హితవు చెప్పినా ఆమె తనను విడిచి వెళ్ళిందో లేదో చండాలిక మనస్సు మళ్ళీ మునికుమారుణ్ణి చేరిపోయింది. ఆగని తమకంతో చండాలిక తన ప్రమేయం లేకుండానే మునివాటికకు బయలుదేరి చేరుకుంది. 'ఆహా! ఏమి బౌద్ధారామం? ఏమి ఆ దివ్యతేజం? ఏమి శాంతి? ఏమి బుద్ధదేవుడు? ఏమి భిక్షుకోటి? ఏమి భక్తి? ఇంతకూ తన మునికుమారుడు ఏడీ? అడుగో! ఆచార్యుని చేరువ ధ్యానముద్రలో ఉన్నాడు. అతన్ని చేరడం ఎలాగ? ఇంతలో బౌద్ధ సంఘాన్ని ఉద్దేశించి ఆచార్యులు దమ్మ ఉపదేశం చేయడం ప్రారంభించారు. చండాలిక అక్కడే ఆగి ఆచార్యుని దివ్య సందేశాన్ని వినసాగింది. 'పొలాలకు జలాలు పారించే కర్షకునిలా, ధనువును స్వేచ్ఛగా ఎక్కుపెట్టగల ధనుర్ధారిలా, రాతిని రమణీయ శిల్పంగ తీర్చిదిద్దే శిల్పిలా సన్యాసి తన మనస్సును తన ఇష్టం వచ్చినట్టు నడిపించ గలగాలి. అంతేకాని మనస్సుకి లొంగి ప్రవర్తించకూడదు. దట్టంగా నేసిన ఇంటి పైకప్పు నుంచి వానచినుకు లోపల ప్రవేశించ లేనట్టు స్థిర వివేక సంపన్నుడి మనసులో విషయవాంఛలు ప్రవేశించలేవు. అర్ధరాత్రి నిద్దురలో మునిగిన ఒక గ్రామసీమను ఒక పెను కెరటం మ్రింగివేసినట్టు, విషయ సుఖ భోగ రక్తుడైన మూర్ఖుణ్ణి మన్మధుడనే పెనుభూతం మసి చేసేస్తుంది. మల్లెతీగ కన్నమమతనైనా లెక్కపెట్టక వాడిన పూలను నేలను రాల్చి వేస్తుంది. అలాగే భిక్షువైనవాడు రాగద్వేషాలను త్యాగబుద్ధితో తెంచివేసుకోవాలి.' అని ప్రవచించిన ఆచార్యుని దివ్యబోధ చండాలికకు జ్ఞానోపదేశం అయింది.

చండాలిక ఆనంద పారవశ్యంలో మునిగిపోయింది. శాంతవిస్ఫూర్తిని పొందింది. చాలా ఉత్సాహం కలిగింది. కృతార్థురాలనయ్యాను అనుకుంది. ఇప్పుడు ఆమె మనస్సు ప్రశాంతంగా

ఉంది. మునికుమారునిపై ఆమెకు గల అనురాగం విశ్వజనీనమైంది. తనకు తెలియకుండానే నెమ్మదిగ వెళ్ళి ఆచార్యుని పాదాలపై పడిపోయింది. ఆమె స్థితిని గ్రహించిన ఆచార్యుడు ఆమెను తన కుటీరానికి తీసుకుని వెళ్ళి సాంత్వన పరచి 'వేలకు వేలు వెచ్చించి, జీవబలితో కూడిన యజ్ఞాలు చేయడం కంటే భక్తితో ఎవరినో ఒక్క స్థితప్రజ్ఞుణ్ణి తలచుకుంటూ తన్మయత్వం చెందడం చాలా శ్రేయోదాయకం. ఆత్మ మౌఢ్యాన్ని గుర్తించిన మూర్ఖుడు మూర్ఖుడు కానేకాడు. అతడే బుద్ధిశాలి. తనకు తానే బుద్ధిశాలినని తలపోసే ఘనుడు పరమ మూర్ఖుడని తెలుసుకోవాలి. అప్పటికే అలసిపోయిన కుంటివాడు ఎడారి దారికి అడ్డపడినట్టు, ధర్మం తెలియని తామసుడైన మూర్ఖుడికి బ్రతుకంతా పరమ దుర్భర మవుతుంది.' అని ఆచార్యుడు దమ్మబోధ బోధించడంతో చండాలికలోని ప్రతి అణువూ స్పందన పొందింది. తిరిగి ఇంటికి వెళ్ళాలనే ధ్యాసే మరిచి పోయిందామె. ఆచార్యుడు ఆమెను జాగృత పరచి మళ్ళీ వెనక్కు ఇంటికి పంపించేడు.

ఆమె దృష్టి మరల్చడానికి చండాలిక తల్లి అనేక విధాల ప్రయత్నించింది. 'మునికుమారుడు నీతో మాటలాడేడా? బ్రహ్మచర్య దీక్షాపరుడైన అతడు నీపై నెయ్యం చూపాడా? పిచ్చిదానా! మనం మాలవాళ్ళమని మరిచావా? నిన్ను నేనెలా నమ్మను?' అని పలికిన తల్లికి 'లేదమ్మా! మునికుమారుని తప్పేమీ లేదు. అతడు నా కసుమాలపు మాల పుట్టుకను మాయంచేసి నన్ను ఒక ప్రేమమయ మానవతా మధుమూర్తిని చేసాడమ్మా! మాల, మాల అంటావేమిటమ్మా! ఈ భూమిపై నున్న వారందరి జీవం వంటిది కాదా అమ్మా మన జీవం? జీవం అభిన్నమైనప్పుడు జీవుల్లో భిన్నత్వం ఏమిటి? సమతే సుమతం కాదా అమ్మా? పుట్టుకచేత ప్రతి ఒక్కరూ సాత్త్వికుడే అవుతాడు. తానుచేసే అసత్కార్యములచేతనే మానవుడు తామసు డవుతాడు. జన్మచేత తామసుడైనా సత్కార్యములచేత సాత్త్వికు డౌతాడు. కొంచెం పరిశీలిస్తే పుట్టుకలు ప్రధానము కాదు. జ్ఞాన వివేకములే సమర్థములు.' అని తర్క బంధురము, ధర్మ సుందరము అయిన వాదన చేస్తున్న చండాలిక ముఖంలో ఒక దివ్య కాంతిరేఖ కదలాడుతూండడం చూసి ఆమె తల్లి ఆశ్చర్య పోయింది. చండాలిక పట్టుదల మరింత పెరుగుతోందే కాని తగ్గడం లేదు. ఆమె రోజూ ఆశ్రమానికి వెళ్ళి వస్తూనే ఉందిం.

ఒకనాడు ఆచార్యుడు బ్రహ్మచర్యాన్ని గూర్చి ఇలా బోధించాడు. 'మన మనస్సు అనేది ఒక చిన్న పడవ లాంటిది. అందులోకి మమత అనే నీరు నిండిపోతూంటుంది. అప్పుడు దీక్ష అనే చిన్న దొన్నెను తీసుకుని ఆ నీటిని తోడి పారబోసి బ్రతుకు నదిలో నిర్వాణ పథం పట్టుకోవాలి. పడవ మునిగిపోకుండా చూసుకుంటూ ముందుకు పయనం సాగించాలి. మమతానురాగాలకు లొంగక బ్రహ్మచర్య దీక్ష పూనిన ధర్మవేత్త ఒక్కడే నిజమైన భిక్షువు. అంతేకాని బిచ్చమెత్తుకునే ప్రతివాడు భిక్షువు కాడు. వాయువేగంతో పయనించే ఉత్తమాశ్వం దెబ్బకు ఓర్వనట్లు ధీరుడు, వినీతుడు, జితేంద్రియుడు అయిన మానవోత్తముడు ఎప్పుడూ మాట పడడు.' అని చండాలికను

చూసి 'నువ్వు మనసును చిక్కబట్టుకో. ఒక్కసారి తీసుకున్న నిర్ణయానికి తరువాత విచారించ కూడదు.' అని ఆచార్యుడు పలువిధాల చండాలికకు దమ్మబోధ గావించాడు.

+ + +

మునికుమారుడు తన సమీపంలోనే ఉంటున్నాడు. ఇప్పుడు చండాలిక మనసులో మునుపటి అలజడి లేదు. అయితే ఆమె ప్రేమలో మాత్రం మార్పు లేదు. ఇప్పుడు అది తుచ్ఛం కాదు. మదనాతురం కాదు. ఆమె ఇప్పుడు పులుకడిగిన ముత్యం. నిర్మలమైన దర్పణం. ఆమె మనస్సు ఇప్పుడు ప్రబల విరక్త భావ సంబుద్ధం. ఆమెకు పంచేంద్రియాలు ఉన్నా లేనట్టే. ఇంద్రియ స్థితే సందిగ్ధమైనప్పుడు ఇక ఇంద్రియ వికారాలకు తావెక్కడ? చండాలిక మనస్సు తరంగాలు లేని సముద్రంలా, నిర్మల సరోవరంలా, నిర్వాణ దీపకళికలా, స్వచ్ఛ స్ఫటికఖండంలా వెలుగొందుతోంది. ఆమె మనస్సును కల్లోల పరచిన ఉరుములు, మెరుపులు, మేఘాలు, ఉప్పొంగి ఉరికే కల్లోల వాహిని మటుమాయ మయ్యాయి. ఆమె అంతరంగంలో జ్ఞానమనే తొలిప్రొద్దు వెల్లివిరిసింది. ఇప్పుడు మునికుమారుడంటే ఆమెకు ప్రణయభావన శూన్యం. ఇప్పుడున్నది కేవలం స్నేహభావన మాత్రమే. పుట్టుకచే తాను అంత్యకులానికి చెందినది కావచ్చు. బంధ మోక్షణము పొందని జీవులే అంత్యజులు. సుగతుడు సుస్నేహ గౌరవంతో సమస్త లోకాన్ని వెలుగొంద చేస్తాడు. ప్రకృతి సంభవాలైన ప్రేమ వైరాగ్యాల విషయంలో అతడు నిర్లిప్తుడు.

ఆచార్యుడు మునికుమారుణ్ణి, చండాలికను పరిశుద్ధులనుగా గుర్తించాడు. ఒక రోజున వారిని చేరబిలిచి 'అకుటిల ప్రణయ భిక్షువులై ఈ విశ్వ భిక్షావాటిని మీరు ఇరువురు విహరించండి. పరిణత ప్రణయ సోదరులై జగతి కుటుంబాన సంచరించండి. ఈ పృథివియే బౌద్ధారామంగ శాంతి సాగర యాత్రను సాగించండి.' అని దీవించాడు. చండాలిక సోదర భావనతో మునికుమారుని వైపు చూసింది. మునికుమారుడు వికార రహితమైన స్నేహ దృక్కులతో చండాలికను చూసాడు.

వారి చరిత్ర నిర్మలం. వారి జీవనం అమలినం. వారూ భారతీయతకు వారసులు.

మాలదాసరి

భగవతారాధనకు అనేక మార్గాలు. ఆకాశంనుంచి పడే నీరు ఎక్కడనుంచైనా సముద్రాన్నే చేరుతుంది. అదే విధంగ ఏమార్గంలో ఆరాధించినా చివరకు చేరేది ఆ పరాత్పరుణ్ణే. అన్ని మార్గాల్లోకి అతి సులభమైన మార్గం, కలియుగంలో అనుకూలమైన మార్గం భక్తి మార్గం. మహాభక్తుల చరిత్రలు వినడం, చదవడం సకల పాపహరం. సన్ముక్తి ప్రదాయకం. అటువంటి మహాభక్తులలో శ్రేష్ఠుడు 'మాలదాసరి'.

'తిరుక్కురుంగుడి'కి మూడామడల దూరంలో ఒక చండాలవాటిక ఉంది. అక్కడ పరమ భక్తుడైన మాలదాసరి కాపుర ముంటున్నాడు. అతడు ప్రతిరోజూ తెల్లవారుఝాముననే లేచి 'మంగళ కైశికి' రాగంలో భగవానుణ్ణి కీర్తిస్తూండేవాడు. అతడు జన్మతః చండాలుడైనప్పటికీ భక్తిలో నిరుపమానుడై మసిపాతను కట్టిన మాణిక్యంలా ప్రకాశించేవాడు.

ఆ దాసరి చమురోడుతున్న తొలుచొక్కా తొడుక్కుంటాడు. చెవులకు ఇత్తడి శంఖు చక్రాల పోగులు ధరిస్తాడు. బల్లెంలాంటి బాణం, ఒక దీపస్తంభం, నూనెతిత్తి చేత పట్టుకుంటాడు. తులసిపూసల పేరులు ధరిస్తాడు. తిరుచూర్ణం పట్టెలుగ బొట్టు పెట్టుకుంటాడు. అతడు ప్రొద్దుపొడుపుననే దేవాలయం చేరి చిటితాళాలు వాయిస్తూ, చిరుతవీణ మీటుతూ ఒళ్ళు గగుర్పొడిచేటట్టు రాళ్ళు కరిగేటట్టు మహానందంతో 'మంగళ కైశికి'ని గానం చేస్తూంటాడు. ఎండనక, వాననక, ఆకలనక, దాహమనక మధ్యాహ్నం వరకు అలా గానం చేసి, దేవాలయంలో పూజానంతరం భక్తులు తనను మెచ్చి ఇచ్చిన ప్రసాదాన్ని సొరకాయలో పెట్టుకుని గుడికి ప్రదక్షిణం చేసి తన పల్లెకు పోయి భుజిస్తాడు.

+ + +

ఒకనాటి రాత్రి ఒక కోడిని పిల్లి పట్టుకోబోతే అది కూసింది. కోడి కూయగానే ప్రొద్దు పొడిచిందనుకుని దాసరి గుడికి బయలుదేరాడు. చీకటి మూలంగ దురదృష్టవశాత్తు దారి తప్పేడు. తిరిగి తిరిగి ఒక మఱ్ఱిచెట్టు దగ్గరకు చేరుకున్నాడు. ఆ చెట్టుమీద ఒక బ్రహ్మరాక్షసుడు నివాస ముంటున్నాడు. చెట్టుకింద కొబ్బరి బొండాలు తాగి పడవేసినట్టు రక్తం తాగిన పుర్రెలు గుట్టలుగ దొర్లుతున్నాయి. పొదలలో అంతటా పేగులు పారవేయబడి తడిబట్టలు ఆరవేసినట్టు

ఉన్నాయి. తల వెంట్రుకల గుట్టలు గాలికి ఎగురుతున్నాయి. ఘ్రుక్కడి మృగాలు ఎండిన ఎముకల కోసం తగవులాడుకుంటున్నాయి. ఆ దృశ్యాన్ని చూడగానే దాసరికి తాను దారితప్పేనని అర్థమైపోయింది.

ఇంతలో కుంభజానుడనే బ్రహ్మరాక్షసు డొకడు అతని ఎదురుగా నిలబడ్డాడు. అతడు చెప్పలేనంత భీభత్సంగ ఉన్నాడు. తాను చంపిన మనుష్యుడొకణ్ణి మడిచి పట్టకుని రక్తం త్రాగుతున్నాడు. నల్లగా, పొడుగ్గా ఉన్నాడు. ఎఱ్ఱటిబట్ట కప్పుకున్నాడు. ఆ ఎఱుపు, రక్తంతో తడియడం చేతనేమో! అతని గడ్డం తలక్రిందులుగా వేలాడతీసిన ఏనుగు తలలా ఉంది. తలవెంట్రుకలు పైకి నిక్కబొడుచుకుని ఉన్నాయి. ప్రేగులు మెడలో జందేలుగ వేసుకున్నాడు. ఆకలిబాధకి ఓర్వలేక ఆడపిశాచులను బండబూతులు తిడుతున్నాడు. దాసరి ఎదురుగ కనబడగానే అతనికి పరమానందమయ్యింది. 'ఇంకెక్కడి కెళతావురా? నిలు.' అని గట్టిగా అరిచాడు ఆ బ్రహ్మరాక్షసుడు.

దాసరి రాటుపోటులకు ఆగినవాడు. భయం ఎరుగనివాడు. మంచి బలశాలి. అందుచేత అతడు తనచేతిలోని బాణంతో రాక్షసుణ్ణి ఒక్క పోటు పొడిచి, రెండు రెక్కలు పట్టి విసిరికొట్టాడు. రాక్షసుడికి అంతులేని కోపం వచ్చింది. 'ఓరీ! నన్ను తప్పించుకుని ఎక్కడికి పోతావు?' అంటూ అతన్ని లాక్కొని వెళ్ళి నాలుగు మడమ పోటులు పొడిచి పిశాచికలతో 'ఓసీ! వీడు సామాన్యుడు కాడు. వీడి పంచప్రాణాలు ఒక్కసారిగా పీల్చి రక్తం తాగుతాను. వీడి మాంసాన్ని ముక్కముక్కలు చేసుకుని, ఇనుప ఊచలకు గుచ్చి కాల్చి నాకు అందివ్వండి. నేను కమ్మగ తింటాను. అపుడుగాని నా కసి, నా ఆకలి తీరదు.' అని అరుస్తూంటే దాసరి ఏమాత్రం భయంలేకుండా 'ఓ రాక్షసరాజా! నీచేత చిక్కాను. ఇంక నేను ఎక్కడికి పోతాను? చూచి చూచి బలముండగా ఈ దేహాన్ని నీకు అప్పగించకూడదని పెనుగులాడానే కాని నాకు ఈ దేహంపై ఏ కొంచెంకూడా ఆశ లేదు. నా శరీరాన్ని నువ్వు కోరి భుజిస్తానంటే అంతకంటే నాకు కావలసింది ఏముంది? శిబి చక్రవర్తి తన దేహమిచ్చి చరితార్థుడు కాలేదా! ఒక్క మాట విను. ప్రాణరక్షణ కోసం చెబుతున్నాను అనుకోకు. న్యాయం ఆలోచించు. ఈ మాంసాహారం శుచి, శుభ్రం లేనిది. హింసతో కూడినది. హింసవల్ల ఈ లోకంలో తప్పించుకున్నా పరలోకంలోనైనా నరకబాధలు తప్పవు. ఈరోజు కాకున్నా రేపైనా నీకు చావు తప్పదు. రావణ, హిరణ్యకశిపులే కాలగర్భంలో కలిసిపోగా లేనిది మనమాట చెప్పేదేమిటి? దేవతలు, రాక్షసులు అన్నదమ్ములైనా వారికి ఆహారం అమృతం, మీకు మాంసం ఆహారం. ఇందుకు కారణం ఏమిటో ఊహించు. ఆపైన నీ ఇష్టం' అని సానునయంగా పలికాడు.

అది విన్న రాక్షసుడు పకపక నవ్వి 'నువ్వు ధర్మశాస్త్రాలు నాకు బాగానే చెబుతున్నావు. నువ్వేం నాకు చెప్పనక్కరలేదు. నేను అన్నీ ఎరుగుదును. అగ్ని సర్వభక్షకుడు కాదా! అలాగే

మేమూనూ. గరుడుడు అమృతాన్ని పాములకు చూపించి మాయం చేశాడా? లేదా? అలాగే నేనూ నిన్ను హాయిగా తింటాను. చావు తప్పించుకోవడానికి అధిక ప్రసంగం చేయడం అందరికీ అలవాటే. నువ్వు ఏవో కల్లబొల్లి కబుర్లు చెప్పి నన్ను ఉబ్బించి తప్పించుకుందామను కుంటున్నావేమో! నీ అడ్డుమాటలు విని నేను బేలపోయేవాడిని కాను. ఈవేళ నిన్ను చంపక మానను.' అన్నాడు తిరస్కారపూర్వకంగా.

'రాక్షసరాజా! నువ్వు సర్వజ్ఞుడివి. నీకు తెలియనిదేముంది? నేను ఒక్కమాట చెబుతాను విను. నేను పెరుమాళ్ళను ప్రతిరోజూ కీర్తిస్తూంటాను. అది నా వ్రతం. దయచేసి నా వ్రతం తప్పించకు. గుడిముందు గానంచేసి మళ్ళా వెంటనే వచ్చేస్తాను. అపుడు నువ్వు నన్ను స్వేచ్ఛగా ఆహారంగా స్వీకరించు.' అని అనగానే రాక్షసుడు వికటాట్టహాసం చేసి 'ఓరీ! ఎంత మాయలాడవురా! నా కన్నుగప్పి పారిపోదామనుకుంటున్నావు కాబోలు! నా దగ్గర ఇలాంటి నీ ఆటలేమీ సాగవు. ఎన్ని దారులు కొట్టి నేటికి దాసరి వయ్యావో? ఎవడైనా తనకు తానుగా చావుకి ఇష్టపడతాడా? నీ మాటలు నమ్మే దెవరు? నేను నిన్ను విడిచిపెట్టడం, నువ్వు మళ్ళీ తిరిగి రావడం రెండూ జరిగే పనులు కావు. అనవసర ప్రయాస మాని చావుకి సిద్ధపడు' అన్నాడు.

రాక్షసుని ఆ మాటలు విని దాసరి రెండు చెవులు మూసుకుని 'నారాయణ! శ్రీహరీ! నన్ను ఈ రాక్షసుడు నమ్మడం లేదు. పోనీ! ఒక ఒట్టు పెడతాను విను. ఏ పరమాత్ముని దయవలన ఈ లోకం పుట్టి, పెరిగి, నశిస్తోందో అలాంటి విష్ణువుతో సమానమని వేరొక దేవుని లెక్కపెట్టినవాడు పొందే దుర్గతిని నేను రాకపోతే పొందుతాను.' అని ప్రతిజ్ఞ పట్టగానే ఆ మాటవిన్న రాక్షసుడు దాసరిని ఏ కళ్ళనున్నాడో విడిచిపెట్టాడు. 'దైవలీల చెప్పడానికి ఎవరి తరం!' దాసరి మహానందంతో పరుగు పరుగున వెళ్ళి ప్రతిరోజూలాగే తన గానం ముగించుకుని ప్రసాదాన్ని స్వీకరించి త్వరత్వరగ రాక్షసుడి నివాసం మఱ్ఱిచెట్టును సమీపించి 'రాక్షసోత్తమా! నీ ధర్మాన ఈ రోజుకు నా వ్రతం పూర్తి చేసుకో గలిగాను. ఇదిగో నా మాట ప్రకారం వచ్చేసాను. జాగ్రత్తగా చూసుకో. నువ్వు నన్ను విడిచిపెట్టి నప్పుడు ఎలా ఉన్నానో అలాగే వచ్చేనో? లేదో? అవే అవయవాలు. అన్నిటితోనూ వచ్చాను. ఏమీ భేదం లేదుసుమా! రా! నీ ఆకలి తీర్చుకో.' అని ఏమాత్రం ప్రాణభీతి లేకుండా పలికాడు.

మాలదాసరి పలికిన ఆ పలుకులు విని బ్రహ్మరాక్షసుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. ఇంతవరకు ఏ ప్రాణి తనను భక్షించమని ముందుకు వచ్చినది తనకు తెలియదు. ప్రాణి గోల పెడుతూంటే తాను ఆనందంగా భక్షించడమే తనకు తెలుసు. అటువంటిది ఏమిటీ దాసరి? అంతటి బ్రహ్మరాక్షసుడు కరిగిపోయాడు. కన్నులు బాష్పధారలు కట్టాయి. దాసరి చేరువకు వచ్చి అతనికి ప్రదక్షిణం చేసాడు. వినయంగా సాష్టాంగ పడ్డాడు. 'ఓ పుణ్యాత్మా! దేవ, అసుర, మావవాదులలో నీవంటి సత్యవంతుడు ఉండడు. నేను ప్రమాణంచేసి చెబుతున్నాను. 'అని దాసరిని ఆలింగనం చేసుకున్నాడు. 'మహాత్మా! నువ్వు చాలా గొప్పవాడవు. ఎన్ని కబుర్లు చెప్పినా,

ఎన్ని ప్రమాణాలు చేసినా ప్రాణం పోతుందంటే మాట నిలబెట్టుకోవడం జరిగే పని కాదు. అది నీకే చెల్లింది.' అని రాక్షసుడు పొగుడుతూంటే దాసరి 'నువ్వు నన్ను ఇంతగా పొగడనక్కర లేదు. నీకు మేము బ్రహ్మదేవుడు విధించిన ఆహారం. నన్ను తినడం నీకు దోషం ఏమీ కాదు. నువ్వు చాలా ఆకలితో ఉన్నావు. నామూలంగా నీకు చాలా ఆలస్యంకూడా అయింది. త్వరగా నీ ఆకలి తీర్చుకో. నన్ను భక్షించు.' అన్నాడు.

అది విన్న రాక్షసుడు అదరిపడి 'ఏమన్నావు? నిన్ను తినమనా? క్రూరకర్ముడనై ఇన్నాళ్ళూ చేతికి దొరికిన వారినందరిని చంపి మహాపాపం చేశాను. ఇంక చాలు. ఎప్పుడైనా ఎవ్వడైనా నీవంటి మహనీయుడు రాకపోతాడా? నా పాపం నుంచి నన్ను విముక్తుణ్ణి చేయకపోతాడా? అని నా శాపవిముక్తికోసం ఎదురు చూస్తూనే ఉన్నాను. ఇప్పటికి నా పుణ్యం పండి ఇన్నాళ్ళకి నువ్వు దొరికావు. నీవంటి మహాభక్తుడి, పరమ భాగవతుడి దయలేకుంటే మాలాంటి పాపాత్ములకు రక్షకు డెవరు? మాకు విముక్తి కలిగించే దెవరు? నన్ను దయచూడు.' అని వేడుకున్నాడు.

'ఇంతకీ నీ ఉద్దేశం ఏమిటి?' అని ప్రశ్నించేడు దాసరి. 'నా శరీర కశ్మలం పోగొట్ట గలవాడవు నువ్వు మాత్రమే. ఆ ఉపకారం మానేసి నీ శరీరాన్ని ఇస్తానంటా వేమిటి?' అని అంటూండగానే, 'అంతా దైవకృప. నీకు నేను ఎలా ఉపకారం చేయగలను చెప్పు.' అన్నాడు దాసరి. 'నువ్వు నామ గానం చేసిన పుణ్య ఫలాన్ని నాకు దానం చెయ్యి. దానితో నాకు ఈ పాపిష్ఠి శరీరం పోతుంది. నీకు అంతులేని సుకృతమూ కలుగుతుంది.' అని మెల్లిగా తన కోరికను వెల్లడించాడు రాక్షసుడు. దానికి దాసరి పకపక నవ్వి 'ఓరీ! నువ్వు ఎంత అమాయకుడ వయ్యావూ? నేను నీకు నా శరీరం సమర్పిస్తాను అన్నాను కానీ, నా గానఫలం ఇస్తానని అనలేదు కదా! ఒక్క క్షణం గానఫలం కూడా నీకు నేను ఇవ్వను. మనం ఎన్ని జన్మలు ఎత్తామో? మనిషిగా కావచ్చు. మరుజన్మలో కుక్కగా కావచ్చు. ఇంకో జన్మలో సోమయాజిగా కావచ్చు. మరోసారి శూద్రుడుగా కావచ్చు. కానీ ఒక్కజన్మలోనైనా భగవద్భక్తుడిగా అవడం దుర్లభం. అశాశ్వతమైన ఈ శరీరం కోసం అలభ్యమైన పుణ్యాన్ని అమ్ముకోమంటావా? నీ దురాశ మానుకో. నువ్వు అడిగింది నా శరీరం. నేను ఇస్తానన్నదీ నా శరీరాన్నే, తీసుకో, యధేచ్ఛగా తిను.' అన్నాడు.

బ్రహ్మరాక్షసుడు చాల దుఃఖంతో, కన్నుల నీరు గ్రుక్కుకుని, చేతికందిన ఫలితం చేజారి పోతోందని విచారిస్తూ, ఆఖరి ప్రయత్నంగా 'దయానిధీ! నువ్వు ఎఱుగని ధర్మం లేదు. నీకు నేను చెప్పగలవాడనీ కాను. ఇతరులకు చెప్పకూడదన్న తిరుమంత్రాన్ని శ్రీరామానుజులు శ్రీరంగేశుని గోపురం ఎక్కి అందరికీ గట్టిగా చెప్పి వినిపించలేదా? ఇంతటి మహాపాపం ఎందుకు చేసావని గురువుగారు అడిగితే 'నేను ఒక్కణ్ణీ నరకంలోకి పోతే పోతాను. నా మూలంగా ఇంతమంది ముక్తిని పొందుతారు కదా! అంతకంటే నాకు ఇంకేం కావాలి?' అని చెప్పలేదా!

ఎందరెందరో మహానుభావులు మాబోటి దీనులను ఉద్ధరించారు. నువ్వుకూడా ఆ శ్రేణికి చెందినవాడివే. నన్ను కరుణించు తెల్లవారు ఝామున గానం చేసిన కడపటి గీతం ఫలమైనా నాకు ఇచ్చి నన్ను కృతార్థుడిని చెయ్యి.' అని పాదాలపై పడి మరిలేవకుండా దీనంగ ప్రార్థిస్తూ అలాగే ఉండిపోయాడు.

దాసరి ఆ బ్రహ్మరాక్షసుడు నిజంగా పశ్చాత్తాపం చెందుతున్నాడని విశ్వసించి, అతన్ని కాపాడాలని నిశ్చయించుకుని ఆ బ్రహ్మరాక్షసుడికి ప్రసన్నుడయ్యాడు. 'ఓయీ! నా మంగళకైశికి గాన ఫలం ఎంతటిదో నాకు తెలియదు. అది ఆ పెరుమాళ్ళకే ఎరుక. అందుచేత నేను ఇంత ఫలం దానం ఇస్తున్నానని అని అనలేను. నీవు ఉద్ధరింపబడుదువుగాక! అని మాత్రం ఆ పరమాత్ముణ్ణి ప్రార్థిస్తున్నాను.' అనే మాట దాసరి నోటినుండి రావడమే ఆలశ్యం. ఆ రాక్షసుడికి శాపవిమోచనం అయ్యింది. అతని అనందానికి అవధి లేకపోయింది.

అతడు మహాపండితుడైన ఒక బ్రాహ్మణుడు. విద్యా విక్రయం చేయడంచేత బ్రహ్మరాక్షసుడు అయ్యాడు. దాసరి ధర్మమా అని శాప విముక్తుడు అయ్యాడు. దాసరి మాత్రం యథాప్రకారంగా భగవద్ధ్యానపరుడై తన గానామృతాన్ని భగవంతుడికి నివేదిస్తూనే, అంత్యకాలంలో మోక్షం పొందాడు. మాలవాడైనా బ్రాహ్మణునికి శాపవిమోచనం కలిగించ గలిగిన మహాత్ముడు అయ్యాడు. దీని వలన గుణం ప్రధానం కానీ, కులం కాదని తెలుస్తోంది కదా! ఆ గుణమే లేనినాడు కులం అతన్ని ఏం కాపాడింది? బ్రహ్మరాక్షసుణ్ణి చేసింది తప్ప. అందుచేత మనుషులు ఉత్తమ గుణసంపన్నులు కావాలి. దానికి భగవద్భక్తిని మించింది మరొకటి లేదు. ఆ మార్గమే అందరికీ అనుసరణీయం. దానికి మాలదాసరే ఆదర్శప్రాయుడు.

కన్నమదాసు

భారతీయుల శౌర్య పరాక్రమాలు, సాహస కీర్తులు వారసత్వంగ వస్తున్న అపూర్వ సంపద, అందులో ఆర్యులనాటి భారతగాథ ఎటువంటిదో ఆంధ్రుల నాటి పలనాటి వీరచరిత్ర కూడా అంతటిదే. యుద్ధ తంత్రాలలో తృప్తిచెందని భారతవీరులు తిరిగి పలనాటిసీమలో జన్మించారనీ, భారతగాథే తెలుగుతనాన్ని అలవరించుకుని పలనాటి వీరగాథ అయిందనీ చెబుతారు.

ఈ పలనాటి వీరగాథకి గుంటూరు మండలంలోని పలనాడు పుట్టినిల్లు. ఆ పులిగడ్డమీద ఎందరో ఆంధ్రవీరులు ఆశ్చర్యకరములైన వీర విహారము లొనర్చి శాశ్వత కీర్తిని చేపట్టారు. వీరుల ఆలయాలకు నిలయములై కాకెంపూడి, మాచర్ల, గురజాల వంటి గ్రామాలు నేటికీ నాటి పలనాటి పౌరుష చిహ్నాలకు ప్రతీకలై సందర్శకులకు గడచిన చరిత్రలను జ్ఞప్తికి తెస్తూంటాయి.

ఇలాంటి చరిత్ర ప్రసిద్ధి చెందిన పలనాటి సీమను 'గురజాల' ముఖ్యపట్టణంగ 12వ శతాబ్దంలో 'అనుగురాజు' పరిపాలిస్తూండేవాడు. అనుగురాజుకు చాలాకాలం సంతానం లేకపోయింది. చివరికాతని పూజలు ఫలించి చెన్నకేశవస్వామి కరుణా కటాక్షంగ పట్టపురాణి మైలమదేవికి నలగామరాజు, నరసింగరాజు అనే ఇద్దరు కుమారులు, చిన్న భార్య విద్యాదేవికి పెద మల్లదేవుడు, చిన మల్లదేవుడు, బాల మల్లదేవుడు అనే ముగ్గురు కుమారులు జన్మించారు.

అనుగురాజు తన అవసానకాలంలో తన పెద్దకుమారుడైన నలగామరాజును రాజును గావించి, తన మంత్రి దొడ్డరాయని కుమారుడైన బ్రహ్మనాయుణ్ణి అతనికి మంత్రిగ నియమించాడు. బ్రహ్మనాయుడు వీరాగ్రేసరుడు. గొప్ప విష్ణుభక్తుడు. రాజ్యతంత్రం నడపడంలో కడు సమర్థుడు. బ్రహ్మనాయని మంత్రిత్వంలో పలనాటి ప్రజలు జాతి మత విభేదాలు లేక, ధనిక దరిద్ర భేదం లేక అందరూ ఒక్క తల్లి బిడ్డలుగా హాయిగా కాలం గడుపుతున్నారు. ప్రజలు ఈవిధంగ సుఖంగ ఉండడం కాలానికి కన్ను కుట్టింది.

\+ \+ \+

చిటికామాలపాడు గ్రామంలో రామిరెడ్డి పేరుపొందిన పెద్ద రైతు. అతని గారాబు బిడ్డ నాగమ్మ. ఆమె బాల్యంనుంచీ తన సాహస పరాక్రమాలతో పురుషులకు సాటిగ నిలిచింది. రాజ్యతంత్ర ప్రౌఢత్వంలో నాయకురాలిగ ప్రసిద్ధిపొందింది. ఆమె తన కపట ప్రయత్నంతో, కుటిల రాజకీయంతో రాజ్యాన్ని రెండు ముక్కలు చేసింది. నలగామునికి నాయకురాలు నాగమ్మ మంత్రి అయింది. బ్రహ్మనాయుడు మలిదేవాదులకు మంత్రిగ చంద్రవంక ఒడ్డునగల మాచెర్ల ముఖ్యపట్టణంగ రాజ్యపాలన చేయిస్తున్నాడు.

బ్రహ్మనాయుడు రాజనీతి దురంధరుడే కాదు, గొప్ప దేశాభిమాని, గొప్ప ప్రజాభిమాని. తన సంఘ సంస్కరణాభిలాషకు జాతి మత సామరస్యం ప్రధానంగా అతడు తలపోశాడు. తన అభిలాషను కేవలం మాటలతోనే సరిపెట్టకుండా, చేతల్లోనూ చూపించాడు. పంచమ కులస్థుడైన తెప్పలినాయని కుమారుడు 'కన్నమదాసు'ను చేరదీసి కన్నబిడ్డకన్న మిన్నగా పెంచి పెద్దచేశాడు. విద్యాబుద్ధులు నేర్పించి కత్తిసాము, కఱ్ఱసాము, మొదలైన యుద్ధ విద్యలు నేర్పించాడు. వైష్ణవమతం ఉపదేశించి తనంతవానినిగా తీర్చిదిద్దాడు. కన్నమదాసు పరాక్రమానికి, పాండిత్యానికి పరితుష్టులైన మాచెర్ల పౌరులు బ్రహ్మనాయునితో సమానంగా కన్నమదాసునూ గౌరవించేవారు. కన్నమదాసుకు తండ్రి, దాత, గురువు, దైవం సమస్తం బ్రహ్మనాయుడే. నాయుని మాట అతనికి బ్రహ్మవాక్కు, నాయుని సన్నిధి అతనికి పరమ పెన్నిధి.

గ్రహస్థితిని తప్పించుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. రాజ్యాన్ని రెండు ముక్కలుగ చీల్చినా నాగమ్మకు తృప్తి కలగలేదు. బ్రహ్మనాయుని ధార్మిక బలహీనతను ఆసరాగా తీసుకుని అతని దగ్గరకు ఒక జ్యోతిష్యుణ్ణి పంపించింది. బ్రహ్మనాయుడికి ఒక్కడే కుమారుడు 'బాలచంద్రుడు'. ఆ బాలచంద్రుని దుర్జాతక ఫలితం వలన పలనాటిసీమ రక్తసిక్తం అవుతుందనీ, ఎంతో జననష్టం జరుగుతుందనీ చెప్పించింది. ఇంతకూ కన్నమదాసు శిక్షణలో బాలచంద్రుడు అతివీర భయంకరుడుగ తయారౌతున్నాడని వినడమే నాగమ్మ అసూయకు, ఈ ప్రేరణకు కారణం. కన్న ప్రేమకంటే ప్రజా క్షేమమే ఎక్కువని భావించే బ్రహ్మనాయుడు బాలచంద్రుణ్ణి చంపిరమ్మని కన్నమదాసును ఆజ్ఞాపించాడు. అది అతనికి సుగ్రీవాజ్ఞ. బ్రహ్మనాయుడు రాముడైతే, కన్నమదాసు అతనికి హనుమంతుని వంటి బంటు. ఇంతవరకూ ఎన్నడూ అతడు బ్రహ్మనాయుని మాటను జవదాట లేదు. తన శిక్షణలో సుశిక్షితుడౌతున్న, ఉత్తమ గుణ శోభితుడైన బాలచంద్రుణ్ణి, వీరాభిమన్యుణ్ణి చంపడం కన్నమదాసుకు ధర్మవిరుద్ధంగ తోచింది. అలా అని గురువు ఆజ్ఞను ఎదిరించే సాహసమూ చేయలేడు. ఏం చేయాలి? రహస్యంగ బ్రహ్మనాయుని సోదరుడైన పేరినాయుని దగ్గర బాలచంద్రుణ్ణి ఉంచి తన శిక్షణలోనే సకల విద్యాప్రవీణుణ్ణి చేశాడు.

\+ \+ \+

యుక్తవయస్కుడైన బాలచంద్రుడికి కన్నమదాసు సేనానియైన గండు కన్నమనాయని కుమార్తె 'మాంచాల'తో వివాహం నిశ్చయించాడు. ఈ విషయం బ్రహ్మనాయని చెవిని పడనే పడింది. విష్ణుభక్తుడైన బ్రహ్మనాయుడు పరమ రుద్రుడయ్యాడు. అతని క్రోధాగ్నికి కన్నమదాసు తక్క అన్యులెవ్వరైనా భస్మీపటలం కావలసిందే. 'తండ్రీ! ముక్కుపచ్చలారని నా చిన్ని తమ్ముని నేను చంపలేకపోయాను. ఆపని వేరొకరు చేసినా నేను సహించలేకపోయి ఉండేవాణ్ణి. నా ప్రాణాలైనా ఇస్తాను కానీ నా తమ్ముణ్ణి నేను నా చేతులారా చంపలేను. అందుకే సంతతిలేని నీ తమ్మునికి బాలచంద్రుణ్ణి పెంపకం ఇచ్చాను. ఇది అధర్మం కాదనే నా తలంపు'. అని జంకుగొంకు లేకుండా మాట్లాడుతున్న అతని ధర్మయుక్తమైన పలుకులకు సభలోని వారంతా సంతోషించారు. బ్రహ్మనాయుడు మాత్రం తనకు ఇది అవమానంగా భావించాడు. శూలాలవంటి చూపులతో కన్నమదాసును పొడుస్తూ 'నీ కరుణాకటాక్షాలు మా కుటుంబానికి అవసరంలేదు. నా ఆజ్ఞ నెదిరించే సాహసం చేయకు. తక్షణం బాలచంద్రుని తల ఖండించి నాకు ఆనవాలుగ తీసుకుని రా. అంతవరకు నీ ముఖం నాకు చూపించకు' అని తీవ్రంగా శాసించాడు.

కన్నమదాసు మారు మాటాడలేక పోయాడు. అతని స్వామి భక్తి అటువంటిది. సభలోని వారంతా నిశ్చేష్టులై పోయారే కాని బ్రహ్మనాయుని ఎదుట ఎవరూ మారుపలుకలేక పోయారు. బ్రహ్మన్న ఆజ్ఞ బ్రహ్మవ్రాత అని వారికి తెలుసు. వ్యాకులచిత్తుడైన కన్నమదాసు సభాస్థలిని విడిచి బాలచంద్రుని వెంటపెట్టుకుని వధ్యస్థలికి బయలుదేరాడు. తండ్రి ఆజ్ఞను విన్న బాలచంద్రుడు ఆవంతైనా చలించలేదు. ధర్మస్వరూపుడైన కన్నమదాసుకు తన శిక్షణలో వీరమూర్తిగ తీర్చిదిద్దబడిన బాలచంద్రుణ్ణి సంహరించడానికి చేతులు రావడంలేదు. దైన్యమంటే ఏమిటో తెలియని ఆ ధర్మమూర్తికి హృదయం కంపించిపోయింది. కంఠం గద్గదమైంది. 'హా హతవిధీ! ఈ బాలుడి దోషం కొంచెమైనా లేదే! నూనూగు మీసాల నూత్న యౌవనంతో మాంచాల వరమాలను గ్రహించవలసిన వీని కంఠసీమను నా కత్తికి బలిహారం చేస్తున్న దుర్విధిని ఏమనాలి? బ్రహ్మనాయుని ప్రజాభిమానం ముందు కన్నప్రేమ కాలకూట విషం అయిందికదా! లేకుంటే తన ఏకైక కుమారుణ్ణి. అందునా వీరాధివీరుణ్ణి. విచక్షణాశీలుణ్ణి చంపి శిరము గుర్తుగ తెమ్మంటాడా? పోనీ మళ్ళీ దాచిపెట్టి కల్లబొల్లి మాటలు చెబుదామన్నా ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టే బ్రహ్మనాయుడు అలాంటి మాటలు ఇక నమ్మడు. అందుకే చంపడమే కాదు, తలని ఆనవాలుగ తెమ్మని ఆజ్ఞాపించాడు. ఇలాంటి సంకట పరిస్థితిలో నేను ఇప్పుడు ఏం చేయాలి? ఈ అకార్యం చేసి అపఖ్యాతి పాలు కమ్మని బ్రహ్మ నా నుదుట వ్రాశాడు కాబోలు' అని పరిపరి విధాల దుఃఖించాడు.

నడిసముద్రంలో నావలా ఊగిసలాడుతున్న కన్నమదాసు బాలచంద్రుని ముఖంవంక చూశాడు. కన్నుల నీరు పెట్టుకున్నాడు. 'సోదరా! నువ్వు బ్రహ్మనాయుడికి కాక ఇంకెవరికి

జన్మించినా కలిగిన కలోగంజో త్రాగి సుఖంగ బ్రతికియుండే వాడివికదా! నీ పసి ప్రాణాలు నా కఠిన హస్తాలతో తీయవలసివస్తోంది. సభలోని వారంతా నీ తండ్రి నెదిరింపలేక ఈ పని నాకు అప్పగించారు. వారి నిందలు భరించవలసిన మూర్ఖుణ్ణి నేనయ్యాను. పాపిని. ఇలాంటి నాకు పుట్టగతులుంటాయా?' అని కన్నమదాసు బాలచంద్రుణ్ణి కౌగలించుకుని డగ్గుత్తికతో మాటాడలేక మిన్నకుండిపోయాడు. బాలచంద్రుడు అది చూచి ధైర్యంతో తన హృదయం కొంచెమైనా చలించనీక అనునయంగా 'ధర్మమూర్తీ! దైవసమానా! కన్నమదాసూ! ఎందుకయ్యా నీకీ విచారం? పుట్టిన ప్రతివాడికి చావు తప్పనిదేకదా! ఆజ్ఞాపించినవాడు ఎవరు? నా తండ్రేకదా! అనుభవించ వలసినవాణ్ణి ఆయన కుమారుణ్ణి నేనే కదా! నువ్వేమో ఆయన బంటువి, మీదు మిక్కిలి భక్తుడివి. ఆయన ఆజ్ఞ నీకు అతిక్రమించరానిది. నా కర్మ అనుభవానికి నువ్వు కర్తవు కాలేవుకదా! కానీ, నీ పని నువ్వు నిర్వర్తించు. సందేహించకు.' అని పలికి చేతులు జోడించి విష్ణుధ్యానం చేస్తూ కన్నులు మూసుకుని కదలక మెదలక నిశ్చలంగ తలవంచి నిలబడ్డాడు.

కన్నమదాసు అతని ధైర్యానికి ఆశ్చర్యపోయాడు. మాటల పొందికకు ఆనందపడ్డాడు. మనోనిశ్చయానికి ఘ్రాన్పడిపోయాడు. వీరలక్షణాలకు నీరవుడయ్యాడు. 'కుమారా! కులానికి మాలవాడనని తలచికదా! నీ తండ్రి నిన్ను చంపమని నన్ను నియమించాడు. అయ్యో! నా పుట్టుకనే కాని నా గుణాలను, నా భక్తిని లెక్కచేయలేక పోయాడు కదా! తండ్రీ! నిన్ను చంపి రక్తమోడుతున్న నీ తలను తీసుకునిపోయి పౌరుల ముఖాలు నేను ఎలా చూడగలను? నీ ప్రాణాలను రక్షించడానికి ఒక్కటే ఉపాయం. ఈ కత్తితో నా శిరస్సు ఖండించు. నువ్వు ఎక్కడికైనా పోయి సుఖంగ జీవించు. ఆలసించకు.' అని పలువిధాల బాలచంద్రుణ్ణి సమ్మతింప చేయడానికి బ్రతిమిలాడేడు. ఎన్నివిధాల చెప్పినా బాలచంద్రుడు కన్నమదాసును చంపడానికి, తండ్రి మాటకు ఎదురు చెయ్యడానికి అంగీకరించలేదు. దృఢ నిశ్చయంతో 'కన్నమదాసూ! నువ్వు నాకు స్నేహితుడివి, సోదరుడివి, గురువువి, నువ్వు నా తండ్రిమాటను తిరస్కరించి లోకనిందకు గురి కాకూడదు. అది నేను ఏమాత్రం సహించలేను. నువ్వు నన్ను సంహరించకుంటే నాకు నేనే నీ కత్తికి అహుతవుతాను. ఇదే నా నిశ్చయం. ఇంకేం మాట్లాడక మా తండ్రిగారి ఆదేశం పాటించు' అని తలవంచి నిలబడ్డాడు.

కన్నమదాసు బాలచంద్రుని ధైర్యానికి దిక్కుతోచని వాడయ్యాడు. బాలచంద్రుణ్ణి చంపి తాను జీవించలేడు. ఆ కత్తితోనే తన శిరస్సును కూడా వధ్యశిలకు సమర్పించాలి అనుకున్నాడు. అని సిద్ధపడుతూండగా, అంతలో 'కన్నమదాసూ! తొందరపడకు. ఆగు. ఆగు.' అని గట్టిగా కేక వినబడింది. ఆ కేక పేరినాయునిది. పేరినాయుడు అతివేగంగా వచ్చి బాలచంద్రుణ్ణి కౌగలించుకుని 'ఎలాంటివాడి కడుపున పుట్టినవాడికి ఎలాంటి దౌర్భాగ్యం పట్టింది నాయనా!' అని పలవిస్తూంటే 'పేరినాయుడూ! తప్పకో. ఇప్పటికే బ్రహ్మనాయుడు ఉగ్రుడవుతూ ఉంటాడు.'

అని పక్కకు లాగేసాడు. ఆగమని చెబుతూ పేరినాయుడు 'కన్నమదాసూ! చంపక్కర లేదయ్యా! మీరు వెళ్ళాక సభలోని వారంతా బ్రహ్మనాయుడి నిర్ణయాన్ని వ్యతిరేకించారు. బాలచంద్రుణ్ణి చంపమనడాన్ని ఎవ్వరూ అంగీకరించలేదు. అపుడు నేనన్నాను 'బాలుడు నీదగ్గర ఉండడం నీకు ఇష్టం లేకపోతే నా దగ్గర ఉంటాడు. నా కొడుకుగానే ఉంటాడు. అందువల్ల వచ్చే నష్టం ఏదైనా ఉంటే అది నేనే భరిస్తాను.' అన్నాను. నా మాటను సభలోని వారంతా ముక్తకంఠంతో సమర్థించారు. ఇంక బ్రహ్మనాయుడు చేయగలిగేది ఏమీ లేక మనసు ఒప్పకున్నా, దైవనిర్ణయం ఎలా ఉంటే అలా జరుగుతుందని కనికరించడయ్యా! బాలచంద్రుడు మళ్ళీ బ్రతికాడయ్యా!' అని ఉద్వేగంగా చెప్పాడు. కన్నమదాసు ఆ మాటలను నమ్మలేక మళ్ళీ మళ్ళీ అడిగి సంతోషం పట్టలేకపోయాడు. ఆనందంగా బాలచంద్రుణ్ణి ఇంటికి తెచ్చి పేరినాయుడి కొడుకుగానే మాంచాలనిచ్చి ఘనంగా వివాహం జరిపించాడు.

\+ \+ \+

సుఖంగా కాలం గడుస్తూంటే నాయకురాలు నాగమ్మ కంటికి నిద్ర కరువయింది. ఆమె ప్రోత్సాహంతో మూకచేరిన ఆటవికులు మాచర్ల కొల్లగొట్టడానికి అర్థరాత్రికి ఊరి పొలిమేర చేరుకుని అదునుకోసం చూస్తున్నారు. ప్రజాక్షేమం తప్ప తన సుఖమేమిటో ఎరుగని కన్నమదాసు కలత నిదురలో కన్నులు తెరచి ఎందుకో, ఏలనో తెలియకనే ఆయుధం ధరించి నగర పొలిమేరల గస్తు పరీక్షించడానికి వెళ్ళాడు. ఎవరికంట పడకూడదని నాగమ్మ చెప్పి పంపిందో అలాంటి కండలు తిరిగిన కన్నమదాసు కంట ఆ ఆటవికులు పడనే పడ్డారు. వాళ్ళను చూడగానే అనుమానించిన కన్నమదాసు వాళ్ళకు ఎదురు వెళ్ళక డొంకలమాటున చాటుగపోయి నిజం తెలుసుకుని ఆలమంద మీదకు ఉరుకు కొదమ సింగంలా వాళ్ళమీదకు ఉరికాడు. పెడరెక్కలు విరిచి కట్టి బ్రహ్మనాయుడు ముందు నిలబెట్టాడు. తన ప్రయత్నం విఫలమవడమే కాకుండా ఏం జరిగిందో బ్రహ్మనాయుడుకి తెలిసిపోవడం నాగమ్మకి పుండుమీద కారం చల్లినట్లైంది.

మకర సంక్రాంతి అంటే ఆంధ్రులకు సంబరాల పండుగ. రైతుల ఏడాది కష్టంగ ధాన్యలక్ష్మి గాదెల నిండే పండుగ. ఆంధ్ర దేశంలో ఏ గ్రామం చూసినా ముంగిళ్ళ ముగ్గుల్తో, ముద్దబంతి పూవులతో కళకళలాడుతూ ఉంటుంది. సాతానులు, గంగిరెద్దులవాళ్ళు, పగటివేషగాళ్ళు, కొమ్మదాసర్లు ఒకరేమిటి ఆంధ్రుల ముంగిళ్ళు దానధర్మాలకు ఆలవాలములై ఉంటాయి. ఆంధ్రుల పౌరుషానికి ప్రతీక, సంక్రాంతి సంబరాల ప్రత్యేకత, పల్లెజనాలకు వినోదం కోడిపందేలు. నాగమ్మ ఈ అవకాశం ఎలాగైనా ఉపయోగించుకోవాలి అనుకుంది. కోడి పందేలను చూడటానికి రమ్మని మలిదేవాదులకు కబురు పంపింది. జీవహింస తనకు అంగీకారం కాకపోయినా మర్యాదకోసం బ్రహ్మనాయుడు అంగీకరించాడు.

వినోదంగ ప్రారంభమైన కోడిపందేలు వివాదానికి దారితీసాయి. ప్రేక్షకులు కూడా రెండు పక్షాలుగా చీలిపోయారు. పంతాలు పెరిగి, పౌరుషాలు చెలరేగాయి. అదను చూసి నాగమ్మ

లేచి నిలబడి 'ఈ పందెం ఊరకనే ఉబుసుపోకకు వేసేది కాదు. ఈ పందెంలో ఓడినవారు రాజ్యం వీడి కృష్ణానదిని దాటి అడవులలో ఏడేళ్ళు వనవాసం చేయాలి. ఇందుకు మధ్యవర్తిగ ఎవరినైనా నియమించాలి.' అంది. నాగమ్మ కుతంత్రం బ్రహ్మనాయుడికి తెలుసు. అయినా పలనాటి పౌరుషానికి తలవంచి తన అంగీకారాన్ని కన్నమదాసుద్వారా తెలియపరిచాడు.

కోళ్ళు చెలరేగి పోరాడుతున్నాయి. మధ్యవర్తిగ గొల్ల గోవన్నను ఇరువురు అంగీకరించారు. నాయుని కోడి, నాయకురాలి కోడిని ముప్పుతిప్పలు పెడుతోంది. నాగమ్మ తనకు ఓటమి తప్పదని గ్రహించింది. మాయోపాయంతో పుంజును మార్చివేసింది. దాంతో నాయుని కోడి ఓడిపోయింది. మోసం గుర్తించిన కన్నమదాసు ఉగ్రుడై కత్తి చేతబట్టి ప్రేక్షకుల మధ్యకు ఒక్క ఉరుకు ఉరికాడు. నలగాముడు అసమర్థుడై మిన్నక ఉండిపోయాడు. నాగమ్మ మౌనం వహించి వినోదం చూస్తూ కూర్చుంది. క్షణం ఆలస్యం చేస్తే రక్తపాతం తప్పదు. శాంతికోసం బ్రహ్మనాయుడు ఓటమిని అంగీకరించాడు. అన్నిటికీ దైవమే ఉన్నాడని తలచి ప్రవాసానికి బయలుదేర తీశాడు. సకల సౌకర్యాలు సమకూర్చు బాధ్యత కన్నమదాసుపైనే పడింది. ప్రవాసానికి కావలసిన వస్తుసామగ్రిని మోసుకుని పరివారం వెంటనంటి రాగా కన్నమదాసు ముందు నడువగ బ్రహ్మనాయుడు మలిదేవాదులతో కూడి కృష్ణా నదిని దాటి 'మందాడి' గ్రామంలో నివాసం ఏర్పరచుకున్నాడు.

బ్రహ్మనాయుడు మలిదేవాదులతో రాజ్యం వీడి అడవులపాలైనా నాగమ్మ కంటిమంట చల్లారలేదు. వారికి ఉన్న సమస్త సంపద గోధనం మాత్రమే. దాన్ని పట్టి తెమ్మని విశ్వాసపాత్రులైన సేవకులను అర్థరాత్రికి పంపించింది. గోరక్షకుడైన 'లంకన్న' సవ్వడి విని ఉలికిపడి లేచి 'జై చెన్నకేశవా!' అని గట్టిగా కేకపెట్టి సాముకర్రను చేతబట్టి వైరిమూకల మీదకు ఉరికాడు. లంకన్న కేక భేరీధ్వానంగ విన్న కన్నమదాసు ఒడలు ఉప్పొంగి మారు మనిషైనా పిలువక కత్తి చేతపట్టి మేకలమందపైకి ఉరికే పెద్దపులిలా వారిమీదకు ఉరికి దొరికినవారినల్లా చీల్చి చెండాడి మిగిలినవారిని తరిమి కొట్టాడు. ఈ సంకుల సమరంలో లంకన్న మరణించాడు. కన్నమదాసు ఎంతో విచారించాడు. పశువులను మళ్ళీ కొట్టానికి చేర్చాడు.

\+ \+ \+

దైవానుగ్రహంవల్ల కన్నమదాసు సంరక్షణలో ఏడేళ్ళు గడిచిపోయాయి. రాజ్యంకోసం యుద్ధమే శరణ్యమని కన్నమదాసు తీర్మానించాడు. అధికసంఖ్యాకులు అతన్నే సమర్థించారు. కాని బ్రహ్మనాయుడు రాయబారిని పంపుదామన్నాడు. అతని మాటకు ఎదురు లేదు. రాయబారిగ నలగాముని అల్లుడు, మలిదేవాదుల మేనల్లుడు 'అలరాజు' నిర్ణయింపబడ్డాడు. నాగమ్మ కుటిలత్వం తెలిసిన కన్నమదాసు అలరాజుకు ప్రాణరక్షణకోసం పలుసూచనలు ఇచ్చి సాగనంపాడు. కాలం చేరువైనప్పుడు కాపాడేదెవరు? అల్లుని మాటలకు నలగాముడు ఎక్కడ

లొంగిపోతాడోనని తలంచిన నాగమ్మ అలరాజుకు అల్లుని మర్యాదలు జరిపించి ఆ పారవశ్యంలో ఉన్న నలగాముని కూతురుచేతనే భర్తకు విషం పెట్టించింది.

రాయబారం విఫలమవడమే కాక, రాయబారి మరణం చేజేతులా చేసికొన్నామని భగ్గుమన్న కన్నమదాసు కోపాగ్ని జ్వాలలు ఆకాశాన్నంటాయి. శాంతస్వరూపుడయిన బ్రహ్మనాయునికి కూడా అతన్ని ఆపడానికి శక్యం కాకపోయింది. ధర్మస్వరూపుడు, మీదు మిక్కిలి తన భక్తుడు అయిన కన్నమదాసు దృఢనిశ్చయానికి బ్రహ్మనాయుడు తలవంచక తప్పలేదు. తన వార్ధక్యాన్ని అంగీకరించి కార్యభారం కన్నమదాసు భుజాలపైనే ఉంచాడు. అతని సలహాపైనే బాల మల్లదేవుని మేడపికి ప్రభువును చేశాడు. మంత్రిగ బాలచంద్రుణ్ణి నియమించాడు. బ్రహ్మనాయుని కబురు అందగానే వెలమ నాయకులు, క్షత్రియ వీరులు, మాలదాసులు నలగాముణ్ణి తునాతునకలు చేస్తామనీ, నాగమ్మను ప్రాణాలతో బంధిస్తామనీ పంతాలాడుతూ బ్రహ్మనాయుని ముందు నిలిచారు. కన్నమదాసు అంతకు పూర్వమే వారికి యుద్ధము తప్పదని కబురు పంపించాడు. అందుకనే బ్రహ్మనాయుని కబురు అందగానే వారంతా యుద్ధానికి సిద్ధపడి వెంటనే రాగలిగారు. బ్రహ్మనాయుడు ఈ విషయం తెలుసుకుని కన్నమదాసు స్వామి భక్తిని, దేశ భక్తిని మనసులోనే మెచ్చుకున్నాడు.

తమకు తాముగ ముందుగ యుద్ధానికి దిగడం బ్రహ్మనాయునికి ఇష్టంలేదు. అది తెలిసిన కన్నమదాసు తాను ముందుగ పోయి వైరుల ఆనుపానులు తెలుసుకుని వస్తానని బ్రహ్మనాయుని అనుమతి అడిగాడు. తన మనసు నెరిగిన కన్నమదాసును ఆశీర్వదించి పంపించాడు బ్రహ్మనాయుడు. ఎరుకలవానిగ గురజాల చేరిన కన్నమదాసు అన్ని విశేషాలు తెలుసుకుని బ్రహ్మనాయునికి తెలియచెప్పాడు. కారెంపూడి కదనరంగమనీ, యుద్ధసన్నాహాలు అక్కడ ముమ్మరంగా జరుగుతున్నాయనీ, ఒకటి రెండు రోజులలో యుద్ధరంగం చేరడానికి సిద్ధమవుతున్నారనీ నాయుడు తెలుసుకున్నాడు. కన్నమదాసు రహస్య భేదన సామర్థ్యాన్ని బ్రహ్మనాయుడు పలురీతుల ప్రశంసించాడు.

ఒక శుభ ముహూర్తాన ఇరు కూటములు కారెంపూడి చేరాయి. సైనికులకు అందరికి నివాసాలు, ఆహార పదార్థాలు, కావలసిన ఆయుధాలు అన్నీ సమకూర్చడంలో కన్నమదాసు నిమగ్నుడయ్యేడు. ఎక్కడ చూసినా కన్నమదాసే. ఏనోట విన్నా కన్నమదాసే. ఎవరికి ఏం కావాలన్నా కన్నమదాసే. ఎపుడు నిద్రిస్తున్నాడో, ఎపుడు భోజనం చేస్తున్నాడో ఎవరికీ తెలియదు. ప్రతి ఒక్కరికీ నీడలా నిలబడుతున్నాడు. ప్రతి ఒక్కరి అవసరానికి ఆదుకుంటున్నాడు. యుద్ధం సమీపించినా బ్రహ్మనాయుడు కదనం చేయకుండా కార్యం సానుకూల మవుతుందేమోనని ఆలోచిస్తూనే ఉన్నాడు. ఈ విషయం కన్నమదాసుకు మాత్రమే తెలుసు. అందుకే అవకాశం చిక్కినప్పుడల్లా బ్రహ్మనాయుణ్ణి ప్రబోధిస్తూనే ఉన్నాడు. అయితేనేం ఆ ప్రబోధం తాత్కాలికమే అవుతోంది. స్థిరంగ నిలబడటంలేదు.

ఏ నిముషానికి ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు? బాలచంద్రుడు ఉత్సాహంగ స్నేహితులతో బొంగరాలాడుతున్నాడు. అది కోమటి అన్నమ్మ కాలికి తగిలింది. దానితో అన్నమ్మ 'ఆడువారి చెంతనా నీ ప్రతాపాలు. కారెంపూడి పోయి యుద్ధంలో చూపరాదూ!' అని దెప్పిపొడిచింది. సింహం గుహలో చెయ్యిపెట్టి జూలు పెరికినట్లైంది. వీరకిశోరం పౌరుషం రెచ్చిపోయింది. ఎవరెన్ని చెప్పినా వినిపించుకోలేదు. కత్తి చేతపట్టి కాలరుద్రుడై కారెంపూడి చేరాడు. సరిగా అదే సమయానికి కన్నమదాసు ప్రయత్నం విఫలం కాగా మళ్ళీ సంధి ప్రయత్నానికి బ్రహ్మనాయుడు సన్నద్ధమవుతున్నాడు.

'వీరవరులారా! మీ ఉత్సాహం నాకు ఎంతో నచ్చింది. సంతోషం కలిగిస్తోంది. ఇలాంటి సమయంలోనే తొందరపడకూడదు. అన్యాయానికి, అధర్మానికి మన పక్షంలో తావు ఉండకూడదు. చివరిసారిగా సంధికి ప్రయత్నిద్దాం. ఇరుపక్షాలకు పొందుపొసగడమే మేలని చెప్పిద్దాం. అంతమాత్రాన వారు లొంగి వస్తారని కాదు. మన ధర్మం మనం నిర్వర్తిద్దాం. దీనివల్ల మనకి న్యూనత అనుకోనక్కర లేదు.' అని తన పక్షంవారిని శాంత పరిచాడు.

బ్రహ్మనాయుని మాటకు ఎదురు పలుకలేక అందరూ కన్నమదాసు వంక చూశారు. కన్నమదాసు ఆకాశం వంక చూస్తున్నాడు. ఇంతలో సుడిగాలిగా బాలచంద్రుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. తనకు తోడు దొరికిందని కన్నమదాసు మనసులో సంతోషించాడు. అక్కడి సంగతంతా నాలుగు ముక్కల్లో బాలచంద్రుడికి తెలియచెప్పాడు. కన్నమదాసు జరుగుతున్న సంగతి చెప్పగానే తోక తొక్కిన తాచులా ఒక్కసారి లేచి బాలచంద్రుడు మలిదేవునికి వీరవందనం చేసి 'ప్రభూ! పెద్ద సంరంభంతో యుద్ధానికని వచ్చి చివరికి ఇలా సంధి రాయబారాలతో కాలక్షేపం చేయడం తగినదేనా? క్షాత్ర తేజాన్ని వ్యర్థం చేయడం న్యాయమౌతుందా? అరివీరులను చూసేసరికి మన వీరులకు ఆలుబిడ్డలు గుర్తుకు వచ్చేరా? రుధిర ధారలతో వీరగంధం పూసుకోవడానికి వచ్చి పిరికి మందు పుచ్చుకోవడం ఏమిటి? యుద్ధం అవశ్య కర్తవ్యం. జయించేమా రాజ్య సుఖాలను అనుభవిద్దాం. మరణించేమా వీరస్వర్గం అలంకరిద్దాం. అంతేకాని పిరికిపందల్లా వెనుతిరిగి సంధికియ్యకొనడం ధీరుల లక్షణం కాదు.' అని ఉద్రేకంతో పలికి మళ్ళీ కన్నమదాసు ప్రక్కన కూర్చున్నాడు.

బ్రహ్మనాయుడు తన కొడుకు నోటినుంచి ఇలాంటి వీరాలాపాలు ఎన్నడూ ఊహించనైనా ఊహించినవాడు కాదు. బాల్య చేష్టల్లో మునిగినవానిగానే భావించేవాడు. సింహం కడుపున చిరుత నక్క పుడుతుందా? బ్రహ్మనాయుడు మనసులోనే సంతోషించేడు. కొడుకుని అలా తీర్చి దిద్దిన కన్నమదాసును కృతజ్ఞతతో చూశాడు. 'బాలవాక్యం బ్రహ్మవాక్కనికదా! ఇది ఎందుకు వచ్చిందో. సరే, కానివ్వండి.' అని యుద్ధానికి సంసిద్ధత తెలిపాడు బ్రహ్మనాయుడు. వీరులంతా జయజయ ధ్వానాలు చేశారు. కన్నమదాసు పునశ్చరణగ యుద్ధ ధర్మాలు, కత్తి

విద్యలో ప్రయోగించ వలసిన రీతులు బాలచంద్రునికి గుర్తు చేశాడు. రాత్రి ఎపుడు జారిపోయిందో వాళ్ళిద్దరికీ తెలియదు. భళ్ళున తెల్లవారింది.

భేరీల మ్రోతతో, సైనికుల 'జై చెన్న కేశవ' అనే జయజయ వీరాలాపాలతో రెండు పక్షాల వీరులు తలపడ్డారు. కన్నమదాసు విజృంభించాడు. బాలచంద్రుడు నలగాముని సేనాని నరసింగరాజును చూశాడు. మత్తగజంపైకి ఉరికే సింహంపిల్లలా లంఘించి, అలరాజును చంపింది అతడేననే కసితో ఒక్కదెబ్బతో అతని శిరస్సు ఖండించాడు. బాలుడని అలక్ష్యం చేసిన నరసింగరాజు తలను ఈటె మొనకు తగిలించుకుని స్కంధావారానికి తిరిగివచ్చాడు. 'బాలవీరుడికి జై' అంటూ సైనికులు దిక్కులు బ్రద్దలు కొట్టారు. యుద్ధం జరుగుతోందే కాని బ్రహ్మనాయుడికి శాంతి లేదు. అతని మనస్సు ఏ కారణం చేతనో అతనికి స్వాధీనంలో ఉండటం లేదు.

నాయకురాలు కన్నమదాసుని, బాలచంద్రుణ్ణి చంపనిదే తమకు విజయం లభించదని తన యోధులను ఉత్సాహపరుస్తోంది. కన్నమదాసు బాలచంద్రుణ్ణి కంటికి రెప్పలా కాపాడుతున్నాడు. బ్రహ్మనాయుని ఆజ్ఞపై పేరినాయుడు ఒకప్రక్క, కన్నమదాసు ఇంకొక ప్రక్క తమ అనుచరులతో వైరులను చీల్చి చెండాడుతున్నారు. ఇదే అదనుగ నాగమ్మ బ్రహ్మనాయుని పైకి తన వీరులను పురికొల్పింది. బ్రహ్మనాయుడు బంధింపబడ్డాడనే అందరూ అనుకున్నారు. కానీ ఇంతలో మెరుపులా బాలచంద్రుడు ఎక్కడినుంచి వచ్చాడో తోకచుక్కలా నాగమ్మ సైన్యం మీద పడ్డాడు. వీరులంతా ఒక్కసారిగ ఉత్సాహవంతులై బాలచంద్రుణ్ణి చుట్టుముట్టారు. బాలుణ్ణి చేయాడకుండా, ఊపిరి సలపకుండా చేశారు. పద్మవ్యూహం చొచ్చిన వీరాభిమన్యుడిలా బాలచంద్రుడు శత్రువుల శిరస్సులను బంతుల్లా ఎగురకొడుతున్నాడు. ఒక్కరొక్కరుగ అతన్ని ఎదిరించడం అసాధ్యమని నాగమ్మ గుర్తించింది. ఈ అవకాశం చేజారితే కన్నమదాసు రక్షణలో ఉండే బాలచంద్రుణ్ణి కన్నెత్తి కూడా చూడలేమని తన వీరులను రెచ్చకొట్టింది. అధర్మ మార్గమని కూడా తలంచక వెనుకపాటున పలువురు వీరులు ఒక్కసారిగ బాలచంద్రునిపై పడి దారుణంగ చంపేశారు. కొడుకు మరణవార్త విన్న వెంటనే బ్రహ్మనాయుడు అస్త్రసన్యాసం చేశాడు. కన్నమదాసును సేనానాయకుడిగ ప్రకటించాడు.

బ్రహ్మనాయుడు అస్త్రసన్యాసం చేసినా కన్నమదాసు వెనుకంజ వేయలేదు. బాలచంద్రుడి మరణానికి ప్రతీకారం తీర్చుకోనిదే యుద్ధరంగంనుంచి వెనుతిరగనని పంతం పట్టాడు. శత్రునిర్మూలనం చేయందే బాలచంద్రుడి ఆత్మకు శాంతి లేదని నిశ్చయించుకున్నాడు. అపర రుద్రుడిలా యుద్ధరంగంలో వీరవిహారం చేయసాగాడు. నాయకురాలిని కన్నమదాసు మూడు చెఱువుల నీళ్ళు తాగిస్తున్నాడు. వీరాంజనేయుల్లా అడ్డువచ్చిన వీరుల తలలతో యుద్ధభూమికి తోరణం కడుతున్నాడు. చివరకు నాయకురాలి మీద పడ్డాడు. ప్రాణభయంతో

పారిపోతున్న నాగమ్మను స్త్రీయని చంపక, బంధించాడు. నాయకురాలు బంధింపబడడంతో నలగాముడికి రణోత్సాహం చల్లబడింది. కన్నమదాసును ఎదిరించడం కాలయముణ్ణి ఎదిరించడమే అనుకుంటూ సైనికులు పిక్కబలం చూపి పారిపోతున్నారు.

విజయోత్సవం. తగిలిన గాయాలకన్నా కలిగిన అనుభవాలను ఒకరికొకరు కలబోసుకుంటున్నారు. ఇంతలో కన్నమదాసు నాయకురాలిని పెడరెక్కలు విరిచి కట్టి సభలో ప్రవేశ పెట్టాడు. బ్రహ్మనాయుని కళ్లనుంచి అశ్రుకణాలు జలజల రాలాయి. కంఠం గద్గదమైంది. 'నాగమ్మా! అయిందా నీ ప్రతాపం. నీ కుతంత్రాల ప్రతిఫలం ఏమిటో తెలుసుకున్నావా? నీ కడుపు నిండిందా? చాలు. నా ఎదుటినుంచి ఫో! స్త్రీహత్యా దోషం మేము సహించం. నీ ఇచ్ఛ వచ్చిన చోటికి ఫో!' అని కట్లు విప్పించి పంపించి వేశాడు. తన శ్రమ నిష్ఫలమైందని కన్నమదాసు నిరాశచెందినా బ్రహ్మనాయుని విశాల హృదయానికి నమోవాకాలు అర్పించాడు.

కన్నమదాసు తన శేష జీవితాన్ని గురుదేవుని అడుగుజాడల్లో గడపాలనుకున్నాడు. తాను జీవించి యున్నంతకాలం జాతి భేదం లేకుండా, కొద్దీ గొప్పా, బీదా సాదా అనే తేడా లేకుండా బంటు మొదలు భవంతిదారుల వరకు అందరూ ఒక్కటిగ మనసులో కూడా భేదాలెంచక జీవితాలను గడిపేటట్టు కట్టుదిట్టం చేశాడు. అంతవరకు సంఘంలో అస్పృశ్యులుగా పరిగణింప బడుతున్న పంచముణ్ణి తక్కిన జాతుల వారితోపాటు సమాన గౌరవాదరాలు అందుకునేటట్టు చేశాడు. అన్ని కులాలవాళ్ళు ఐకమత్యంతో సౌహార్ద్రంతో మనుగడ సాగించడానికి కృషిచేశాడు. సత్యం, శాంతం, దయ పరమ ధర్మాలని త్రికరణశుద్ధిగ నమ్మి తాను అనుసరిస్తూ, ప్రజలను అనుసరింప చేస్తూ అమరజీవి అయ్యాడు. పలనాటి చరిత్రం పరమ రమణీయం. కన్నమదాసు చరితం చిరస్మరణీయం.

బాలయోగి

మానవదేహంలో మాధవునికి నెలవు మెదడు. మెదడుకు పరబ్రహ్మకు అవినాభావ సంబంధం. అందుకే కుండలినీ శక్తి ద్వారా బ్రహ్మసాయుజ్యాన్ని సాధించాలని యోగులు నిరంతరం కృషి చేస్తూంటారు. అలాంటి యోగుల్లో సమకాలీనంలో అగ్రగణ్యుడు శ్రీ బాలయోగి.

భారతదేశంలో వేదవ్యాసుని గొప్పతనం తెలియనివారు ఉండరు. ఆయన వేదాలను విభజించాడు. వాటి సారాన్ని ఉపనిషత్తులుగా క్రోడీకరించాడు. ప్రజలకు చక్కగా అర్థం కావడం కోసం కథల రూపంలో పురాణాలుగా వ్రాశాడు. తను బోధించిన ధర్మాలు సామాన్యులకు అర్థం కాకుండా పోతున్నాయని ఆ ధర్మాలను భారత, భాగవతాలలో నిక్షిప్తం చేసి కావ్యగానం చేశాడు. ఈ విధంగా ధర్మాన్ని శిష్యులకు బోధిస్తూ బదరీ క్షేత్రంనుంచి బయలుదేరిన బాదరాయణుడు (వ్యాసుడు) కాశీ పట్టణం చేరాడు.

వేదవ్యాసునికి, ఆయన శిష్యగణానికి కాశీలో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. పరమాత్మ పరీక్షించ దలచుకున్నాడో ఏమో? కాశీవాసులు ఆయనకు ఎన్నో అగ్ని పరీక్షలు కల్పించారు. ఏడు రోజులు ఆయనకు, ఆయన శిష్యులకు పట్టెడన్నం దొరకడం కష్టమైపోయింది. కడుపు కాలుతూంటే వ్యాసుడు కాలరుద్రుడే అయ్యాడు. తాను ఆకలికి ఓర్చుకున్నా, తన శిష్యుల దీనావస్థను చూచి చలించిపోయాడు. గుణ, కర్మలను బట్టికాక కేవలం జన్మనుబట్టి సంఘంలో స్థానం కల్పించడం అప్పటికే ఆరంభం అయిందేమో? వ్యాసుడు అరుంధతీయుడు. వశిష్ఠుని భార్య అరుంధతి. వారి కుమారుడు శక్తి. శక్తి కుమారుడు పరాశరుడు. పరాశరుని కుమారుడే వ్యాసుడు. ఈ విధంగ వ్యాసుడు అరుంధతికి మునిమనుమడు. ఒక పల్లెపడుచు మత్స్యగంధికి పుట్టినవాడు. ధనమదం, విద్యామదం, మోక్షలక్ష్మీమదం ముదిరిన కాశీవాసులు ఏమాత్రం కరుణ లేక తనను అవమానించారని వ్యాసుడు కోపావేశంతో కాశీ నగరాన్ని శపించబోయాడు. ఇంతలో ఓ ఇల్లాలు వ్యాసుడికి, అతని శిష్య బృందానికి చక్కని విందు భోజనం పెట్టింది. ఆ ఇల్లాలు ఎవరో కాదు సాక్షాత్తు ఆ విశ్వేశ్వరుని ఇల్లాలు అన్నపూర్ణాదేవే.

ఇంతటితో ఈ కథ ముగిసి ఉంటే మన కథ జరిగేది కాదేమో! వ్యాసుడు ఆకలికి ఆగలేక కాశీని శపించబోయాడన్న నేరానికి అన్నపూర్ణా విశ్వనాధులు ఆయనకు కాశీ పుర బహిష్కార శిక్షను విధించారు. 'కాశీపురంలో ఉండడానికి నువ్వు తగవు. నువ్వు, నీ శిష్యులు తక్షణం కాశీ వదలి పొండి' అని వెళ్ళగొట్టారు. అలా వెళ్ళగొట్టబడిన వ్యాసుడు దేశాటనం చేసుకుంటూ దక్షిణానికి వచ్చి గోదావరీ ప్రాంతంలో దక్షిణకాశిగ పేరొందిన ద్రాక్షారామం, కోటిఫలి, ముక్తేశ్వరం క్షేత్రాలను దర్శించుకుంటూ మునులకు మూలస్థానమైన కోనసీమకు చేరుకున్నాడు. అప్పటికే దక్షిణాన ఉన్న అగస్త్య మహర్షిని వ్యాసుడు ఇక్కడే కలుసుకున్నాడు. ఇద్దరూ తమతమ దుఃఖాలను పరస్పరం పంచుకున్నారు.

ఇంతకూ జ్ఞానస్వరూపుడైన వ్యాసుణ్ణి ఆకలికి ఆగలేక పోయాడనే కుంటిసాకుతో కాశీనుండి వెళ్ళగొట్టారు. తనపైగల ఈ అపవాదును తొలగించుకుని ఎన్ని సంవత్సరాలైనా ఏమీ తినకుండా బ్రతకగలనని నిరూపించడానికే బాలయోగిగ అవతరించాడు వ్యాసుడు. వ్యాసుడు తన అవసానదశలో, కలియుగారంభంలో తనుపడిన అవస్థలకు, అవమానాలకు, అపవాదులకు విరుగుడుగ బాలయోగిగ అవతరించాడు. భారతదేశం కుల, మత, వర్గ, రాజకీయ స్వార్థాలతో ముక్కచెక్కలవుతున్న గడ్డుకాలంలో బాలయోగి పుట్టుకకూ అన్నపానాదులు లేకుండా నలభై ఏళ్ళు చేసిన తపస్సుకూ ఏదో ప్రత్యేకత కనబడుతూంటుంది.

వేదకాలంలో కోనసీమ కేంద్రంగా సప్తగోదావరీ మండలం మునుల నివాసాలతో కలకల లాడుతూండేది. అగస్త్యుడు, వ్యాసుడు వంటి మహనీయులు, భారత సంస్కృతీ నిర్మాతలు ఈ స్థలంలోనే తురీయాశ్రమ జీవితాలు గడిపారు. ఇటువంటి పవిత్ర భూమిలో పుట్టాడు బాలయోగి. ఈ మహాశక్తి క్షేత్రంలో తపస్సు చేశాడాయన.

కోనసీమలో పేరుపొందిన ప్రాంతం ముమ్మిడివరం. ఆ గ్రామానికి దక్షిణంగ ఒక మాలపేట ఉంది. ఆ పేటలో కటికదల గంగయ్య, రామమ్మ గారలకు 1930 అక్టోబరు 23వ తేదీన బాలయోగి జన్మించాడు. అస్పృశ్యతా నివారణకు, సాంఘిక న్యాయానికి చిరకాలంగ పోరుసల్పుతున్న కుటుంబం వారిది. వ్యక్తి ఎవరైనా గొప్పవాడైతే వానివల్ల ఆ వంశానికంతకు గొప్ప పేరు వస్తుంది. బాలయోగికి తల్లిదండ్రులు పెట్టిన పేరు 'సుబ్బారావు'. సుబ్బారావు మూడేళ్ళ పిల్లవాడుగ ఉండగానే తల్లి స్వర్గస్థురాలైంది. పది సంవత్సరాల వయస్సు వచ్చేవరకు సుబ్బారావు పిల్లలతో కలిసి ఆటపాటలతో కాలక్షేపం చేసాడు. అక్షరాభ్యాసం కాని, బడికి వెళ్ళటం కాని ఆనాడు ఆచారంలో లేని విషయం. అలవాటు ప్రకారం 1941 ప్రాంతంలో పాలేరుతనానికి పంపబడ్డాడు. అయిదారేళ్ళు అదే జీవితం గడిపాడు. అసంతృప్తి ఆత్మకే గాని దేహానికి ఏముంటుంది?

సుబ్బారావు దీక్ష ఒక విచిత్ర సన్నివేశం. ముమ్మిడివరంలో ప్రతి సంవత్సరం 'లంక తల్లమ్మ' గ్రామదేవత జాతర జరుగుతూంటుంది. ఆ తీర్థంలో సుబ్బారావు శ్రీకృష్ణ, నారదుల ఒక చిత్రపటాన్ని కొనుక్కున్నాడు. అంతకుముందు ఆ ఊళ్ళోనే ఉన్న టూరింగు టాకీసులో 'భక్త పోతన' సినిమా చూశాడు. మరి సుబ్బారావు మనస్సులో జరిగిన అంతర్మథనం అనూహ్యం. తిండికోసం పాలేరుతనం చెయ్యడంకంటె తిండే మాని కూర్చోవడం ధీరత్వ మనుకున్నాడో, సాంఘిక న్యాయం, సార్వజనిక సమత, దళిత జన సముద్ధరణ ఆత్మబలాన కాని సాధ్యం కాదనుకున్నాడో, 1946 జూన్ 22వ తేదీన శనివారం సూర్యోదయం తమ పేట ప్రక్కనేగల కొబ్బరితోటలో ఒక కొబ్బరి చెట్టు నీడను ఉత్తర దిశాభిముఖంగ కూర్చుని దీక్షకు ఉపక్రమించాడు. తాను కొన్న పటాన్ని ముందు ఉంచుకుని ఫల,పుష్పాదులతో పూజించి ధ్యాన నిమగ్నుడయ్యాడు. అదేమి మహత్వమో కొద్ది సమయానికే శారీరక స్పృహ లేనంతటి సమాధికి చేరిపోయాడు. వేసవికాలం, మధ్యాహ్నపు ఎండ, శరీరం నిండా కండచీమలు పాకుతున్నా సుబ్బారావులో చలనం లేదు. చూచేవారికి అద్భుతం. బంధుజనానికి ఆరాటం కలిగించే రామణీయక దృశ్యమిది.

సుబ్బారావును తపస్సు మానిపించడానికి తండ్రి, బంధువులు ఎంతో ప్రయత్నించారు. లాభం లేకపోవడంతో బలవంతంగా సుబ్బారావును లేవదీసి ఇంటికి తీసుకు వెళ్ళారు. అయితే సుబ్బారావు మాత్రం కళ్ళు తెరవకుండా, అన్నం ముట్టకుండా తపస్సును కొనసాగిస్తూనే ఉన్నాడు. పెద్ద పెద్ద చదువులు చదివిన వారికి కూడా సాధ్యంకాని సమాధి స్థితి నిరక్షరకుక్షియైన సుబ్బారావుకి కలగడం ఆశ్చర్యం కాదూ మరి! ఆ విషయం ఆ ప్రాంతమంతా ప్రచారమై పోయింది. ఆయన్ని చూడడానికి గుంపులు గుంపులుగ జనం రాసాగారు. సుబ్బారావు దీక్షకు విఘ్నం కాకూడదనే ఉద్దేశ్యంతో వారి ఇంటికి కొంచెం దూరంలో ఉన్న పంటకాలువ ప్రక్కన సర్కారు పుంతలో ఒక కుటీరం నిర్మించారు. సుబ్బారావు తనంత తాను వెళ్ళి ఆ పర్ణశాల మధ్యలో సిద్ధాసనం వేసుకుని తపస్సు కొనసాగించాడు. ఆ పర్ణశాలే తరువాత ఒక దివ్య భవనంగ, ఒక పుణ్యక్షేత్రంగ విలసిల్లింది. భక్తుల విరాళాలు, కానుకలు దీనికి ఉపయోగించారు. మహర్షి శ్రీ 'ఈలి వాడపల్లి' సుబ్బారావుకి 'బాలయోగి' అని నామకరణం చేశారు. ఆనాటినుంచీ బాలయోగి గానే విఖ్యాతుడయ్యాడు.

బాలయోగి తపస్సు ప్రారంభించిన తొలినాళ్ళలో తండ్రి బలవంతంతో కొద్ది పాలు తీసుకున్నాడు. పర్ణశాల ప్రవేశంతో అది కూడా మానివేశాడు. ఏకధాటిగా తపస్సు ప్రారంభమైంది. తరువాత పర్ణశాల మందిరమై మార్పులు, మరమ్మత్తులు జరిగినా ఆయన కూర్చున్న స్థలం మాత్రం అలానే ఉండిపోయింది. దీక్షలో కూర్చున్న మూడు సంవత్సరాల వరకు భక్తులు ఎప్పుడు పడితే అప్పుడు ఆయనను దర్శించుకునేవారు. పేరు ప్రఖ్యాతులతోబాటు వచ్చే జనసందోహం కూడా పెరిగింది. ఆంధ్రులే కాదు ఆంధ్రేతరులు కూడా భక్తితో ఆ మహానుభావుని దర్శనానికి రాసాగారు. అందువల్ల ఆయనకు తరచు తపోభంగం కలుగుతూండేది. తపస్సు నిర్విఘ్నంగ

కొనసాగడానికి వీలుగ బాలయోగి ఆజ్ఞతో తలుపులు పూర్తిగ మూసివేయబడ్డాయి. అయితే ఏడాదికి ఒక్కసారైనా దర్శన భాగ్యం కలిగించమని భక్తులు పట్టుపట్టారు. బాలయోగి అనుగ్రహించారు. ఆ విధంగ ప్రతి శివరాత్రికి ఆయన వెలుపలికి వచ్చి భక్తులకు దర్శన మివ్వడం ప్రారంభమయింది. 1949 ఫిబ్రవరి 26వ తేదీన ప్రారంభమయిన శివరాత్రి దర్శనాలు 1985 శివరాత్రి వరకు అవిచ్ఛిన్నంగ జరిగాయి. లక్షల కొద్దీ భక్తులు ఆయన దర్శనానికి వస్తూండడం వల్ల దర్శనం సులభంగ జరగడంకోసం ఒక ఎత్తైన వేదికను నిర్మించారు. దర్శనోత్సవాల సందర్భంలో భక్తులకు అనేక సౌకర్యాలు సమకూర్చారు.

బాలయోగి తపస్సుపై పలువురికి పలు అనుమానాలు ఉండేవి. ఆయన రహస్యంగ ఆహారం తీసుకుంటున్నాడేమో అనే సందేహం కొందరిలో బలంగా ఉండేది. నిజం తేల్చుకోవడం కోసం ఎన్నో ప్రయత్నాలు, పరీక్షలు చేసారు. ఏం చేసినా బాలయోగి ఏమీ తినకుండా తపస్సు చేస్తున్నాడనడంలో అనుమానించదగ్గది ఏమీ వారికి లభించ లేదు . అయితే ఆయన తపస్సు చేసిన నలభై ఏళ్ళ పాటూ కూడా అభ్యుదయవాదులు, హేతువాదులు చాలామంది అనుమానిస్తూనే వచ్చారు. ఆయనను నిరసిస్తూనే వచ్చారు. భారతీయమైన, వేద సనాతనమైన ఆధ్యాత్మిక శక్తిని సుస్పష్టంగ, దీర్ఘకాలం పాటు ప్రదర్శించి చూపిన ఒక పరమ యోగిగ వారు ఆయనను గుర్తించలేక పోయారు. మౌనం పరమాత్మ తత్త్వానికి మిక్కిలి చేరువైనట్టిది. క్రియా శీలతలో అతిబలమైనట్టిది. మౌని సంకల్ప రూపంలోనే శిష్యుడికి పరమ విద్యను ప్రసాదించ గలడు. బాలయోగి శక్తులు అవి పొందినవారికే తెలుసు. ప్రచారంకోసం చేస్తేకదా పదిమందికీ తెలిసేది.

మానవుడు ఆహారం తీసుకోకుండా ఎంత కాలమయినా జీవించ గలడని బాలయోగి నిరూపించాడు. ఆకులే తింటూ, నీరు త్రాగుతూ, గాలి భోంచేస్తూ, చివరకు ఏమీ తినకుండా వేలకొద్దీ సంవత్సరాలు తపస్సు చేసిన మహామహులను కన్న పుణ్యభూమి మనది. అలాంటి అద్భుతం మన సమకాలీనంలో బాలయోగిద్వారా మనకు కనిపించింది. భారతజాతి ఏకత్వం గురించి, దానిని కాపాడుకోవల్సిన ఆవశ్యకతను గురించి, భారతీయ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసే విధానం గురించి, అవిచ్ఛిన్నంగ ముందుకు పురోగమించవలసిన విధి గురించి ఎన్నో విశేషాలు, విషయాలు రత్నగర్భయైన వేదంనిండా ఉన్నాయి. వీటన్నిటికీ ఈ నాటి దళితులు కూడా వారసులే. వాటినుంచి ఉత్తేజం పొందడం వారి బాధ్యత. మన వెనుక గొప్ప సంప్రదాయం ఉంది. మానవ సమానత్వాన్ని విశ్వానికి ఎలుగెత్తి చాటిన ఘనత మనకు ఉంది. కానీ ఈనాడు మనం సాధించింది ఏమిటి? సమాజాన్ని కులం పేరుతో, దేశాన్ని మతం పేరుతో చీల్చి పారేశాం. ఇదేకదా మన ప్రగతి. ఆధునికమైన విదేశీ భావదాస్య ధోరణుల కంటే మన వైదిక విధానాలే సుసంపన్న మైనప్పుడు వాటిని పునరుద్ధరించుకోవడం వెర్రితన మౌతుందా? వివేక మౌతుందా? అట్టి

పునరుద్ధరణ ఆవశ్యకతను మనకు స్వయంగా, ప్రత్యక్షంగా చూపడానికే బాలయోగి అవతరించాడు. 40 సంవత్సరాలు ఆ అవసరాన్ని ప్రజ్వరిల్ల చేసి, ఆయన తన కర్తవ్యాన్ని నిర్వర్తించుకుని 1985 జూలై 20వ తేదీన సిద్ధి పొందాడు.

బాలయోగి వ్యక్తిగత మోక్షాన్ని కోరిన స్వార్థ పురుషుడు కాదు. అలాంటి స్వార్థమున్న వాడైతే ఏ హిమాలయాలకో వెళ్ళి పోయేవాడు. అనామకుడుగ అక్కడే ఉండి చివరకు మోక్ష మందేవాడు. అంతేకాని సొంత గ్రామంలో, తనవారి మధ్య తపస్సుకు కూర్చోడు. సామాజిక స్పృహ లేనివాడైతే సంవత్సరానికి ఒకసారి సమాధినుంచి మేల్కొని బయటికి వచ్చి దర్శన మిచ్చేవాడే కాదు. బాలయోగి ఆశించినది తన సొంత మోక్షం కాదు. జీవన సమాధిలోకి పోయి శాశ్వత పూజలు అందుకోవడమూ కాదు. దళిత ప్రజల ఉద్ధరణ, హైందవ సమాజ సమైక్యం ఆయన లక్ష్యాలు. అందుకే తన మరణాన్ని గూర్చి తాను తెలుసుకోలేక పోయాడని పలువురు విమర్శించినా, సామాన్యుని దేహంలాగే కంపు కొట్టిందన్నా యదార్థం గుర్తించ గలవారికి తన అంతిమతను గూర్చి ఆయన శ్రద్ధ వహించలేదని తెలుసు. శ్రీ బోయి భీమన్నగారు చెప్పినట్లు ప్రాణం ప్రాణధాతువులో కలిసిపోగానే శరీరం పృథివి అయిపోయింది. పృథివి గుణం గంధం కాబట్టి సహజంగానే అది వాసన కొట్టింది. యోగలక్ష్యం మోక్షం కాదు. అపరోక్ష బ్రహ్మజ్ఞానం ద్వారా పొందిన శక్తుల్ని ప్రజా శ్రేయస్సుకోసం వినియోగించడం యోగ ప్రయోజనం. ఇది ఆచరణలో చూపినవాడు బాలయోగి.

అతడు ధన్యుడు. అతనిని కన్న ఆంధ్రమాత ధన్యురాలు. హైందవ సమాజానికి పునరుత్తేజం కలిగించిన బాలయోగి ఆదర్శప్రాయుడు, చిరస్మరణీయుడు.

లక్ష్మమ్మ

భారతదేశం అనాదిగ పవిత్రభూమిగ పేరొందింది. అట్టి మనదేశం మహాత్ములకు నిలయం. అటువంటి మహనీయులు మన కళ్ళెదుట ప్రత్యక్షంగ తిరుగుతున్నప్పుడు మనం వారిని అర్థం చేసికోలేకపోయినా వారి అనంతరం వారియందు భక్తిశ్రద్ధలు కలిగి ఆరాధిస్తూంటాము. ఇది సామాన్య విషయం. ఆ కోవకు చెందిన వారిలో లక్ష్మమ్మ ఒకతె.

శ్రీ లక్ష్మమ్మ జీవిత చరిత్ర చాలా విచిత్రం. ఎంతో పవిత్రం. ఆమె అంత్యకులంలో జన్మించిన అనర్ఘ మణిరత్నం. అంతేకాదు, పూర్వపుణ్య సంస్కార బలంచేత జీవన్ముక్తురాలు. ప్రత్యక్ష శక్తిస్వరూపిణి, సిద్ధురాలు, మహాత్మురాలు అని భక్తులు శ్రీలక్ష్మమ్మను కొనియాడుతూ అనునిత్యం ఆదోనిలోని ఆమె మఠంలో పూజలు, భజనలు చేస్తూంటారు.

ఆదోని లక్ష్మమ్మ ఒక అసామాన్య వ్యక్తి. తెలీని వారికి ఆమె పిచ్చిదిగా కనిపించినా, తెలిసిన వారికి ఆమె ఒక అవధూత, జ్ఞానసిద్ధి పొందిన మహాయోగిని. భక్తులపాలిటికి ఆమె కల్పవృక్షం, కామధేనువు. ఆమె గుణగణాలు, మహిమలు ఎంత పొగిడినా అల్పమే. ఆదోని పట్టణవాసులకే కాదు.పరిసర ప్రాంతాల ప్రజా బాహుళ్యానికి కూడా ఆమె మహిమాతిశయాలు సుపరిచితాలు. శ్రీలక్ష్మమ్మ జీవించియున్నంత కాలం భక్తులచేత అనేక సేవలను అందుకొన్న పరమ విరాగిని. సమాధిని చేరిన తరువాత నేటికీ విశేష పూజలు అందుకొంటున్న మహాయోగిని. శ్రీలక్ష్మమ్మ సమాధి ఆదోనిలోని దర్శనీయ స్థలాలన్నిటిలోను మిన్న. ఆ తల్లిని భక్తితో కొలిచే భక్తుల సంఖ్య అపరిమితం. శ్రీలక్ష్మమ్మ మఠం అవశ్య దర్శనీయం, అనంత ఫలదాయకం.

ఇంతకూ ఈ లక్ష్మమ్మ ఎవరు? తెలుసుకోవాలనే ఆసక్తి కలుగుతోంది కదూ! ఆంధ్ర దేశంలోని కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో శ్రీలక్ష్మమ్మ ఎంతోకాలం తిరుగాడింది. ఆదోనికి ఏడు మైళ్ళ దూరంలో 'మౌసానపల్లె' అనే చిన్న ఊరు ఉంది. ఆ గ్రామంలో మాతంగ కులంలో శ్రీమతి మంగమ్మ, శ్రీ బండెప్ప అనే పుణ్య దంపతులకి క్రీ.శ. 1815 సంవత్సరంలో లక్ష్మమ్మ జన్మించినది. బండెప్ప నిరాడంబర జీవి. కల్లాకపటం తెలీని అమాయకుడు. ఎవరేపని చెప్పినా ఒళ్ళు దాచుకోకుండా, ప్రతిఫలం ఆశించకుండా చేసి పెడుతూండేవాడు. ఆత్మానాత్మ విచారం అతని మనసులో లీనమై ఉండేది. అది తెలీని కాకుల్లాంటి లోకులు అతణ్ణి పశుప్రాయుడుగ

భావించేవారు. బండెప్ప తనకు అయాచితంగ లభించిన దానితోనే భార్యాబిడ్డలను పోషించుకుంటూ కాలం గడుపుతూండేవాడు. రాత్రి సమయాల్లో బండెప్ప తన పిల్లలకి తత్త్వ బోధకాలైన పాటలు, కోలాట పాటలు, జోల పాటలు ఆడి, పాడి వినిపిస్తూండేవాడు. శ్రీలక్ష్మమ్మ పుణ్యచరిత కావడంతో చెప్పాల్సిందేముంది? ఆమెకు బాల్యంలోనే తత్త్వనిష్ఠ కుదిరింది. ఈ ప్రపంచం ఆమెకు ఒక వింత వస్తువుగ కనబడేది. ఎవరితోను ఎక్కువగా మాట్లాడేది కాదు. ఎప్పుడూ ఏకాంతంగా తనలో తాను గొణుక్కుంటూ, కూనిరాగలు తీస్తూ, పిచ్చిపిచ్చిగ మాట్లాడుతూ తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ ఉండేది. ఇది తల్లిదండ్రులకు ఎంతో విచారాన్ని కలిగించింది. పెళ్ళి చేస్తే పిల్ల కుదుటపడుతుంది అనుకున్నారు. లోకాచారాన్ని దాటి ఆలోచించడం సామాన్యులకు వశమౌతుందా మరి!

శిరుగుప్ప గ్రామంనుంచి ఒక కుఱ్ఱవాణ్ణి తెచ్చి పెద్దలందరి సమక్షంలో పెళ్ళి చేశారు. శ్రీమతి లక్ష్మమ్మకు పుట్టినిల్లు, మెట్టినిల్లు రెండూ సమానమే అయ్యాయి. తల్లిదండ్రుల ఆశ నిరాశే అయ్యింది. ఇది నా ఇల్లు, ఇతడు నా మగడు, అత్తమామల మాట మన్నించాలి, సంసారం చేసుకోవాలి అనే ధ్యాసే ఆమెకు లేకపోయింది. ఎవరేం చెప్పినా వినదు. ఏ మూలో కూర్చుని తనలో తాను గొణుక్కుంటూ గంటల తరబడి కూర్చున్నచోటే కూర్చోవడం ఎక్కువయింది. ఇంటి కోడలు ఇలా తయారవడం విపరీతమనుకున్న అత్తమామలు ఇదేదో దయ్యమో, భూతమో, పిశాచమో ఆవహించిందనుకున్నారు. దానికోసం ఎన్నో దేవుళ్ళను కొలిచారు. ఎన్నో వైద్యాలు చేయించారు. ఒక్కొక్కప్పుడు లక్ష్మమ్మ పనులకు విసిగి పెద్దలు తిట్టినా, కొట్టినా, నెట్టినా ఆమె పట్టించుకోదు. ఆమెలో మార్పు లేదు. అన్నింటికీ ఒకటే మంత్రం. మౌన మంత్రం. అంతేకాదు ఆమెకు ఆకలి, దప్పిక కూడా తెలీదు. ఇంట్లోవాళ్ళు పెడితే తింటుంది, లేకపోతే లేదు. అంతేకాని నాకు ఇది కావాలి, ఇది వద్దు అన్న పాపాన పోదు. సుఖదుఃఖాలు లేవు. ఆశామోహాలు అంటవు. అన్నిటికీ ఆమె అతీతురాలు. అది తెలియని అమాయకులు ఆమె భర్త, అత్తమామలు.

చివరకు 'ఆమెకు దెయ్యం లేదు, భూతం లేదు. ఆమె శాపగ్రస్తురాలు అనీ, ఏదో మహత్తర వస్తువును పోగొట్టుకున్నట్టు, దానికోసం తదేక దృష్టితో వెదకుతున్నట్టు, అది దొరక్క పోవడంతో ఆమె మౌనంగ ఉంటున్నట్లు' సోది చెప్పేవాళ్ళు తేల్చారు. 'అదేం వస్తువో మా ఖర్మ, మా పిల్లవాడి దురదృష్టం' అని విసిగి అత్తమామలు ఆమెని పట్టించుకోవడం మానివేశారు. ఈమెతో కాపురం నావల్ల కాదని భర్త వదలిపెట్టేశాడు. లక్ష్మమ్మ పుట్టింటికి చేరింది. ఆమెకున్న బంధాలన్నీ తెగిపోయాయి. ఆమె సాధనకు పునాది ఏర్పడింది. ఆ తరువాత శ్రీమతి లక్ష్మమ్మ సుమారు ముప్పది సంవత్సరాల ప్రాయంలో ఇంటిని, ఇహలోక సంబంధాన్ని వదలించుకుని 'ఆదోని' పట్టణంలో ప్రవేశించింది.

ఆదోని పట్టణంలో తన ఇష్టం వచ్చినట్లు సందుల్లోను, గొందుల్లోను, పాడు బావుల్లోను, మురికి కాలువల్లోను తిరుగుతూ, చెత్త తొట్టెల్లో పడుకుంటూ, పుల్లాకులు నములుతూ, కూనిరాగాలు తీస్తూ, నిద్ర, ఆహారం ధ్యాస లేక, దేహాభిమానం విడిచిపెట్టి స్వేచ్ఛగా తిరుగుతూండేది. ఎవరైనా కనికరించి అన్నం పెడితే ఒకప్పుడు స్వీకరించేది. ఒకప్పుడు నిరాకరించేది. కొంటెపిల్లలు కొట్టినా, క్రిమికీటకాదులు దేహానికి బాధ కలిగించినా ఏమీ చలించక బ్రహ్మానంద స్థితిలో కాలం గడుపుతూ ఉండేది.

శ్రీమతి లక్ష్మమ్మ నిద్రపోయినట్లు గమనించిన వారెవ్వరూ లేరు. సాగరాంతమైన ఈ పుడమే ఆమెకు నిలయం. విశాలమైన ఆ ఆకాశమే ఆమెకు పైకప్పు. రాత్రి చంద్రుడు, పగలు సూర్యుడు ఆమెకు స్నేహితులు. శరీర తాపం పోగొట్టేవాడు గాలి. స్నానం చేయించేది వాన. ఈ మహానుభావురాలికి సాటి ఎవరు? ఆమెకు ఆమే సాటి.

ఒకరోజు ఒక మహానుభావుడు శ్రీమతి లక్ష్మమ్మ పరిస్థితి చూసి ఒక చెట్టనీడను కూర్చోబెట్టి ప్రేమతో తలపై చేయిపెట్టి కుడిచెవిలో ఏదో చెప్పాడట. ఆనాటినుంచి ఆమెకు సమాధి స్థితి కుదిరింది. ఆమె వెదకుతున్న వస్తువుకు దారి ఆనాటికి దొరికిందేమో? రోజుల తరబడి సమాధిలో ఆమె అలాగే ఉండిపోతుండేది. మళ్ళీ తనకుతానే సమాధిలోంచి లేచి, పొగాకు పుల్లలు నములుతూ వీధుల వెంట తిరుగుతూ ఉండేది. కసవు తొట్టిలో కూర్చుని, పడుక్కుంటూ ఉండడంచేత 'తొట్టి లక్ష్మమ్మ' అని జనం పిలుస్తూండేవారు. తిక్కపనులు చేస్తూండడంచేత 'తిక్క లక్ష్మమ్మ' అని కూడా పేరు పెట్టారు. ఆదోని పట్టణంలో శ్రీమతి లక్ష్మమ్మను ఎరుగనివారు లేరు. అందులో కొంతమంది తెలిసినవారు ఆమె కేవలం సిద్ధురాలు, అవధూత అని ఆమెయందు ప్రేమ, భక్తి ప్రకటించి సేవించడం ప్రారంభించారు.

ఒకనాడు ఒక వేశ్య అలంకరించుకుని మేళానికి వెళ్ళడానికి బయలుదేరుతూండగా శ్రీమతి లక్ష్మమ్మ ఆ వేశ్య దగ్గరకు వెళ్ళి చీర, రవికె చించి,ఈడ్చి తిట్టి 'పోవే! ఫో!' అని నెట్టివేసింది. ఏమో పిచ్చిది ఇలా చేసిందనుకున్నారు ముందు అందరూ. ఆ తరువాత తెలిసింది ఆ వేశ్యను ఉంచుకుని, పోషిస్తున్న విటుడు మరణించాడనే వార్త.

ఒకనాడు విజయదశమి మరునాడు, ఆదోనిలోని ఒక సంపన్న వర్తకుని భార్య ఇంటినుంచి ఏదో పనిమీద బయటకు వచ్చింది. శ్రీమతి లక్ష్మమ్మ ఆమెను పట్టుకుని చీర, మెళ్ళోని నగలు త్రెంచి చీకాకు పెట్టింది. సాహుకారు కోపంతో తన నౌకరుచేత గట్టిగా కొట్టించాడు. శ్రీమతి లక్ష్మమ్మ మారుమాటాడకుండా, తనను తన్ని కొట్టి పోతున్న నౌకరును తదేకంగా చూడసాగింది. తామసుడగు ఆ నౌకరు కోపంతో మళ్ళీ పశువును బాదినట్టు కొట్టాడు ఆమెను. శ్రీమతి లక్ష్మమ్మకు ఒళ్ళంతా రక్తం చిమ్మింది. పాపం ఇంకేం చేస్తుంది? బాధ కలిగిందేమో! చురచుర చూస్తూ 'ఒరేయ్! నీ ఇల్లు కూల!' అని మాత్రం అని అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ఇంకేముంది. శ్రీమతి లక్ష్మమ్మను దయలేక కొట్టిన ఆ నౌకరు, అతని భార్య, ఏడుగురు పిల్లలు అంతా నిద్రలో ఇల్లు తగులబడి దారుణంగా చనిపోయారు. దీపానికి దిక్కు లేకుండా పోయింది వాళ్ళ కొంప. ఆ సాహుకారు భార్య పసుపు కుంకుమలను పోగొట్టుకుంది.

ఒకసారి వర్షాకాలం. వరుసగ మూడురోజులు కుండపోతగ వాన కురిసింది. ఆ సమయంలో సమాధిలో ఉన్న శ్రీమతి లక్ష్మమ్మ ఒక మురుగు కాల్వలో కూరుకు పోయింది. ఆమె కనబడలేదని కొంతమంది పుణ్యాత్ములు ఆమెకోసం గాలించారు. మూడోరోజు కాల్వలో ఆమెను కనుక్కుని బయటకు తీశారు. లక్ష్మమ్మ చనిపోయిందని అందరూ అనుకున్నారు. అంతలో ఆమె సమాధినుండి లేచి కళ్ళు తెరిచింది. అక్కడి వాళ్ళందర్నీ చూసి ఒక్క నవ్వు నవ్వింది. అందరూ ఆశ్చర్య పోయారు. కొందరు జ్ఞానవంతులు భక్తితో పుణ్యభావంతో నమస్కరించారు. మరికొందరు అమాయక అజ్ఞానులు ఉదాసీన భావంతో పరిహాసం చేశారు.

కసవు తొట్టిలోనే శ్రీమతి లక్ష్మమ్మ రాత్రి పగలు కాలక్షేపం చేస్తూండేది. ఒక రోజున గస్తీ తిరుగుతున్న పోలీసు కానిస్టేబులు ఆ వీధిలో వస్తూ శిరస్సు ఒక ప్రక్క, మొండెం ఒక ప్రక్క, కాళ్ళు ఒక ప్రక్క, చేతులు ఒక ప్రక్క పడి ఉండటం చూచి పారిశుధ్యం వాళ్ళను తక్షణం పిలిపించి తరువాతి కార్యక్రమం చూడమని హడావుడి చేయించాడు. పారిశుధ్యం వాళ్ళు వచ్చి చూసేసరికి ఏముంది? శ్రీమతి లక్ష్మమ్మ ఎప్పటిలానే తొట్టిలో పడుక్కుని ఉంది. ఆశ్చర్యపోయిన అక్కడికి చేరిన వారందరూ ఆమెను మహనీయురాలుగా భావించారు. ఆ పోలీసు నాటినుండీ ఆమెను ప్రత్యేక శ్రద్ధతో ఆరాధనా భావంతో చూసేవాడు. త్వరలోనే అతనికి ఉన్నత అధికారిగ పదవి లభించింది. మహాత్ముల సేవ మహిమోపేతం కదా!

శ్రీమతి లక్ష్మమ్మ ప్రభావం నలుదిశలా వ్యాపించింది. ఆమె వాక్కు బ్రహ్మవాక్కు. తన దగ్గరకు వచ్చేవాళ్ళకి ఆమె సూటిగా సమాధానం చెప్పేది, లేకపోతే కొట్టి పంపేసేది. అందుకని భక్తులు ఆమెను చేరడానికి భయపడేవారు. ప్రతిరోజు ఎందరో పళ్ళు, పువ్వులు పట్టుకుని చుట్టుప్రక్కల పల్లెలనుంచి వచ్చి ఆమె దర్శనం చేసుకుని వెళుతూండేవారు. ఆమెకు పూలమాలలు అర్పించేవారు. కొబ్బరికాయలు కొట్టి, హారతులు పట్టేవారు. ఇలా వచ్చిన వారిని శ్రీమతి లక్ష్మమ్మ వారి వారి కర్మానుసారంగ పురస్కరించడం, తిరస్కరించడం చేస్తూండేది. భక్తులు తెచ్చిన ఫల, పుష్పాలు శ్రీమతి లక్ష్మమ్మ తీసుకుందా వారికి క్షేమం. తిరస్కరించిందా వారికి కష్టం కలుగుతూండేది.

రాత్రి సమయాల్లో ఆమె అమితానందం పొందుతూండేది. సామాన్యులకు పగలు యోగులకు రాత్రి, సామాన్యులకు రాత్రి యోగులకు పగలు అవుతుంది. ఆ సమయంతో శ్రీమతి లక్ష్మమ్మ సొంపుగ గొంతెత్తి జోల పాటలు, తత్త్వాలు, కోలాట పాటలు పాడుతూండేది. ఎందరో ఆమెను చేరి సేవిస్తూ ఇహపర సౌఖ్యాలను అనుభవించేవారు. ఇప్పుడూ అనుభవిస్తూనే

ఉన్నారు. కురిడిమన్ని రాంసింగు, అరికేరి రివణ్ణ, రాచోటి రామయ్య, తుంబళంగుత్తి లక్ష్మయ్య ఇత్యాదులు అమ్మకు సేవలందించి అనుగ్రహ పాత్రులయ్యారు.

శ్రీమతి లక్ష్మమ్మ తపస్సు ఫలించింది. ఆమె ఇహలోక యాత్రకు విరామ స్థానం లభించింది. శ్రీముఖ నామ సంవత్సర వైశాఖ బహుళ సప్తమి మంగళవారం అనగా 16-5-1933 ఉదయం 6 గంటలకు ఆ మహాత్మురాలు, ఆ మహాయోగిని, ఆ అవధూత అంతిమ శ్వాస విడిచింది. శాశ్వత సమాధిని చేరుకుంది. ఆమె కూర్చున్నచోటనే ఆమెకు సమాధి కట్టాలన్న భక్తుల ప్రయత్నం ఫలించింది. తాత్కాలికమైన అభ్యంతరాలు వచ్చినా అవి భక్తుల పట్టుదల ముందు తలవంచాయి. శ్రీమతి లక్ష్మమ్మ కులం ఏమిటి? అది అనవసరమైన ప్రసక్తి. అక్కడ ఎవరూ ఈ విషయం పట్టించుకునేవారు లేరు. తండోపతండాలుగ జనం పోగయ్యారు. బ్రహ్మాండమైన ఊరేగింపుతో, మేళ తాళాలతో శ్రీమతి లక్ష్మమ్మను ఆమె కూర్చునే చోటులోనే సమాధిగతురాలను చేశారు. ప్రతి సంవత్సరం ఈ తిథి రోజున రథోత్సవం వేలాదిమంది భక్తులతో మహోధ్వజాయమానంగ ఇప్పటికీ జరుగతోంది. శ్రీమతి లక్ష్మమ్మ అమ్మవారి మఠం దిన దిన ప్రవర్థమాన మవుతూనే ఉంది. బ్రహ్మశ్రీ బాలస్వామి, విద్వాన్ కరిబసవ శాస్త్రులు, శ్రీ శివగౌడ్, అమ్మను తమ కవితామృత ధారలతో అభిషేకించారు. భక్తులు విధి విరామం లేకుండా శ్రీమతి లక్ష్మమ్మ అమ్మవారిని సేవిస్తూనే ఉన్నారు. శుక్రవారం విశేష పూజలు అక్కడ జరుగుతూ ఉంటాయి. జాతి మత వర్ణ వర్గ విభేదాలు ఆ తల్లి దగ్గర లేవు. అందరూ ఆమె కరుణా కటాక్ష ప్రసాద లబ్ధాతురులై అమ్మ దరి చేరినవారే. అందరికీ ఆమె జగన్మాతే.

ఇదీ మన సంస్కృతి. ఇదీ హైందవ సంస్కృతి. ఇదీ మనం లోకానికి అందిచ్చిన సంస్కృతి. ఈ మన సంస్కృతి కాపాడుకోవలసిన బాధ్యత మనదే కదా! దీనిని మరచి మధ్యలో వచ్చిన దుష్ట సంప్రదాయాలనే మన సంస్కృతిగా భావించి మన మతాన్ని, మన సంస్కృతిని హేళన చేస్తున్నాం, దూరం చేసుకుంటున్నాం. హైందవ సమాజం భిన్నత్వంలో ఏకత్వం సిద్ధాంతంగ కలది. అదే 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అనే దానికి పరమాత్మ పరంగా అయినా, సమాజ పరంగా అయినా ఏ భావనతో చూసినా ఒక్కటే. మన హైందవ కుటుంబాన్ని మనం కాపాడుకుందాం. దారి మళ్ళిన వారిని తెచ్చుకుందాం. దారి మళ్ళకుండా చూసుకుందాం. సమాజ శ్రేయస్సును, విశ్వ శ్రేయస్సును కోరుకుందాం.